www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 26-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 | సంచిక (Issue) : 329

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: విదియ రా. 11.17 తదుపరి తదియ; నక్షత్రం: ఉత్తర తె. 4.32 తదుపరి హస్త; వర్జ్యం: ఉ.9.33-11.21; దుర్ముహూర్తం: మ.12.52-1.39, మ.3.12-3.58; అమృతఘడియలు: రా.8.23-10.12; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.40, సూర్యాస్తమయం: 6.17

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అబ్బాయిలే పుడుతున్నారు..!

రాష్ట్రంలోని 78 శాతం జిల్లాల్లో మగ పిల్లల జననాలే ఎక్కువ

పెద్దపల్లి జిల్లాలో అత్యధికంగా 69 శాతం మంది అబ్బాయిలు

యథేచ్ఛగా లింగ నిర్ధారణ పరీక్షలే కారణమనే ఆరోపణలు

ఏడు జిల్లాల్లోనే ఆడ పిల్లల పుట్టుక అధికం.. అందులో 4 ఏజెన్సీవే

ఇవన్నీ కూడా ప్రైవేటు ఆస్పత్రులు తక్కువగా ఉన్నవే..! 10

వ్యత్యాసం ఇలాగే పెరిగితే యువకులకు పెళ్లిళ్లు కష్టమే!







సముద్ర గర్భంలో శ్రీకృష్ణుడికి మోదీ పూజలు.. అనంతరం చిరునవ్వులు చిందిస్తూ పైకి వస్తున్న ప్రధాని

మోదీ స్కూబా డైవింగ్

గుజరాత్ సముద్రగర్భంలో ద్వారక సందర్శన.. శ్రీకృష్ణుడికి పూజలు, నెమలి ఈకల సమర్పణ

ద్వారకను స్పృశించినప్పుడు నాటి ప్రాచీన వైభవాన్ని, దివ్యత్వాన్ని అనుభూతి చెందా: మోదీ

దేశంలోనే అత్యంత పొడవైన తీగల వంతెన సుదర్శన్ సేతును ప్రారంభించిన ప్రధాని

కాంగ్రెస్ హయాంలో అన్నీ స్కాంలే.. వాటిని అడ్డుకోవడం వల్లే భారీ ప్రాజెక్టులు వచ్చాయి

నాడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో దేశం ర్యాంకు 11.. ఇప్పుడు 5.. ప్రధాని మోదీ వ్యాఖ్యలు

దేవభూమి ద్వారక, ఫిబ్రవరి 25: సముద్రంలో మునిగిపోయిన ప్రాచీన నగరం ద్వారకను ప్రధాని మోదీ ఆదివారం స్కూబా డైవింగ్ ద్వారా సందర్శించారు. జలగర్భంలో శ్రీకృష్ణుడికి భక్తిపూర్వకంగా ప్రార్థనలు జరిపారు. అనేక సంవత్సరాలుగా ద్వారకను సందర్శించాలని అనుకుంటున్నానని, ఇప్పటికి ఈ కోరిక నెరవేరిందని, ఇదొక దివ్య అనుభూతి అని సముద్రం నుంచి బయటకు వచ్చిన అనంతరం మోదీ పేర్కొన్నారు. గుజరాత్‌లోని ద్వారకలో ప్రధాని మోదీ ఆదివారం పలు అభివృద్ధి పథకాలను

మిగతా 14వ పేజీలో...

రైల్వే ప్రాజెక్టులకు నేడు మోదీ శ్రీకారం 10

27 రాష్ట్రాల్లో రూ.41 వేల కోట్లతో పనులు

22.57 కోట్లతో బేగంపేట స్టేషన్ అభివృద్ధి

హాజరవనున్న తమిళిసై, రేవంత్, కిషన్‌రెడ్డి

కిషన్‌రెడ్డి, సంజయ్, అర్వింద్‌కు టికెట్లు ఖరారు!

పెండింగ్‌లో బాపురావు టికెట్. మూడు రోజుల్లో 10 సీట్లకు బీజేపీ అభ్యర్థుల ప్రకటన!

బీఆర్ఎస్‌తో పొత్తు ఉండదంటూ అధినాయకత్వం సంకేతాలు 13

టీఎస్ బైపాస్!

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు.. ఆఫ్‌లైన్‌లో అనుమతులు

టీఎస్‌బీపాస్‌లో సరైన పత్రాల్లేకున్నా పర్మిషన్లు

తిరిగి ఆన్‌లైన్‌లో నమోదు కాని ఫైళ్లు

ఆఫ్‌లైన్‌లోనూ భద్రపరచకుండా మాయం

పేరున్న రియల్ ఎస్టేట్ సంస్థలు, డెవలపర్ల బహుళ అంతస్తుల ఫైళ్లే అధికం

అన్నీ అక్రమ అనుమతులేనన్న అభిప్రాయాలు

విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశం

హెచ్ఎండీఏ, గ్రేటర్ అధికారుల్లో ఆందోళన



టీఎస్‌బీపాస్.. *భవన నిర్మాణ, లేఅవుట్ అనుమతుల్లో పారదర్శకత పెంచడానికంటూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన పోర్టల్. దరఖాస్తు దగ్గర్నుంచి అనుమతుల దాకా అన్నింటినీ ఇందులో నమోదు చేయడం ద్వారా అవకతవకలను అరికట్టవచ్చన్నది లక్ష్యం. కానీ, నిబంధనల ఉల్లంఘనకు అలవాటుపడిన కొందరు.. టీఎస్‌బీపాస్‌ను బైపాస్ చేసి ఆఫ్‌లైన్‌లో అనుమతులు పొందారు. ఆయా ఫైళ్లను అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా మాయం చేశారు. వందలాది దరఖాస్తులను, ప్రధానంగా బహుళ అంతస్తుల భవనాల దరఖాస్తులన్నింటినీ ఆఫ్‌లైన్‌లోకి మార్చేసి, అనుమతులిచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. బడా రియల్ సంస్థలు, డెవలపర్లకు చెందిన కీలక ఫైళ్లు ఇలా మాయమయ్యాయి. ఈ వ్యవహారంపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.*

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ అనుమతులు వేగవంతంగా, పారదర్శకంగా ఆన్‌లైన్‌లోనే ఇచ్చేందుకు మూడేళ్ల క్రితం నాటి సర్కారు టీఎస్‌బీపాస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏతోపాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో భవన నిర్మాణ అనుమతులు, లేఅవుట్ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. తద్వారా సత్వరమే నిర్మాణ అనుమతులు పొందడంతోపాటు దరఖాస్తు ఏ అధికారి వద్ద ఉందో ఆన్‌లైన్‌లో దరఖాస్తుదారు

మిగతా 13వ పేజీలో...

వైద్య ఆరోగ్యశాఖలో మళ్లీ డిప్యుటేషన్ల దందా..!

వరంగా మారిన సర్కారు ఆదేశాలు

గతంలో విభాగ అధిపతులకే అధికారం

తాజా ఆదేశాలతో డీఎంహెచ్‌వోలకు..

అడ్డగోలుగా దోచేస్తున్న కొందరు డీఎంహెచ్‌వోలు

ఒక్కొక్కరి నుంచి 1-2 లక్షల వరకు వసూలు

డిప్యుటేషన్ రద్దయిన 60% మంది మళ్లీ వెనక్కి! 13



2 వేలకోట్ల డ్రగ్స్ రాకెట్

గుట్టురట్టు

ఓ తమిళ సినీ నిర్మాత మాస్టర్ మైండ్

న్యూజిలాండ్, ఆస్ట్రేలియాకు సరఫరా 14

ఢిల్లీలో ముగ్గురి అరెస్ట్

50 కిలోల కెమికల్ స్వాధీనం

గురుకుల టీజీటీ ఫలితాల వెల్లడి

4006 పోస్టులకు 8,012 మందితో జాబితా

వెల్లడించిన ట్రిబ్ 3

రేపు, ఎల్లుండి ధ్రువపత్రాల పరిశీలన



13

మీడియా అకాడమీ చైర్మన్‌గా

కె.శ్రీనివాస్‌రెడ్డి

శుభాకాంక్షలు తెలిపిన సీఎం

జూలై, ఆగస్టు నెలల్లో గ్రూపు-2,3 పరీక్షలు!

అధికారుల కసరత్తు 3



అగ్రాలో జరిగిన భారత్ జోడో న్యాయ యాత్రలో ప్రజలకు అభివాదం చేస్తున్న రాహుల్, అఖిలేశ్

పొత్తు పొడిచింది!

ఎన్నికల దిశగా.. ఇండియా కూటమి అడుగులు

ఎస్పీ, ఆప్‌లతో ఇప్పటికే కాంగ్రెస్ పొత్తు ఖరారు

ఇతర పార్టీలతో చర్చలు.. త్వరలో ప్రకటన

బెంగాల్‌లో 5 సీట్లు ఇవ్వటానికి దీదీ సుముఖం!

బిహార్‌లో 28:6:6 ఫార్ములా.. మహారాష్ట్రలో మెజారిటీ సీట్లపై మూడుపార్టీల మధ్య అంగీకారం

దేశమంతా 350కిపైగా సీట్లపై అవగాహనకు చాన్స్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జనతాదళ్ (యు), రాష్ట్రీయ లోక్‌దళ్ నిష్క్రమణతో బలహీనపడినట్లు కనిపించిన ఇండియా కూటమి జవసత్వాలు కూడదీసుకొని లోక్‌సభ ఎన్నికల రణరంగానికి సిద్ధమవుతోంది. ముఖ్యంగా యూపీలో ఎస్పీ, కాంగ్రెస్ మధ్య సీట్ల పంపకాలు ఖరారు కావటం, వెంటనే ఢిల్లీ, గుజరాత్, హరియాణా తదితర రాష్ట్రాల్లో ఆప్, కాంగ్రెస్ పొత్తును ప్రకటించటంతో ఇండియా కూటమి తన ఉనికిని చాటుకున్నట్లైంది. ఇతర రాష్ట్రాలకు సంబంధించి కూడా భాగస్వామ్య పార్టీలతో చర్చలు కొనసాగుతున్నాయని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రలపై

మిగతా 14వ పేజీలో...

రేవంత్ సీఎం అని ముందే ప్రకటిస్తే కాంగ్రెస్‌కు

30 కూడా వచ్చేవికావు



నాగర్‌కర్నూల్ పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

వంద రోజులు కాకముందే ప్రజల్లో వ్యతిరేకత

పార్లమెంటు ఎన్నికల్లో గుణపాఠం చెబుతారు

నాలుగు రోజులు అమెరికా వెళ్తే కేటీఆర్ ఇక రాడంటూ ప్రచారం చేశారు

అంతరిక్షంలోకి వెళ్లినా ప్రజలు పిలవగానే వస్తా

24 ఏళ్ల తర్వాత కారు సర్వీసింగ్‌కు వచ్చింది

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలు

నాగర్‌కర్నూల్/అచ్చంపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలకు ముందే కాంగ్రెస్ పార్టీ సీఎం అభ్యర్థిగా రేవంత్‌రెడ్డి పేరును ప్రకటించి ఉంటే.. ఆ పార్టీకి 30 సీట్లు కూడా వచ్చేవి కావన్నారు. ముఖ్యమంత్రి అయి ఉండి, 'లంకె బిందెలున్నాయని వస్తే.. ఖాళీ కుండలే ఉన్నాయి' అని అనడం సీఎం హోదాకు తగదన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి తెలంగాణ ప్రజలు దారుణంగా మోసపోయారని, వంద రోజుల పాలన పూర్తి కాకముందే ప్రభుత్వం ప్రజల్లో వ్యతిరేకతను మూటగట్టుకుందని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో 420 హామీలతో వంచించిన కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో జనం గుణపాఠం చెబుతారని అన్నారు. పార్లమెంటు ఎన్నికలకు బీఆర్ఎస్ క్యాడర్‌ను సమాయత్తం చేసే దిశగా ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లాలోని అచ్చంపేట, నాగర్‌కర్నూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశాలకు కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం, ఆ తర్వాత పదేళ్ల అధికారంలో బీఆర్ఎస్.. తెలంగాణ సమాజం కోసం, ఇక్కడి ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు విశేషమైన కృషి చేసిందని చెప్పారు. బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణ సమాజాన్ని మోసం చేయడానికి కుయుక్తులు పన్నుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు ఎంతవరకు వచ్చిందని కేటీఆర్ ప్రశ్నించారు. రైతుబంధు ఇవ్వకుండా తాత్సారం చేయడంతోపాటు వ్యవసాయ రంగానికి కరెంట్

మిగతా 10వ పేజీలో...

ఎన్నికలున్నాయి.. విచారణకు రాలేను

పార్టీ నాకు బాధ్యతలు అప్పగించింది

ఆరు వారాల షెడ్యూల్ ఖరారైంది

కావాలంటే వర్చువల్‌గా జవాబులిస్తా

విచారణకు పిలవబోమని గతంలో సొలిసిటర్ జనరల్ హామీ ఇచ్చారు

అది మీకూ వర్తిస్తుంది.. నోటీసులను ఉపసంహరించుకోండి!

సీబీఐకి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత లేఖ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ప్రచార బాధ్యతలు తనపై ఉన్నందున విచారణకు హాజరు కాలేనని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత.. సీబీఐకి తెలియజేశారు. ఢిల్లీ మద్యం విధానానికి సంబంధించిన కేసులో సోమవారం విచారణకు హాజరు కావాలని సీఆర్పీసీ సెక్షన్ 41 కింద కవితకు సీబీఐ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీనిపై కవిత స్పందిస్తూ.. ఆదివారం సీబీఐకి లేఖ రాశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తమ పార్టీ తనకు కొన్ని బాధ్యతలు అప్పగించిందని, రానున్న ఆరు వారాల పాటు రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రచారం, సమావేశాల

మిగతా 10వ పేజీలో...



బకాయిలు 57,399 కోట్లు

నీటి పారుదల, విద్యుత్తు శాఖల్లో గత ప్రభుత్వం మిగిల్చిన బాకీలివీ

2014 జూన్ 2 నాటికి ఉన్న బకాయిలు రూ.1,595 కోట్లే..

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ రెండు శాఖల పరిధిలో రూ.57,399 కోట్ల బకాయిలను కొత్త ప్రభుత్వానికి గుదిబండగా మిగిల్చిపోయింది. 2014 జూన్ 2వ తేదీకి ముందు వివిధ ప్రభుత్వ శాఖలు డిస్కమ్‌లకు రూ.1,595 కోట్ల దాకా బకాయి ఉండగా... తర్వాత పదేళ్ల

మిగతా 10వ పేజీలో...

కడుపు నింపేవి.. కలుపు మొక్కలే..!

కొనుక్కొని మరీ తింటున్న ప్రజలు.. గాజాలో ఆహార సమస్య తీవ్రం

జబాలియాలో గుర్రాల్నీ తింటున్న శరణార్థులు.. రంజాన్‌లోగా కాల్పుల విరమణ?



ఖాన్‌యూనిస్, ఫిబ్రవరి 25: ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం గాజా వాసుల ఆకలి కేకలకు కారణమవుతోంది. ఇజ్రాయెల్‌పై దాడిలో ఐక్య రాజ్య సమితి(ఐరాస) అనుబంధ సంస్థ యూఎన్ఆర్‌డబ్ల్యూఏ సిబ్బంది పాత్ర వెలుగులోకి వచ్చాక.. ఆ సంస్థ కూడా గాజా నుంచి పూర్తిగా వైదొలగింది. ఇంతకాలం శరణార్థులకు అన్నపానీయాలను అందించిన యూఎన్ఆర్‌డబ్ల్యూఏ గాజాను వీడడంతో.. ఆకలి కేకలు పెరిగాయి. ముఖ్యంగా 22 లక్షల జనాభాలో 80% మంది దక్షిణ గాజాలోని రఫాలో తలదాచుకుంటుండగా.. ఆ ప్రాంతంలో

మిగతా 14వ పేజీలో...



ఆధునీకృత & వేగవంతమైన రైల్వే

మోదీ ప్రభుత్వం యొక్క గ్యారంటీ

శంకుస్థాపన, ప్రారంభోత్సవం & జాతికి అంకితం

అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద 554 రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి మరియు 1500 రోడ్డు ఓవర్ బ్రిడ్జీలు / అండర్‌పాస్‌లను రూ. 41000 కోట్లతో







తెలంగాణలో

15 స్టేషన్ల పునరాభివృద్ధి

■ జడ్చర్ల	■ మేడ్చల్	■ వరంగల్	■ నల్గొండ	■ ఉందానగర్
■ గద్వాల్	■ పెద్దపల్లి జంక్షన్	■ బేగంపేట్	■ మిర్యాలగూడ	■ బాసర్
■ షాద్‌నగర్	■ మంచెరియాల్	■ వికారాబాద్ జంక్షన్	■ మెదక్	■ యకుత్‌పుర

- రూఫ్ ప్లాజా, షాపింగ్ జోన్, ఫుడ్ కోర్టు, పిల్లల ఆట ప్రదేశం మొదలైన సౌకర్యాలతో స్టేషన్లను నగర కేంద్రాలుగా పునరాభివృద్ధి చేయడం
- ప్రవేశ & నిష్క్రమణలకు వేర్వేరు మార్గాలు, బహుళ అంతస్తుల పార్కింగ్, లిఫ్ట్, ఎస్కలేటర్, ఎగ్జిక్యూటివ్ లాంజ్, వెయిటింగ్ ఏరియా, ట్రావెలేటర్, వికలాంగులకు సౌకర్యాలు
- మల్టీ మోడల్ అనుసంధానంతో పునరాభివృద్ధి చేయబడిన స్టేషన్లు ఈ ప్రాంతంలో సామాజిక- ఆర్థిక కేంద్రాలుగా మారతాయి

మరియు

48 రోడ్ ఓవర్ బ్రిడ్జీలు / అండర్‌పాస్‌ల నిర్మాణం

- అవాంతరాలు లేని రైళ్ల & రోడ్ వాహనాల రాకపోకలు
- రైల్వే ట్రాక్‌ల వద్ద స్థానికులకు సురక్షితమైన & సౌకర్యవంతమైన మార్గాల ఏర్పాటు
- అంతరాయం లేని ట్రాఫిక్, ప్రయాణ సమయంలో తగ్గుదల

నరేంద్ర మోదీ

ప్రధాన మంత్రి
గారిచే

26 ఫిబ్రవరి, 2024 | ఉదయం 11:00 గం॥ల నుండి

(వీడియో కాన్ఫరెన్స్ ద్వారా)

వీరి గౌరవ సమక్షంలో

అశ్విని వైష్ణవ్
రైల్వే, కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ మంత్రి

రావ్ సాహెబ్ పాటిల్ దాన్వే
రైల్వే, బొగ్గు మరియు గనుల శాఖ సహాయ మంత్రి

దర్శన జర్దోష్
రైల్వే మరియు వస్త్ర పరిశ్రమ శాఖ సహాయ మంత్రి

PUB0192 A0234

DD NEWS లో ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించగలరు

జూలై, ఆగస్టు మాసాల్లో గ్రూపు-2,3 పరీక్షలు!

తేదీల ప్రకటనపై అధికారుల కసరత్తు.. ఎల్లుండి నుంచి ఇంటర్ పరీక్షలు

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గ్రూపు-2,3 పరీక్షల నిర్వహణపై అధికారులు దృష్టిని సారించారు. పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ రెండు గ్రూపు పోస్టుల పరీక్షలను జూలై, ఆగస్టు మాసాల్లో నిర్వహించే అవకాశం కనిపిస్తున్నది. ఇప్పటికే ప్రకటించిన గ్రూపు-1 పరీక్షతో పాటు, ఇతర పోటీ పరీక్షల షెడ్యూల్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ పరీక్షల తేదీలను ప్రకటించాలని చూస్తున్నారు. మొత్తం 783 గ్రూపు-2 పోస్టుల భర్తీ కోసం గత ప్రభుత్వం నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ పోస్టుల కోసం సుమారు 5.51 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. మొదట నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం గత ఏడాది ఆగస్టు 29,30వ తేదీల్లో పరీక్షలను నిర్వహించాల్సి ఉంది. అయితే.. పేపర్ లీకేజీ వ్యవహారం బయటకు రావడంతో ఆ పరీక్షలను వాయిదా వేసి గత నవంబరు 2,3వ తేదీల్లో పరీక్షలను నిర్వహించాలని నిర్ణయించారు. అభ్యర్థుల ఆందోళనతో ఈ పరీక్షలను వాయిదా వేసి, ఈ ఏడాది జనవరి 6,7వ తేదీల్లో నిర్వహించాలని నిర్ణయించారు. అయితే టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల రాజీనామా వంటి పరిణామాలతో ఈ పరీక్షలను మరోసారి వాయిదా వేశారు. అలాగే.. గ్రూపు-3 పోస్టులకు సంబంధించిన పరీక్ష తేదీలను కూడా ప్రకటించాల్సి ఉంది. సుమారు 1,363 గ్రూపు-3 పోస్టుల భర్తీ కోసం గత ప్రభుత్వం నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ పోస్టుల కోసం 5.8 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే.. ఇప్పటివరకు ఈ పోస్టుల భర్తీ కోసం పరీక్షల తేదీలను ప్రకటించలేదు. ఇక గ్రూపు-1 నోటిఫికేషన్‌ను రద్దు చేసి, మళ్లీ కొత్తగా జారీ చేసిన విషయం తెలిసిందే. దీని ప్రకారం గ్రూపు-1 పోస్టులకు సంబంధించి మే, జూన్ మాసాల్లో ప్రిలిమినరీ పరీక్షతో పాటు, సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో మెయిన్ పరీక్షలను నిర్వహించాలని నిర్ణయించారు. ఈ ప్రిలిమినరీ, మెయిన్ పరీక్షల మధ్యలో గ్రూపు-2,3 పోస్టులకు సంబంధించిన పరీక్షలను నిర్వహించాలని టీఎస్‌పీఎస్సీ అధికారులు ఆలోచిస్తున్నారు. ముఖ్యంగా జూలై, ఆగస్టు మాసాల్లో అయితే.. ఇతర పోటీ పరీక్షలు ఉండవు. కేంద్ర ప్రభుత్వ స్థాయిలో ఉండే పరీక్షల షెడ్యూల్‌ను పరిశీలించి అనంతరం, గ్రూపు-2,3 పోస్టుల పరీక్షలను ప్రకటించాలని భావిస్తున్నారు. త్వరలోనే దీనిపై స్పష్టత ఇచ్చే అవకాశం కనిపిస్తున్నది.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఈ నెల 28 నుంచి రాష్ట్రంలో ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలో సుమారు 9.8 లక్షల మంది విద్యార్థులు పరీక్షలను రాయనున్నారు. ఇందుకోసం 1521 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. గతంలో పరీక్ష పేపర్ లీకేజీ వంటి సంఘటనలు జరిగిన దృష్ట్యా ఈ సారి పటిష్ఠ చర్యల్ని తీసుకుంటున్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఉన్నతాధికారులు సహా ఇతర ఉద్యోగులు సెల్ ఫోన్‌లను తీసుకెళ్లడాన్ని నిషేధించారు. పరీక్షా ప్రశ్నాపత్రాలను స్ట్రాంగ్ రూమ్‌లకు లేదా మూల్యాంకన కేంద్రాలకు తీసుకెళ్లేటప్పుడు పటిష్ఠమైన బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించడానికి వీలుగా ప్రత్యేక కౌన్సెలింగ్ కేంద్రాలను కూడా ఏర్పాటు చేశారు.

గురుకుల టీజీటీ ఫలితాల వెల్లడి

- సబ్జెక్టుల వారీగా 4006 పోస్టులకు 8,012 మందితో జాబితా ప్రకటించిన ట్రిబ్
- రేపు, ఎల్లుండి ధ్రువపత్రాల పరిశీలన
- 2-3 రోజుల్లో డీఎల్, జేఎల్ ఫైనల్ లిస్ట్!

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, సాధారణ గురుకులాల్లోని ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (టీజీటీ) పోస్టుల ఫలితాలు వెల్లడయ్యాయి. తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామక బోర్డు (ట్రిబ్) ఆదివారం ఈ ఫలితాలను వెల్లడించింది. సబ్జెక్టుల వారీగా 4,006 పోస్టులకు ఎంపికైన వారి మెరిట్ జాబితాను బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. 1:2 నిష్పత్తిలో 8,012 మంది అభ్యర్థులను ఎంపిక చేయగా.. ఈ నెల 27, 28 తేదీల్లో ధ్రువీకరణ పత్రాలను పరిశీలించనున్నట్లు తెలిపింది. సబ్జెక్టుల వారీగా ఉదయం 7 గంటల నుంచి; మధ్యాహ్నం 1 గంట నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం; బంజారాహిల్స్‌లోని ఆదివాసీ, బంజారా భవన్‌లో నిర్వహించనున్నారు. ఇంకా ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్ల పోస్టుల ఫలితాలను వెల్లడించాల్సి ఉంది. మరోవైపు ఇప్పటికే సర్టిఫికెట్ వెరిఫికేషన్, డెమోలను పూర్తిచేసుకున్న డిగ్రీ, జూనియర్ లెక్చరర్ పోస్టులకు ఎంపికైన వారి తుది జాబితాను కూడా బోర్డు రెండు, మూడు రోజుల్లో వెల్లడించనుంది.

కోడ్ వచ్చేలోపు.. ఖాళీల భర్తీ

రాష్ట్రంలోని సంక్షేమ గురుకులాల్లో ఉన్న 9,210 పోస్టుల భర్తీకి గత ఏడాది నోటిఫికేషన్ ఇచ్చి, ఆగస్టులో పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో ఫలితాల వెల్లడి, భర్తీకి ఆటంకం ఏర్పడింది. ఆ తర్వాత జనవరి నుంచి పోస్టుల భర్తీలో అధికారులు వేగం పెంచారు. ఇప్పటికే 2 వేల పోస్టులను భర్తీ చేశారు. ఆ వెంటనే డిగ్రీ, జూనియర్ కాలేజీ లెక్చరర్ పోస్టుల మెరిట్ జాబితాలను ప్రకటించిన అధికారులు వాటి తుది ఫలితాలపైనా కసరత్తు చేస్తున్నారు. గురుకుల ఖాళీల భర్తీలో అధిక పోస్టులున్న టీజీటీకి కూడా మెరిట్ జాబితాను బోర్డు వెల్లడించింది. తుది జాబితాను ప్రకటించి, ఆ వెంటనే ఆర్ట్ టీచర్ 132, క్రాఫ్ట్ టీచర్ 90, మ్యూజిక్ టీచర్ 120 పోస్టుల మెరిట్ జాబితాలను కూడా వెల్లడించేందుకు చర్యలు తీసుకుంటోంది. లోక్‌సభ ఎన్నికల కోడ్ వచ్చేలోపే ఖాళీలను భర్తీ చేయాలని బోర్డు నిర్ణయించినట్లు సమాచారం.

దుబాయిలో తెలుగు ముఠాల బ్యాంకు మోసాలు

- ఉద్యోగుల పేరిట క్రెడిట్ కార్డులు, అప్పులు చేసి ఎగవేత
- తెలుగు రాష్ట్రాల నుంచి యువకుల్ని రప్పించి దందా

(గల్ఫ్ నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి)

దుబాయిలో ఉపాధి వీసాపై పనిచేసేవారికి బ్యాంకు రుణాలు, క్రెడిట్ కార్డులు సునాయాసంగా లభించే అవకాశం ఉండడంతో.. కొందరు తెలుగు ప్రవాసీ వ్యాపారవేత్తలు దాన్ని దుర్వినియోగం చేసి భారీ మోసాలకు పాల్పడుతున్నారు. ఈ దందా కోసమే నకిలీ కంపెనీలను సైతం సృష్టించి.. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి యువకులను తీసుకొచ్చి ఈ కుంభకోణానికి పాల్పడుతున్నారు. దుబాయిలో వేజ్ ప్రొటెక్షన్ సిస్టమ్ ప్రకారం.. పదో తరగతి ఉత్తీర్ణులయి ఎలాంటి సాంకేతిక నైపుణ్యం లేనివారికి పది, పదిహేను వేల దిర్హాంల (దాదాపు రూ.2-3 లక్షలు) చొప్పున వేతనాన్ని జమచేస్తున్నట్టు చూపిస్తున్నారు. దాని ఆధారంగా వారి పేరిట బ్యాంకు రుణాలు, క్రెడిట్ కార్డులు తీసుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో.. యువకుల సమ్మతితోనే వారికి ఆకర్షణీయ ప్యాకేజీలు ఇచ్చి దుబాయికి తీసుకొచ్చి, బ్యాంకు రుణాల్లో చెరిసగం అని చెప్పి ఒప్పించి అప్పులు తీసుకుంటున్నారు. తర్వాత వారి చేతిలో ఎంతో కొంత పెట్టి సింహభాగం స్వాహా చేస్తున్నారు. ఇలా ముందస్తు సమ్మతితో దుబాయికి వెళ్లిన ఆర్మూర్ (నిజామాబాద్ జిల్లా) వాసులు కొందరు వాటాల పంపకంలో తేడాలు రావడంతో ఇటీవల ఇండియాకు తిరిగొచ్చి పోలీసులకు ఈ దందాపై ఫిర్యాదు చేశారు. రుణాలు తీసుకుని, క్రెడిట్ కార్డులు వాడేసి.. తిరిగి చెల్లించనివారి పేర్లను అధికారులు బ్లాక్‌లిస్టులో పెడతారు. దేశం విడిచి వెళ్లకుండా ఆంక్షలు విధిస్తారు. అందుకే.. తెలుగు రాష్ట్రాల నుంచి యువకుల్ని తీసుకొస్తున్నవారు వారి పేరిట మంజూరైన క్రెడిట్ కార్డులను వాడేసి, నగదు తీసుకుని.. తిరిగి బ్యాంకులకు చెల్లింపులు చేయాల్సిన సమయానికంటే ముందు సదరు యువకులను స్వదేశానికి పంపేస్తున్నారు. దీంతో పొరపాటున వారు తర్వాత ఎప్పుడైనా దుబాయికి వస్తే విమానాశ్రయంలోనే అరెస్ట్ చేస్తారు. పాండు కార్డులుగా దుబాయిలోని తెలుగు వర్గాల వారు పిలిచే ఈ క్రెడిట్ కార్డుల దందాకు.. తెలంగాణలో ఇటీవల ఎన్నికల్లో పోటీచేసిన నాయకుడొకరు శ్రీకారం చుట్టగా, ఇప్పుడు ఇతరులు అనుసరిస్తున్నారని తెలుస్తోంది.

ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు నక్సల్స్ మృతి

- ఐఈడీ పేలి ఓ జవాను దుర్మరణం.. ఛత్తీస్‌గఢ్‌లో రెండు వేర్వేరు ఘటనలు

దుమ్ముగూడెం, కాంకేర్, బీజాపూర్, ఫిబ్రవరి 25: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్ జిల్లాలో ఆదివారం పోలీసులు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. కోయల్‌బేడీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బుర్కలంక అటవీప్రాంతంలో మావోయిస్టులు సమావేశమయ్యారనే సమాచారం మేరకు బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, డీఆర్జీ బలగాలు కూంబింగ్‌కు వెళ్లాయి. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య కాల్పులు జరిగాయి. కాల్పుల అనంతరం పరిశీలించగా ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలతో పాటు రెండు తుపాకులు ఘటనా స్థలంలో లభించాయి. మరో ఘటనలో బీజాపూర్ జిల్లా మిర్‌తుర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బేచాపాల్ నాలా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన ఐఈడీ పేలడంతో సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్స్ హెడ్ కానిస్టేబుల్ రామ్ ఆశిష్ మృతి చెందారు.

ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం ఎప్పుడు?

- సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీని విలీనం చేయడంతో పాటు, మార్చి నెల నుంచైనా సంస్థ ఉద్యోగులకు ప్రభుత్వ ఖజానా నుంచి వేతనాలు చెల్లించాలని మాజీ మంత్రి టి.హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం ప్రవేశపెట్టిన తర్వాత ఉద్యోగులు, కార్మికులు ముఖ్యంగా మహిళా కండక్టర్లపై పని భారం చాలా పెరిగిందని, వారి అదనపు శ్రమను దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ విలీనానికి 'అపాయింటెడ్ డే' ప్రకటించి, జీఓను విడుదల చేయాలని కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టి రెండున్నర నెలలైనా.. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయకపోవడంతో ఆ సంస్థ కార్మికులు, ఉద్యోగుల్లో అయోమయం నెలకొందని పేర్కొన్నారు. అధికారం చేపట్టిన వెంటనే ఆర్టీసీని ప్రభుత్వంలో కలుపుతామని, కార్మికులకు ప్రభుత్వమే జీతాలు చెల్లిస్తుందని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందని ఆ లేఖలో పేర్కొన్నారు. మహిళా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని మరో 2000 బస్సులను అదనంగా కొనుగోలు చేయాలని కోరారు.



ఒక అలౌకిక తలపోత

తోడిన మట్టిలో
వెలుగు చూస్తూ చూస్తూ
మొన్నెప్పుడో రావాల్సిన కల
వాయిదా పడింది
రేపయినా వస్తుందో లేదో

తవ్వకం అంటే ఎదురుచూపు

అడుగంటూ పడితే
దారులు వాటంతటవే ఏర్పడతాయిలే అని
కొన్ని తీర్థయాత్రలను కలగన్నాను
గుడిలో పొర్లుదండాల
ఆత్మ తివాచీ
విప్పుకోవడం ఇలగన్నాను
గడ్డపారకు
ఏదో ఒక ఖంగు తగలకపోదు

తవ్వకం అంటే ఒక పునశ్చరణ

ఆధ్యాత్మికత వెచ్చగా ఉండడం తెలుసా
పోనీ చల్లగా ఉండడమైనా తెలుసా
విస్మయం ఆశ్చర్యపరచకపోవడం తెలుసా
రహస్యం తొంగిచూపు ఎప్పుడూ
దొడ్డిదారిలోంచే
ప్రతి ఎదురుచూపులో
ఒక పలకరింపు

తేదీ మారింది కనుక
అర్ధరాత్రి తెల్లారినట్టు కాదు

తవ్వకం ఒక చట్టబద్ధత

వెలుగు కాలం చేసినా
చీకటి కొండెక్కదు
కృత్రిమ మేధతో
దేవుడు రాయించుకున్న వీలునామాను
మరణవాంగ్మూలమని పొరబడాలని

వాడి వ్యూహం

తవ్వకం ఒక ఎత్తుగడ

బౌద్ధకథ పైన
సింధూ మహాసముద్రము
ఆ నడుమ ఇలల్లాహీ
తవ్వాలి
ఇంకొంచెం చాలా మరింత
అనంత అగాధ ఆదిమ
పాతాళ అట్టడుగుల్లోకి తవ్వాలి
మనం దాచిందే మనం అందిపుచ్చుకోవాలి

ఆరామాల విరామంలో
కూల్చివేతల సారంగం
తవ్వకాల్లోనేగా తేలేది

ధరిత్రి మనోభావాలకు
దొంగ భాషనేర్పడం
నీ రంధ్రంలో నువ్వే తవ్వుకోవడం

తవ్వకం
రూపం కుదరని ఆహార్యం

తవ్వకం
కళ్ళున్న వేలికొసల లిపి
తవ్వకం
యాగఫల పూర్ణాహుతి

తవ్వకం ఎక్కడిక్కైనా పాకొచ్చు
నీ వాకిలిలోకి నీ వసారాలోకి
నీ పడగ్గదిలోకి నీ విశ్వాసంలోకి

వెయ్యేర పోటూ హైస్సా
ఇంకొక పోటూ హైస్సా

ఒక పాళీ విరిగింది
కాదు కాదు
కొన్ని పాళీలు విరిగాయి
అయినా
కొత్త శాసనం రాయాలి

బండ పడింది
కొత్త విగ్రహం చెక్కాలి

ప్రసేన్
98489 97241

పురస్కార ప్రదానోత్సవం

కొలకలూరి పురస్కారాల ప్రదానోత్సవం ఫిబ్రవరి 26 సా.6గంటల నుంచి 8గంటల వరకు ఎన్టీఆర్ కళా ప్రాంగణం, పొట్టిశ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి, హైదరాబాద్‌లో జరుగుతుంది. మల్లు భట్టి విక్రమార్క, టీ. కిషన్ రావు, కొలకలూరి మధుజ్యోతి, చిలుమూరి శ్రీనివాసరావు, కొలకలూరి సుమకిరణ్ పాల్గొంటారు. కొలకలూరి భాగీరథీ కథానిక పురస్కారాన్ని హుమాయున్ సంఘీర్, కె.వి. మేఘనాథరెడ్డి; విశ్రాంతమ్మ నవలా పురస్కారాన్ని దిలావర్, సింహప్రసాద్; విమర్శ పురస్కారాన్ని సుంకిరెడ్డి నారాయణరెడ్డి, వి. రాజారామమోహనరావు స్వీకరిస్తారు. పరిశోధకులు గడ్డం తిరుపతమ్మ, దుగులూరి సురేఖలకు సన్మానం ఉంటుంది. వివరాలకు: 93930 99035.

కె. ఆశాజ్యోతి జనార్దనం

అభినందన సభ

తెలంగాణ రాష్ట్ర గీత రచయిత 'అందెశ్రీ'కి ఆత్మీయ అభినందన సభ ఫిబ్రవరి 29 ఉ.10 గంటలకు ఎన్టీఆర్ కళా ప్రాంగణం, పొట్టిశ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభాధ్యక్షులు కొలకలూరి ఇనాక్, ముఖ్య అతిథి కె. శ్రీనివాస్. సభలో నగ్నముని, వోలేటి పార్వతీశం, వలేటి గోపీచంద్ పాల్గొంటారు.

సి.యస్. రాంబాబు

కథా గౌరవ సభ

మధునాపంతుల వేంకటేశ్వర్లు కథా గౌరవ సభ మధునాపంతుల కామరాజు సాంస్కృతిక ప్రాంగణం, పల్లిపాలెంలో మార్చి 3 ఉ.10 గంటలకు జరుగుతుంది. కథా గౌరవ పురస్కారాన్ని చింతకింది శ్రీనివాసరావు, ఎండపల్లి భారతి, భగవంతం స్వీకరిస్తారు. వీరి కథలపై ఆకుల మల్లేశ్వరరావు, అనిల్ డ్యానీ, వంశీకృష్ణ విశ్లేషణ చేస్తారు. వివరాలకు: 97041 86544.

కిరణ్ మధునాపంతుల

'అక్షరోత్సవం' కార్యక్రమం

చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు టౌన్ హాలు ఏసీ రీడింగ్ రూములో మార్చి 3 ఉ.10 గంటలకు 'అక్షరోత్సవం' కార్యక్రమం జరగనుంది. తుంగా శివప్రభాత్ రెడ్డి, నందమూరి లక్ష్మీపార్వతి హాజరవుతారు. చిన్ని నారాయణరావు ఫౌండేషన్ ప్రధాన అవార్డును యాకుబ్; సాహిత్య పురస్కారాలను బంగార్రాజు కంఠ, కలిమిశ్రీ స్వీకరిస్తారు. వివరాలకు: 94402 02942

చిన్ని నారాయణరావు

జలకవనం

అనంతపురం జిల్లా పెనుకొండలోని గగన్ మహల్ వేదికగా మార్చి 3న ఉ.10.30 నుండి రాత్రి 7 వరకు జలకవనం నిర్వహిస్తున్నాం. రాష్ట్రం నలుమూలల నుండి కవులు పాల్గొని తమ ప్రాంత నీటి కష్టాలను కవితలుగా, పాటలుగా వినిపించవచ్చు. జలకవనంలో చదివిన కవితలన్నీ సంకలనంగా తీసుకువస్తాం. పాల్గొన్న ప్రతివొక్కరికీ ప్రసంశా పత్రాలు అందిస్తాం. పేర్లనమోదు కొరకు: ఎ. హరి (9491355200), పి. రాజశేఖర్ రెడ్డి (9441508510)లను సంప్రదించవచ్చు.

ఎ. హరి

నాగభైరవ సాహితీ పురస్కారం

నాగభైర్వ సాహిత్య పీఠం పురస్కారం కోసం 2020 - 2022 మధ్య కాలంలో లఘు కవితా రూపాలైన నానీలు, హైకూలు, రెక్కలు, రవ్వలు, కిరణాలు, మణిపూసలు వంటి ప్రక్రియల్లో వెలువడిన ముద్రిత గ్రంథాలను ఆహ్వానిస్తున్నాం. ప్రథమ, ద్వితీయ బహుమతులు వరుసగా రూ.10వేలు, రూ.5వేలు. నాలుగు ప్రతులను మార్చి 30లోగా చిరునామా: నాగభైరవ ఆదినారాయణ, 202, శ్రీవెంకటసాయి రెసిడెన్సీ, 2వ లైను, రామయ్య నగర్, ఒంగోలు - 523002, ఫోన్: 98497 99711కు పంపాలి. విజేతలకు ఆగస్ట్ 18న ఒంగోలులో జరిగే సభలో బహుమతి ప్రదానం జరుగుతుంది.

నాగభైరవ ఆదినారాయణ

వివిధ

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

ఎప్పటికీ నిద్రపోని జ్వర జ్ఞాపకం


అతని కవిత్వం ఎప్పటికీ కొత్త మెత్తటి యాప పూల గాలి, వొక ఖండాంతర క్షిపణిని కూడా ఎగిరిపోనీయకుండా లోయలో కట్టి బంధించగల గాఢ స్నిగ్ధత, మాధుర్యం, సత్యాకర్షణ, మార్దవం అతని వాక్యం. వొక నది గాని, నెర్రెలీనిన నేల గాని, ఊరోళ్ళంతా ఖాళీ చేసి వెళ్ళిపోయిన ఊరు గాని, చేదబాయి గాని, చింతలతోపు గాని తమ గురించి తాము ఎతలెత్తుకుంటూ పాటగా వొలికిపోతే అది తన మాట, అతనే గుల్జార్.

విడిపోయే ముందు కౌగిలించుకొని ఏడుస్తూ, వొశ పట్టని దుఃఖాల్ని జేబులో నింపుకోవటమే, విడిపోవటమే అతని కవిత్వం. ఉర్దూ భాష తన ప్రియురాలు. అతని గొంతులో చిర్రా చిటికెన పుల్లలతో దరువులేస్తూ, హిదూస్థానీ దిల్ రుబా తీగలతో తారాసప్తకంగా ఏకాంతమవుతూంటుంది. కాల నియమాలను, గతినీ, అవధులనీ చెరిపిన వైనం అతని కథా కథన వైనమంతా. మైదానాలలోని, బస్తీలలోని మలుపుల మరకలల్లో అస్తవ్యస్తంగా వొదిలిపోయిన రక్తం మరకల సామాన్లు, రబ్బరు బొమ్మలు, విరిగిపోయిన ఆటవస్తువులూ, తన, వాక్యాలూ, మెటఫర్ల తూణీకలు. చాలావరకు గుల్జార్ కవిత్వమంతా oral narrative గానే కనిపించి దప్పికను తీరుస్తూ వుంటుంది. దూపను ఎగదోస్తూనే వుంటుంది. కవిత్వం recite చేస్తుంటే, ముందు అతని శబ్ద శ్రావ్యత పాఠకుడిని నిలబెడుతుంది. తరువాత... వొక అర్థం తెర లేపి ముందు నిలుస్తుంది. అటు తరువాత వొక అమేయమైన మానవీయ జీవానుభవం ఆవిష్కృతమవుతుంది.

> **అతను నడుస్తూ చెట్లోలె కవిత్వం రాలుస్తూ పోతుంటాడు. పాకాల చెరువు నిద్రలో సణుగుతున్నట్టు అతని కంఠనాళం ఉర్దూని జీవ స్వరంలో వొంపుతూంటుంది. తన కవిత్వంలోని మార్దవానికి అర్ధరాత్రి ఆకలితో నిద్రలేచిన పసివాడికి జొన్నగట్క తినిపించిన అమ్మ యాదికొస్తుంది. వలసపోయిన తరువాత మొఖం కళ తప్పిన ఊరు ఎదురు వస్తూంటుంది.**

గుల్జార్ జీవించి నడవడమే వొక వాక్యంగా వొలికిపోవడమే వొక రసవత్తర వైనం. స్పష్టతకు వొదగని గుణం. తన కవిత్వంలో అన్ని కాలాలూ వుంటాయి. అన్ని ఋతువులూ వుంటాయి. అన్ని పొరలూ, జీవ మరలూ, అనంత దుఃఖాల అరలూ మసలుతూ వుంటాయి. కాని మనిషి మాత్రమే వొక్కడయ్యి నిలబడి వుంటాడు. హేతుబద్ధతని నిరసిస్తూనే, హేతువుకొదగని అమానుష చర్యలను దుగోడపడ్తూ... తనను కూడా దుఃఖ తత్త్వంలో చెక్కుకుంటూ పోతూంటాడు. అతని బాష మత్తులో మునిగిపోయి జీవించడంలో ఈత కొడుతూ, ఉర్దూ, ఫార్సీ, బెంగాలీ, పంజాబీ భాషల్లో వొడ్డుకు వచ్చి, శరీరాన్ని ఆరబెట్టుకుని... మళ్ళీ తడవటానికి జీవితంలోకి మునిగిపోయి, లోపలి చీకటి నెగడును ఎగదోస్తూనే వుంటూంది.

ఎన్నో కవిత్వ ముషాయిరాల్లో ఆయన గొంతు పాఠకుడికి శ్రవణ మాధుర్యాన్ని సానపెడతూ ఉంటుంది. ఆయన కవిత్వాన్ని చదువుతుంటే వినడం, చదవడం కంటే గొప్ప రసోద్రేకాల్ని కలిగిస్తూ వుంటుంది. వొక్కో పదానికి వొక వైఖరి, వొక పెర్ఫార్మెన్స్ వుంటుంది. అది ఉర్దూ భాషలో ఉందా? లేక తన భాషా సంలీనతలో వుందా అన్నది తేల్చిచెప్పలేని రహస్యం. అతని ధారణ మొత్తం వొక ధ్వని శ్రావ్యత లేక నిశ్శబ్ద శ్రావ్యతగానే పాఠకుడు అనుభవపూర్వకంగా చెప్పవచ్చేమో. అందుకే పాఠక శ్రోతలకు timeless journeyని పరిచయం చేస్తూంటాడు. తన వచనం, లయసరళిలో మునిగి... ముచ్చట, వచనంగా, తెగని ప్రవాహంగా నడిచి వస్తూంటుంది. దాని గుణ ప్రభావం వలన ఆ వాక్య రూపాల గమకాలను, స్థిరంగా చలించే స్వర అచలనాన్ని పాఠక శ్రోత అనుభవంలో తెచ్చుకుంటాడు. భాష అచ్చమయిన వచన సామాగ్రితో, కవిత్వ పనిముట్లతో పాఠకుడిని గంటలకొద్దీ నిలబెట్టి ముచ్చట చెబుతుంటుంది. ఆ ముచ్చటలో జీవానుభవం కలుగుతూన్న కొద్దీ కవీ,



పాఠకుడూ ఒక్కరిగా మారిపోయి.. రంగస్థలం కరిగిపోయి.. కేవలం ఒక ప్రేక్షకుడు మాత్రమే మిగిలిపోయి వుంటాడు. కాలం సన్నబడిపోతుంది. చరిత్రలోని తేదీలూ, సంఖ్యలూ, లెక్కలూ, గుణ నిర్ధారణలూ కరిగిపోయి.. కేవలం మానవానుభవమే మిగిలిపోయి, మానవుడే నిలబడి ముచ్చట తనకు తానే వినిపిస్తూంటాడు. శుద్ధ భౌతిక మానవుడి ఆత్మరోదన, వొంటరితనం, క్షోభ, ఆరోపణ, అంతరంగంలోని ఎడతెగని విధ్వంసం, తమ గూడును తామే కాల్చుకుని వలసలు పోయే పక్షుల నిస్సహాయత అనుభవానికి వస్తుంది. అంతర్లమవుతుంటుంది. మన పంచేంద్రియాలకు సునిశితత్వపు దిక్కు దారి దొరుకుతుంది. వాటి అర్థాలు మరింత లోతుగా మరింత విస్తృతంగా మనకు అర్థమవుతుంటాయి. స్వరపదాలు మనసుకు తగులుతూ వుంటే పంచభూతాల సరిహద్దులు కూడా చెదిరి ముక్తమవుతుంటాయి. మాటా పాటా కలిసి జుగల్‌బందీతో ప్రదర్శన మొదలవుతుంది. శ్రుతంగా వొక పదచిత్రం, వొక చెట్టునూపే గాలితో కలిసి దరువులేస్తూ పాడుతుంది. గుల్జార్ కవిత్వాన్నీ అతని గొంతులోనే వింటూ చూస్తుంటే.. dislocate అవుతూన్న జీవితం సారవంతంగా పాఠకుడికి ఐహికానుభవం తాలూకు పరుగులనావుతుంది. సమూహంలోని ఏకాంతానుభూతి తాలూకు రుచి పాఠకునికి తగులుతుంది. పరిమళమే చెమ్మగిల్లుతూంటుంది. Kafkaesque saga కు నడక ప్రారంభమవుతుంది.

జగ్‌జీత్ గాయక సభలో గుల్జార్ గారి కవిత్వాన్నీ ప్రసంగాన్నీ విని, చూసి అనుభవించిన వారందరికీ కొత్తలోకమొకటి కిటికీ సగం తలుపులు తెరిచి పిలవడం గుర్తుండే వుంటుంది.

"ఏమానందమిది ఉర్దూ భాషది
ఎక్కడ నుంచి వచ్చిన ప్రేమ ఇదంతా
పదాల మీది రుచి అందుకున్నప్పుడు
ఈ ప్రేమను మాట్లాడుతున్నాను
వొప్పుకుంటున్నాను
వెల్లడిస్తున్నాను
పదపదాన్ని నములుతూంటే...
తమలపాకులో జార్దాకిమామ్‌ను
తిన్నటువంటి మాధుర్యం తెలిసివస్తుంది
ఒక్క క్షణం...
అదే క్షణం... అనంతం..."

- అని గుల్జార్ అనగానే మన కళ్ళ ముందు అనుకంపనతో తడిసిపోయి మెల్లగా గుండెలో మసిలే ఉర్దూ పదమే కనబడుతుంది. తెల్లవారుఝామున మసక వెన్నెల నిద్రలో కన్నీరొలికే ప్రియురాలు కదులుతున్నటుంటుంది. తనను గమనిస్తే 90 సంవత్సరాలు. ఇంతటి యవ్వన దశలో తనని జ్ఞానపీఠం వరించి ముద్దుపెట్టుకోవటం భారతీయ సాహిత్యంలో గొప్ప పున్నమి కాదా. ఆధునిక ఖండాతర భారతీయ కవిత్వంలోని సాహిత్యంలోని అనేక విస్తృత జీవధారల్లో గజల్ వొక సమున్నతమైన తేజోధార కాదా. గుల్జార్ వంటి కవి... అటువంటి ధారను గుప్పిటపట్టి, సంచరిస్తూన్న ఖండాంతర సూఫీ తపస్వి. ఇతని గురించేనేమో... Al Hujwiri (died in 1063) పర్షియన్ సూఫీయిజమ్ గురించి 'Kashf al-Mahjub' అనే పుస్తకంలో సూఫీ గురించి రాస్తూ: "Sufi is a name which is given, and formerly been given to he perfect saints and spiritual adepts. He that is purified by love, is pure, and that he is absorbed in the Beloved and has abandoned all else is a sufi." సరిగ్గా ఇటువంటి సూఫీ పదవచన సంచారి మన గుల్జార్‌జీ.

అతను నడుస్తూ చెట్లోలె కవిత్వం రాలుస్తూ పోతుంటాడు. పాకాల చెరువు నిద్రలో సణుగుతున్నట్టు అతని కంఠనాళం ఉర్దూని జీవ స్వరంలో వొంపుతూంటుంది. తన కవిత్వంలోని మార్దవానికి అర్ధరాత్రి ఆకలితో నిద్రలేచిన పసివాడికి జొన్నగట్క తినిపించిన అమ్మ యాదికొస్తుంది. వలసపోయిన తరువాత మొఖం కళ తప్పిన ఊరు ఎదురు వస్తూంటుంది.

మరొక్కసారి కొంత కవిత్వ గమకానికి చెవి వొగ్గి వినిపించాలనిపిస్తుంది.

"నీ కళ్ళలోంచి రాలుతూండే వొక సత్యం
నీ కళ్ళలోంచి సృష్టిగా తూలే వొక జీవితం
వొక ఆత్మ
వానచుక్కల్లో ఎగిసిపడే వొక అగరు సెగ"

- అంటూ తన అమూర్త ప్రియురాలిని పసిగడతాడు.

అట్లాగే -

"ఒకే పిడికిట్లో రెండు మన్ను దేహాలు
నిద్రించినప్పుడు
నేనెక్కడున్నానప్పుడు
నువ్వెక్కడున్నావు?"

- అంటూ విహ్వాలుడౌతాడు కవి. గుల్జార్ మంచులో తడిసిన గులాబీల రెక్కల్ని రెప్పల మీద అదుముకుంటూ... గురుముఖుడౌతాడు అనేక ముషాయిరాల ముప్పేట అలలుగా కమ్ముకుంటూ పాఠక శ్రోతలకి... ఎప్పటికీ ఇప్పటికీ కమ్ముకుంటూ హృదయానికి హత్తుకుంటూ, వొక రూమీ, వొక మిర్జా గాలిబ్, అమీర్ ఖుస్రూ, మీర్ తక్ మీర్, సాహిర్ లుధియాన్వీ, అమృతా ప్రీతమ్, సురయ్యా కమలాదాస్, వచన గణ సుగుణకారులైన అక్కమహాదేవి, దాస కవులైన పురంధర, కనకదాసు, రవిదాసు, నందదాసు, సంత్ కవుల సూఫీల సరసన ఎంచదగిన ఎన్నదగిన కవి కర్మచారి... మన గుల్జార్.

సిద్ధార్థ
73306 21563

సద్ది



సద్ది కట్టి పోయి రమ్మని సాగనంపడం
ఒకానొక పచ్చని పాత జ్ఞాపక దృశ్యం

ఇంటికి చుట్టాలు వచ్చి వెళ్లేటప్పుడు
దారిలో ఆకలి తీర్చేందుకే సద్దిముల్లె సంస్కృతి

ఈ మధ్యన నేనూ కడుతున్న
బడికి పోయే మా ఆవిడకు సద్ది గిన్నె
నెయ్యీ పెరుగూ ప్రేమ పోసి పంపిస్తున్న

లంచ్ పీరియడ్‌లో లాగించేస్తూనే
'నే వండిన కూరకు నీ మగ చెయ్యి తగిలి
మరింత కమ్మగా ఉన్నదండీ'
ఫోన్ పలకరింపులో చిలకరింపు
ఉబ్బిపోయేట్లుగ పరవశవాక్యం అది

నా బిడ్డ తన బిడ్డకు పెట్టే బాక్స్ అయితే
కలిపిన అన్నం కూరా ఒక గిన్నెలో
పెరుగన్నం పచ్చడి మరో గిన్నెల
స్నాక్స్ కోసమని మరొక డబ్బానట
మనమరాలుకు బాక్సు బుక్సు బరువే బరువు

తాతతో కలిసి నాగలి దున్నిన కాలం
ఇరువాలు మూడుసాల్లు కలె దున్నకం
మాగి పొద్దుకు గావర ఎక్కువ
బాపమ్మ తెచ్చిన సద్దికి లేచి వచ్చిన పాణం
బురద కాళ్లతోనే పొలం ఒడ్డు మీద కూచొని
మయ్యర మయ్యర బువ్వ తిన్న జ్ఞాపకం

కలిసి పని చేస్తున్న కార్యాలయాలు
లంచ్ టైం ఒక సామూహిక భోజనశాలనే
కొలీగ్స్ తో రుచులు ముచ్చట్ల కలబోతలు
ఎవరి డబ్బలు వాళ్లవే అందులో కూరలే అందరివి
కారం సప్పిడి ఉప్పూ పులుపు సై సూసుడే
ఆఫీసులో ఆహారానికి నాలుకలన్నీ ఊరేగింపులు

వరి నాట్లు వేసే పొలం గట్ల మీద
వరుసగా రైతు వనితల సద్దుల బంతుల
ముద్ద ముద్దకూ ముచ్చట్లే ముచ్చట్లు
అవన్నీ ఊరు మీది వార్తా ప్రసారాలు
నారు మడి జానపద సంగీత విభావరి
వరిపొలంల వరిఅన్నం తినడమొక కమ్మదనం

సుతారీ మేస్త్రీల సద్దులు కొంచెం పెద్దగనే
స్వేదం చిందే పనితీరుగ ఆహారం
తీరికలేని పరిశ్రమయే ఆ ప్రపంచం
పని కాదనే టకటకా భోజనం కానిచ్చుడు
తిన్నంక ఒక బీడీ ఊది పారేస్తేనే తృప్తి

అన్నలకు సద్ది కట్టడం ఒక సాహసం
అడవిలోకి మొయ్యడమే మొండి ధైర్యం
ఎక్కడి నుంచి వచ్చారో, ఎన్ని రోజుల ఆకలో
రహస్య ఉద్యమకారులకు ఆకలి ఒక పొలికేక
తుపాకీ నీడన అన్నం తినే వెన్నెల రాత్రులు
ఊరు పక్క గుట్టల్లో, అదొక రణ భోజనం

సద్ది గిన్నె సంస్కృతి దేహాలకు ప్రాణప్రదం
వండి వార్చి సద్ది కట్టడం శ్రామిక సౌందర్యం

అన్నవరం దేవేందర్
94407 63479

గ్లోబలైజేషన్‌ని తొలిదశలోనే డీకోడ్ చేసిన 'పడమటిగాలి'

ప్రపంచ నలుమూలల్లో సామాజిక, రాజకీయ, ఆర్థిక సాంస్కృతిక రంగాల్లో పెను మార్పులతో సమాజాన్ని అతలాకుతలం చేస్తున్న గ్లోబలైజేషన్ ఒక చిన్న గ్రామాన్ని, చిన్న చిన్న కుటుంబాల్ని, మానవ సంబంధాల్ని ఎంత ఛిద్రం చేసిందో చూపించడం ఆషామాషీ కాదు. క్లిష్టమైన గ్లోబలైజేషన్ క్రమాన్ని, దాని ప్రభావాన్ని ఒక మైక్రో కాస్మిక్ స్థాయిలో విశ్లేషణాత్మకంగా, హృద్యంగా, ఆర్ద్రంగా, కళ్ళకి కట్టినట్టు చూపించిన నాటక రాజం పాటిబండ్ల ఆనందరావు రచించిన 'పడమటిగాలి'.

1990వ దశకంలో కొన్ని పాశ్చాత్య దేశాలు ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్‌లతో కలిసి వాషింగ్టన్ కన్సెన్సస్ ద్వారా మూడో ప్రపంచ దేశాల మీద ఆర్థిక ఆంక్షలు విధించాయి. ఆర్థిక సంస్కరణల పేరుతో అనేక దేశాల్ని అంతర్జాతీయ మార్కెట్లోకి ఈడ్చుకెళ్ళాయి. ఇష్టం వున్నా లేకపోయినా అందరు గ్లోబలైజేషన్ వలలో చిక్కుకున్న సందర్భం అది. ఆర్థిక సంస్కరణల్లో దాగివున్న ఎల్‌పిజి (లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్) పాలసీల్ని అర్థం చేసుకోవడానికి విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్లు కుస్తీ పడుతున్న కాలం అది. మనదేశంలో ఆర్థిక సంస్కరణలు ఊపందుకున్న సరిగ్గా ఐదారు సంవత్సరాల తరువాత 1998లో, ఆనందరావు రచించిన 'పడమటిగాలి' గ్లోబలైజేషన్ పనితీరుని గ్రామస్థాయిలో డీకోడ్ చేసిన దృశ్య కావ్యం.

1991లో మన దేశం చేపట్టిన లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ విధానాలు గ్రామస్థాయిలో సృష్టించిన గందరగోళాన్ని సామాన్య ప్రజలకి వ్యంగ్యంగా, హాస్యధోరణిలో అర్థమయ్యేలా రచించిన ఏకైక సాహిత్య ప్రక్రియ 'పడమటిగాలి' నాటకం అని చెప్పవచ్చు. 1991కి ముందు ప్రైవేట్ సంస్థలు దేశంలో పరిశ్రమలు స్థాపించుకోవడానికి లైసెన్స్ పొందాలంటే కష్టతరమైన నియంత్రణలు ఉండేవి. ఆ నియంత్రణలని తొలగించి సులభంగా లైసెన్స్ పొందేందుకు వీలుకల్పించడమే లిబరలైజేషన్. గతంలో కొన్ని పరిశ్రమలకి మాత్రమే పరిమితమైన ప్రైవేట్ సంస్థల్ని దాదాపు అన్ని పరిశ్రమల్లోకి అనుమతించడమే ప్రైవేటైజేషన్. టెక్నాలజీ ద్వారా ప్రపంచ మార్కెట్లని అనుసంధానించడం గ్లోబలైజేషన్.

ఈ మూడు ప్రక్రియలు కలిసి చాపకింద నీరులా ఒక గ్రామం మీద దాడి చేసే క్రమాన్ని ఆనందరావు 'పడమటిగాలి' నాటకంలో ఆవిష్కరించారు.


అమెరికాకి చెందిన ఒక కార్పోరేట్ సంస్థ ప్రకాశం జిల్లాలో తన పరిశ్రమని స్థాపించడానికి రైతుల దగ్గర భూమి కొనుగోలు చేస్తున్న క్రమంలో రాంకోటు అనే రైతు తన మూడు ఎకరాల పొలం అమ్మడానికి తిరస్కరిస్తాడు. ఆ మూడెకరాల పొలం, కార్పొరేట్లు సేకరిస్తున్న పొలానికి మధ్యలో కీలకమైన స్థానంలో వుంటుంది. రాంకోటు ఆ పొలాన్ని తన తల్లిదండ్రులతో సమానంగా భావిస్తాడు, ప్రేమిస్తాడు. అమ్మడానికి ససేమిరా ఒప్పుకోడు. ఎలాగైనా ఆ మూడెకరాల్ని స్వాధీనం చేసుకోవడానికి కేంద్రమంత్రి నుంచి రాష్ట్ర మంత్రులు, స్థానిక రాజకీయ నాయకులు, చివరికి స్థానిక దళారీలు రాంకోటు మీద తీవ్రమైన ఒత్తిడి తెస్తారు. ఆర్థిక ప్రలోభాలు పెడతారు. అప్పుల పాలుచేస్తారు. అవమానాలకి గురిచేస్తారు. అతని కొడుకు రాంపండుని విలాసాలకి బానిసని చేసి, అప్పుల ఊబిలోకి లాగుతారు. పొలం అమ్మి అప్పు తీర్చమంటారు. చివరికి రాంపండుని రెచ్చగొట్టి తన తండ్రిని చంపేలా కుట్రలు చేపిస్తారు. మరోవైపు తుఫాన్ వల్ల చేతికొచ్చిన పంట నేలపాలైపోతుంది. నిస్సహాయ స్థితిలో రాంకోటు, అతని భార్య లక్ష్మీదేవి ఆత్మహత్య చేసుకోవాలనుకుంటారు. రైతు చచ్చిపోవడం సమస్యకి పరిష్కారం కాదని, నిలబడి, పోరాడి బతకాలని, సమాజాన్ని బతికించాలని ఆనందరావు చూపించిన తీరు ప్రేక్షకుల్ని కంటతడి పెట్టిస్తుంది.

ప్రజల జీవితాల్ని గ్లోబలైజేషన్ ఎలా ట్రాప్ చేసిందో 'పడమటిగాలి' పరిచయం చేసిన పద్ధతి నాటక చరిత్రలోనే ఒక కొత్త ఆవిష్కరణగా కనిపిస్తుంది. మనకి తెలియకుండానే మనల్ని గ్లోబలైజేషన్ ఎలా ఆడిస్తుందో, పీడిస్తుందో, ఓడిస్తుందో 'పడమటిగాలి' చూపిస్తుంది. మన అభిరుచుల్ని, ఆర్థిక కార్యకలాపాల్ని, ఆస్తిపాస్తుల్ని మార్కెట్ ఎలా కంట్రోల్ చేస్తుందో తెలియజేస్తుంది. భార్యా భర్త, తండ్రికొడుకు, అన్నాచెల్లెలు వంటి ఆత్మీయ బంధాల హననం వెనుక కార్పోరేట్ శక్తులని చూపించి భయపెడుతుంది. ఆహార పంటల్ని వాణిజ్య పంటలు చంపేయటం విస్మయాన్ని కలిగిస్తుంది. లక్షల మందికి ఉపాధి ఇస్తున్న వ్యవసాయ భూమిలో ఒక పరిశ్రమ పెట్టి రెండు వేల ఉద్యోగాలు కల్పిస్తాం అని చెప్పగానే మనం కొట్టిన చప్పట్లు సిగ్గుతో తలలు వంగిపోయేలా చేస్తే, దైనందిన జీవితంలో జరిగే చిన్న చిన్న పనుల వెనుక వున్నది పెద్దపెద్ద వ్యాపార కుట్రలని ఈ నాటకం చెప్పినప్పుడు- మన నుంచి మనం ఎంత దూరమయ్యామో అర్థమౌతుంది. ఇలా సమాజంలో చాప కింద నీరులా



> **మనదేశంలో ఆర్థిక సంస్కరణలు ఊపందుకున్న సరిగ్గా ఐదారు సంవత్సరాల తరువాత, 1998లో, ఆనందరావు రచించిన 'పడమటిగాలి' గ్లోబలైజేషన్ పనితీరుని గ్రామస్థాయిలో డీకోడ్ చేసింది. ఇది ఒక దృశ్య కావ్యం మాత్రమే కాదు, మానవ పరిణామ క్రమంలోని ఈ దశలో గతం, వర్తమానం, భవిష్యత్తులని కలబోసి కళ్ళకి కట్టినట్టు వివరించిన అనేక సామాజిక శాస్త్రాల సారం.**

సర్వత్ర వ్యాపించిన గ్లోబలైజేషన్ వ్యూహాల్ని స్పష్టంగా, సమగ్రంగా కళ్ళకి కట్టినట్టు పాటిబండ్ల ఆనందరావు ప్రెజెంట్ చేసిన తీరు గొప్పగా ఉంటుంది! కళ్ళ ముందే, ఊరు, రాజకీయాలు, మానవ సంబంధాలు, కుటుంబాలు, ఆర్థిక స్థితిగతులు ఛిద్రం కావటం వెనుక వున్న అంతర్జాతీయ శక్తులని బయటకిలాగి వెన్నులో వణుకు పుట్టిస్తుంది. అమెరికా ఆశలు, డాలర్ల వేట, రియలెస్టేట్ వ్యాపారం, ఫైనాన్స్ బిజినెస్ సమాజాన్ని ఎలా పతనం చేసిందో తెలుసు కోవాలంటే 'పడమటిగాలి' చూడాల్సిందే.



ఎన్ని ఆర్థిక సంస్కరణలు వచ్చినప్పటికీ వూళ్ళో కులం పట్టు తగ్గలేదని రచ్చబండ దగ్గర సీన్లు పదే పదే గుర్తు చేస్తాయి. రాజకీయాల్లో అవినీతి గురించి రచ్చబండ దగ్గర జరిగే చర్చలో ఊరు రెండు కులాలుగా విడిపోయి "మీ నాయకుడు దొంగంటే - మీ నాయకుడు గజదొంగ" అని ఎత్తిపోడుచుకొనే క్రమంలో "మా నాయకుడ్ని మీరు తిట్టొద్దు, మీ నాయకుడ్ని మేమూ తిట్టం, లోకంలో అవినీతి సహజం, అవకాశం దొరికితే మనం చెయ్యమా?" అని రెండు వర్గాలూ కలిసి సాధారణీకరించుకున్నప్పుడు రాజకీయాల్ని కులం ఎంత భ్రష్టు పట్టిస్తుందో తెలుస్తుంది. ఆ రెండు కులాలకి చెందిన స్కూల్ టీచర్, పశువుల డాక్టర్ విధులకి హాజరు కాకపోయినా పరస్పరం ఫిర్యాదులు చేసుకోకుండా ఒకరికొకరు సహకరించుకుంటూ "ఊర్ని డెవలప్ చేసుకుందా"మని రెండు కులాలు ఒకటై తీర్మానించుకున్నపుడు అభివృద్ధి నిర్వచనంలో కులం కంపు నషాళానికి అంటుతుంది. నేటి రాజకీయాల్లో అవినీతి పరుడైన రాజకీయ నాయకుడ్ని అతని కులం ఎలా వెనకేసుకొస్తుందో ఈ సన్నివేశాల్లో రచయిత స్పష్టంగా చూపాడు.

రచయిత ఈ నాటకంలో ఒకవైపు లింగ వివక్షతని చీల్చి చెండాడి మరో వైపు స్త్రీ స్వేచ్ఛ అవసరాన్ని నొక్కి చెప్పాడు. సుబ్బరత్నం, దొరసాని వంటి పాత్రలు లింగ వివక్షతకి ప్రతిబింబాలుగా కనిపిస్తే రాజ్యం పాత్ర స్త్రీ స్వేచ్ఛకి పరాకాష్ఠగా కనిపిస్తుంది. రాజ్యం పాత్ర మహిళలకి అబార్షన్ హక్కు, సహజీవన హక్కు, లైంగిక స్వేచ్ఛ వంటి అంశాల్ని చర్చకు తెస్తుంది. మహిళా హక్కులు మగవాళ్ళ హక్కులతో సమానంగా వుంటే స్త్రీకి ఏ స్థాయిలో స్వేచ్ఛ లభిస్తుందో రాజ్యం పాత్ర సూచిస్తుంది. రచయితకి మహిళాస్వేచ్ఛ పట్ల వున్న ఆకాంక్ష రాజ్యం పాత్ర ద్వారా బయట పెట్టినట్టు అర్థమౌతుంది.

గ్రామ స్థాయిలో గ్లోబలైజేషన్ అమలు ప్రక్రియకి కేంద్రంగా మాయోడు పాత్రని ఆనందరావు చిత్రీకరించిన పద్ధతి, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పెత్తనం కోసం అమెరికా రూపొందించిన 'ఎకానమిక్ హిట్ మేన్' (జాన్ పెర్కిన్స్ రచన)ని గుర్తుకు తెస్తుంది. ఈ నాటకం లో మాయోడు ఏ ఎండ కాగొడుగు పట్టే పాత్ర. అందితే జుట్టు అందకపోతే కాళ్ళు పట్టుకుంటాడు. అవసరాన్ని బట్టి ఆశలు రేకెత్తిస్తాడు, వాటిని ఆర్పేస్తాడు. జాన్ పెర్కిన్స్ 2004లో రూపొందించిన 'ఎకనామిక్ హిట్ మేన్' పాత్రా, ఆనందరావు 1998లోనే రూపొందించిన పడమటి గాలి మాయోడు పాత్ర దాదాపు ఒకేలా వుంటాయి. పవర్ రిలేషన్స్‌కి డిస్కోర్స్ అనే ప్రక్రియ పునాది అంటాడు ఫ్రెంచ్ తత్వవేత్త మిస్సెల్ ఫూకో. ఫూకో పేరు కూడా వినని ఆనందరావు డిస్కోర్స్ అమలు జరిగే పద్ధతిని మాయోడు పాత్ర ద్వారా క్షేత్ర స్థాయిలో వివరించిన పద్ధతి ఆశ్చర్యం కలిగిస్తుంది.

ప్రపంచంలో గ్లోబలైజేషన్‌కి గురికాని దేశం లేదు, అంశం లేదు. ముఖ్యంగా మధ్యతరగతిని వెంటాడే విదేశీ చదువు, వ్యాపారాలు, విలాసాలు, సంస్కృతి, కల్తీ విత్తనాలు, కంప్యూటర్లు, ఆత్మహత్యలు, ఆర్థిక దోపిడీలు, కుట్రలు కుతంత్రాల్ని లాభాల కోసం గ్లోబలైజేషన్ ఎలా వాడుకుందో 'పడమటిగాలి' నాటకం బహురస ప్రవాహంతో వివరిస్తుంది. సంక్లిష్టమైన గ్లోబలైజేషన్ ప్రక్రియని నాలుగు గంటల నిడివితో, డెబ్బైమంది కళాకారులతో సామాన్యులకి కూడా అర్థమయ్యే రీతిలో సృష్టించిన రచయిత మేధస్సు, సృజనాత్మకత అభినందనీయం. 'పడమటిగాలి' నాటకం కేవలం ఒక దృశ్య కావ్యం మాత్రమే కాదు, మానవ పరిణామ క్రమంలోని ఈ దశలో గతం, వర్తమానం, భవిష్యత్తులని కలబోసి కళ్ళకి కట్టినట్టు వివరించిన అనేక సామాజిక శాస్త్రాల సారం.

(ఫిబ్రవరి 27, 28 తేదీల్లో ఒంగోలులో 'పడమటిగాలి' నాటకం ప్రదర్శన, రచయిత పాటిబండ్ల ఆనందరావుకి సన్మానం)

శ్రీపతి రాముడు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA
సోమవారం 26 ఫిబ్రవరి 2024


ఐటీడీఏ పీవో అంకిత్‌ను సన్మానిస్తున్న మంత్రి సీతక్క

ఉద్యోగుల పనితీరు అభినందనీయం

▸▸ రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క

మేడారం, ఫిబ్రవరి 25: మేడారం మహాజాతరలో ఉద్యోగుల పని తీరు అభినందనీయమని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కొనియాడారు. మేడారం పరిసరాల్లోని తాత్కాలిక మీటింగ్ హాల్‌లో ఆయా శాఖల అధికారులతో ఆమె ఆదివారం సమావేశమయ్యారు. మహాజాతర విజయవంతానికి శ్రమపడి విధులు నిర్వర్తించిన ఉద్యోగులు అందరూ అభినందనీయమన్నారు. ఆసియా ఖండంలోనే అతిపెద్దదైన మేడారం సమ్మక్క, సారలమ్మ మహా జాతరకు నాలుగు రోజులపాటు విజయవంతం చేయడంలో జిల్లా యంత్రాంగం పాత్ర ప్రశంసనీయమన్నారు. ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్, ములుగు అదనపు కలెక్టర్ శ్రీజ, ఐటీడీఏ ఏపీవో వసంతరావు, డీఎంహెచ్‌వో అప్పయ్య, ములుగు డీఎస్పీ రవీందర్, దేవాదాయ శాఖ మేడారం కార్యనిర్వహణాధికారి రాజేంద్రంతో పాటు పలు శాఖల అధికారులను మంత్రి సన్మానించారు. జాతర చిత్రపటాన్ని బహూకరించారు.

ఈనెల 29 నుంచి హుండీల లెక్కింపు

▸▸ టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాట్లకు కసరత్తు



వివరాలు : 7లో..


బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ కింద స్నానం చేస్తున్న భక్తులు



అదే భక్తి.. అవే మొక్కులు..

మేడారంలో కొనసాగుతున్న దర్శనాలు

▸▸ జాతర ముగిసినా తగ్గని జన కోలాహలం

▸▸ భక్తులతో రద్దీగా వనదేవతల గద్దెల ప్రాంగణం

▸▸ బారులుతీరిన వాహనాలు.. పోలీసు నియంత్రణ కరువు

మేడారం, ఫిబ్రవరి 25: నాలుగురోజులపాటు జరిగిన మహాజాతర ముగిసినా మేడారానికి భక్త ప్రవాహం ఆగలేదు. శనివారం రాత్రి సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు వన ప్రవేశం చేసిన విషయం తెలిసిందే. జాతర ప్రారంభానికి ముందే లక్షలాదిగా తరలివచినట్లగానే ఆ తర్వాత కూడా భక్తులు తల్లులను దర్శించుకునేందుకు బారులుతీరారు. మహాజాతర సమయంలో వీలుకాక రాలేకపోయిన వారు ఆదివారం పెద్దసంఖ్యలో మేడారం చేరుకున్నారు. తమ ఇష్టదైవాలు స్పర్శించిన గద్దెలను తాకి తన్మయత్వం చెందారు. దీంతో గద్దెల ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఎత్తుబంగారం, కానుకలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కోళ్లు, గొర్రెలు, మేకలను బలిచ్చారు. ఆదివారం వారాంత సెలవు కావడం కూడా కలిసి వచ్చింది. తిరుగువారం వేడుక వరకూ ఈ సందడి కొనసాగనుంది. బుధవారం వనదేవతల పూజారులు(వడ్డెలు) తిరుగువారం సంబరాలు జరుపుకుంటారు. పూజా మందిరాలు, గద్దెల వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయి. ఈ వేడుకలకు కూడా భక్తులు అత్యంత ప్రాధాన్యమిస్తారు. దేవతల వచ్చి వెళ్లిన తర్వాత ఆ ప్రాంతం మహిమాన్వితమవుతుందని, దర్శించుకుంటే పుణ్యం కలుగుతుందని భావిస్తారు. అందుకే జాతరానంతరం కూడా భక్తుల సందడి కొనసాగింది.



మేడారం డ్యూటీలో ఉండి దర్శనం చేసుకోలేకపోయిన పలువురు ఉద్యోగులు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. జంపన్నవాగులో లక్నవరం నీటి విడుదలను అధికారులు నిలిపివేశారు. అయినప్పటికీ వాగులో కొంతమేరకు నీరు నిల్వ ఉంది. బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ కూడా పూర్తిస్థాయిలో ఉన్నాయి. దీంతో భక్తులు తనివితీరా పుణ్యస్నానాలు చేశారు. జాతర ముగిసిన తర్వాత పోలీసు అధికారులు రిలాక్స్ అయ్యారు. దీంతో మేడారంలో పరిస్థితి నియంత్రణ కోల్పోయింది. వేలాది వాహనాలు, లక్షలాది మంది భక్తులను నిలువరించే వారు కరువయ్యారు. చాలామంది గద్దెల సమీపానికి వాహనాలు తీసుకొచ్చారు. దీంతో సాధారణ భక్తులు ఇబ్బందులు పడ్డారు. గద్దెల వద్ద రద్దీని నియంత్రించేవారు లేరు. దీంతో దర్శనం అనంతరం కూడా అక్కడే ఉండటంతో ఒత్తిడి ఎక్కువైంది. వాచ్‌టవర్ వద్ద విధుల్లో ఉన్న దేవాదాయ ఉద్యోగులు మైక్ ద్వారా ఎన్నిసార్లు సూచించినా భక్తులు పెద్దగా పట్టించుకోలేదు.



ఇదిలా ఉంటే.. మహాజాతరలో చిరు వ్యాపారాలు చేసుకున్న వారు ఇంటి ముఖం పట్టారు. దీంతో తాత్కాలిక గుడారాలను తొలగిస్తున్నారు. నిన్నటి దాకా కళకళలాడిన వీధులన్నీ సందడి లేక వెలవెలబోతున్నాయి. జాతర మేడారం పరిసరాల్లో పారిశుద్ధ్యం కారణంగా దుర్గంధం వెదజల్లుతుండటంతో దర్శనం అనంతరం భక్తులు తాడ్వాయి, నార్లాపూర్,




నిలువెత్తు బంగారంతో వనదేవతల దర్శనం కోసం వెళ్తున్న భక్తులు

నేడు బల్దియా ప్రజావాణి

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 25: వరంగల్ మహానగర పాలక సంస్థ సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఉదయం 10:30 గంటలకు హనుమకొండలోని బల్దియా ప్రధాన కార్యాలయంలో ప్రారంభం కానుంది. కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా జనగామ కలెక్టర్‌గా బదిలీ అయిన సంగతి విదితమే. అదనపు కమిషనర్ అనిసూర్ రషీద్ కూడా సెలవు పెట్టారు. ఈ క్రమంలో డిప్యూటీ కమిషనర్లు, వింగ్ అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తారు.

ప్రాణం తీసిన సెల్ఫీ

▸▸ పాకాల వాగులో పడి యువకుడి మృతి


జాకీర్ (ఫైల్)

ఖానాపురం/ వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 25: ఓ సెల్ఫీ యువకుడి ప్రాణాన్ని బలిగొంది. స్నేహితులతో కలిసి సరదాగా ఫొటో దిగుతుండగా బండరాయిపైనుంచి కాలు జారి వాగులో పడి మృతి చెందాడు. అతన్ని కాపాడేందుకు ప్రయత్నించిన మరో ఇద్దరు యువకులు స్థానికుల సహాయంతో సురక్షితంగా బయటపడ్డారు. ఈ సంఘటన వరంగల్ జిల్లా ఖానాపురం మండలం పాకాల సరస్సు సమీపంలోని పాకాల వాగు వద్ద ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... వరంగల్ కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ అజీమ్-జరీనా దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. అవివాహితుడైన పెద్ద కుమారుడు జాకీర్(24) వరంగల్‌లోని ఓ ఆటో మొబైల్ షాపులో పని చేస్తున్నాడు. చిన్న కుమారుడు గౌస్ చదువుకుంటున్నాడు. ఆదివారం సెలవు కావడంతో జాకీర్ కాశిబుగ్గకు చెందిన స్నేహితులైన ఎమ్డీ. రేహాన్, ఎమ్డీ.షరీన్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై పాకాల సరస్సు వద్దకు విహార యాత్రకు వచ్చారు. సరస్సు సందర్శన అనంతరం పాకాల గిరకతాటి వనం సమీపంలోని వాగులోని బండరాయిపై కూల్‌డ్రింక్స్ తాగుతూ సెల్ఫీ ఫొటో దిగుతున్నారు. ఈ క్రమంలో జాకీర్ కాలు జారి వాగులో పడిపోగా ఈత రాకపోవడంతో మునిగిపోయాడు. జాకీర్‌ను రక్షించేందుకు ఇద్దరు స్నేహితులు వాగులోకి దిగి ప్రయత్నించినప్పటికీ వరద దాటికి వారికి సైతం ఈత రాకపోడంతో కేకలు వేయగా స్థానికులు చేరుకుని వారిని రక్షించి ఒడ్డుకు చేర్చారు. ఈ క్రమంలో జాకీర్ అప్పటికే నీటిలో మునిగి మృతి చెందాడు. సంఘటన స్థలానికి దుగ్గొండి రూరల్ సీఐ శ్రీనివాస్, నల్లబెల్లి ఎస్సై నగేష్, హెడ్ కానిస్టేబుల్ రమేష్ చేరుకుని మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టానికి తరలించారు. కాగా, జాకీర్ మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. నగరంలోని కాశిబుగ్గలోనూ విషాదం చోటుచేసుకుంది.


జాకీర్ మృతదేహం వద్ద ఉన్న స్నేహితులు

ఇందిరమ్మ రాజ్యం అంటే థర్డ్ డిగ్రీనా?

▸▸ ప్రతిపక్ష నేతలపై పోలీసుల దాడిని ఖండిస్తున్నాం..

▸▸ ఆత్మకూరు ఎస్‌ఐని సస్పెండ్ చేయాలి

▸▸ లేదంటే 27న ఆత్మకూరు పీఎస్ ఎదుట నిరసన

▸▸ ప్రెస్‌మీట్‌లో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కడియం శ్రీహరి

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 25: ఇందిరమ్మ రాజ్యం అంటే పోలీసులతో ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడమా? అని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రశ్నించారు. ఆదివారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కడియం శ్రీహరి మాట్లాడారు. గతంలో ఇందిరమ్మ రాజ్యంలో ఎన్‌కౌంటర్లు చూశామని, ప్రతిపక్షాలపై దాడులు చూశామని, నాటి పరిస్థితి మరోసారి పునరావృతమవుతోందని అన్నారు. రెండు మాసాల కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నేతలపై 2,600 కేసులు పెట్టించిందని విమర్శించారు. ఈనెల 23న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పోలీసులకు, దేవస్థాన అధికారులకు సమాచారమిచ్చి అగ్రంపహాడ్ జాతరకు వెళ్లారన్నారు. ధర్మారెడ్డి వెళ్లిన సమయంలో ప్రధాన ద్వారానికి తాళం వెయ్యడంతో బీఆర్ఎస్ శ్రేణులు జై తెలంగాణ, జై చల్లా అని నినాదాలు చేశారన్నారు. ఈ క్రమంలో అధికారులు గేటు తాళాలు తెరవగా పెద్దఎత్తున భక్తులు, పార్టీ శ్రేణులు లోనికి వెళ్లారన్నారు.


ఈ క్రమంలో బీఆర్ఎస్ నేతలు అధికారులపై దురుసుగా ప్రవర్తించారని ఓ కానిస్టేబుల్‌తో ఫిర్యాదు తీసుకుని ఆదివారం ఉదయం 12మంది బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేశారని కడియం పేర్కొన్నారు. తెల్లవారుజామున వారిని ఆత్మకూరు పోలీసులు హనుమకొండ టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. సీఐ, ఏసీపీ సమక్షంలో ఎస్‌ఐ ప్రసాద్ 12మందిని విచ్చలవిడిగా కొట్టినట్లు ఆయన ఆరోపించారు. వారిపై థర్డ్ డిగ్రీ ఉపయోగించడం ఎంతవరకు సమంజసమని కడియం ప్రశ్నించారు. ఈ విషయాన్ని సీపీ దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. 24గంటల్లో చర్యలు తీసుకుంటామని సీపీ చెప్పారని అన్నారు. 24గంటల్లో ఎస్‌ఐ ప్రసాద్‌ను సస్పెండ్ చేయడంతోపాటు ఏసీపీపై చర్య తీసుకోవాలని కడియం డిమాండ్ చేశారు. లేదంటే 27న చలో ఆత్మకూరు కార్యక్రమాన్ని చేపట్టి పోలీసుస్టేషన్ ఎదుట నిరసన చేపడతామని కడియం శ్రీహరి హెచ్చరించారు. న్యాయం జరుగకుంటే అవసరమైతే హ్యూమన్ రైట్స్‌కు, హైకోర్టుకు వెళతామని తెలిపారు. కాంగ్రెస్ నేతల మెప్పుకోసం దాడులకు పాల్పడే పోలీసులను వదిలే ప్రసక్తే లేదని కడియం అన్నారు.

పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. తాను జాతరకు అధికారులకు సమాచారం ఇచ్చి వెళ్లానని చెప్పారు. తల్లుల దర్శనానికి వెళ్లే క్రమంలో ఎలాంటి గొడవ జరుగకున్నా.. కావాలని తమ పార్టీ నేతలపై కేసులు పెట్టి విపరీతంగా కొట్టినట్లు ఆయన పేర్కొన్నారు. బట్టలు విప్పి డ్రాయర్లపై కూర్చోబెట్టారని ఆయన చెప్పారు. పోలీసుల దాడిలో 12మందికి తీవ్రగాయాలయ్యాయని అన్నారు. తమ నేతలను కొట్టిన ఆత్మకూరు ఎస్‌ఐ, సీఐ, ఏసీపీపై చర్య తీసుకోవాలని ధర్మారెడ్డి డిమాండ్ చేశారు. ఈ విలేకర్ల సమావేశంలో బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్, నేతలు లేతాకుల సంజీవరెడ్డి, లలితాయాదవ్ జాకీర్ అలీ, నిమ్మగడ్డ వెంకన్న తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ సందర్భంగా గాయపడిన నేతల దెబ్బలను మీడియాకు చూపించారు.

అమృత్ రైల్వే స్టేషన్‌గా వరంగల్

▸▸ రూ.25.41 కోట్లతో రైల్వే స్టేషన్ ఆధునీకరణ

▸▸ నేడు ప్రధాని చేతుల మీదుగా వర్చువల్‌గా పనులు ప్రారంభం


అధునాతన వసతులు

గిర్మాజీపేట, ఫిబ్రవరి 25: ఉత్తర, దక్షిణ భారతావనికి రైల్వే వారధిగా పేరు గడించిన వరంగల్ రైల్వే స్టేషన్ ఆధునీకీకరణతో అభివృద్ధి చెందుతోంది. ఇప్పటికే పర్యాటక ప్రాంతాల రైల్వే స్టేషన్ అభివృద్ధి పథకం కింద అభివృద్ధి చెందిన వరంగల్ రైల్వే స్టేషన్ అమృత్ రైల్వే స్టేషన్‌గా రూ.25.41 కోట్లతో అధునాతన మౌలిక వసతులు, పచ్చదనంతో కూడిన పరిశుభ్రత, ఆహ్లాదపర్చేలా అభివృద్ధి చెందనుంది. అమృత్ భారత్‌లో వరంగల్ రైల్వే స్టేషన్‌తో పాటు రాష్ట్రం లోని 14 రైల్వే స్టేషన్ల ఆధునీకరణ, అభివృద్ధి పనులను, పూర్తయిన ఆర్వోబీలు, అండర్ పాస్‌లను సోమవారం ఉదయం 11 గంటలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్నారు.

అమృత్ భారత్ పనులతో వరంగల్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు మెరుగైన అధునాతన వసతులు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే పర్యాటక ప్రాంతాల రైల్వే స్టేషన్ అభివృద్ధి పథకం కింద రూ.20 కోట్లతో అభివృద్ధి చేశారు. శివనగర్ వైపు ఆధునీకరణ ఉట్టిపడే భవనం, వరంగల్ వైపు కాకతీయ కళాతోరణం శిల్పకళ ఉట్టిపడేలా నిర్మించారు. అమృత్ భారత్ పనుల్లో భాగంగా కొత్తగా 12 మీటర్ల వెడల్పుతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, నాలుగు ప్లాట్‌ఫారాల అభివృద్ధి, నాలుగు ప్లాట్‌ఫారాలపై పూర్తిస్థాయి కవర్డ్ షెడ్ నిర్మాణం జరుగనుంది. ప్రయాణికుల వెయిటింగ్ హాల్‌ను అధునాతన వసతులతో పునఃనిర్మాణం చేయనున్నారు. అదనంగా రెండు లిఫ్టులు, రెండు ఎస్కలెటర్లను నిర్మిస్తారు. వరంగల్ వైపు సర్కిల్ ఏరియాను ఆహ్లాదపరిచేలా పచ్చదనంతో అభివృద్ధి చేస్తారు. అలాగే రైల్వే స్టేషన్ ప్రవేశ ద్వారాలు, వాహనాల పార్కింగ్ రాకపోకలను క్రమబద్ధీకరిస్తారు. నిత్యం 40వేల మంది ప్రయాణికుల రాకపోకలతో సంవత్సరానికి రూ.4,109 కోట్లను

మల్లన్న సన్నిధిలో పోటెత్తిన భక్తులు

ఐనవోలు, ఫిబ్రవరి 25 : ఐనవోలు మల్లికార్జున స్వామి ఆదివారం వారాంతపు జాతరకు భక్తులు వేలసంఖ్యలో తరలివచ్చారు. వివిధ జిల్లాల నుంచి భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. శనివారం సాయంత్రం నుంచి ప్రారంభమైన భక్తుల రాక ఆదివారం సాయంత్రం వరకు కొనసాగింది. స్వామి వారికి ఉదయం మేలుకొలుపు తర్వాత శైవాగమ పద్ధతిలో అర్చకులు విశేష అభిషేకాలు, కల్యాణం నిర్వహించి రుద్రాభిషేకాలు చేశారు. భక్తులు నజర్, చెలక పట్నాలు వేసి బోనం వండి స్వామి వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఒగ్గు పూజారులు నజర్, చిల్క పట్నాల వద్ద పూర్వికులను స్తుతించారు. ఆపదల నుంచి గట్టెకించి కోర్కెలు తీర్చామని మల్లన్నను భక్తులు వేడుకున్నారు. మొక్కుల్లో భాగంగా స్వామి, అమ్మవార్లకు భక్తులు ఒడి బియ్యం, వస్త్రాలు, ముత్తైదు సామాగ్రిని ముట్టచెప్పారు. మరి కొందరు మొక్కుల్లో భాగంగా రథసేవను నిర్వహించారు. రథంలో ఉత్సవ విగ్రహాలను పెట్టి ఆలయం చుట్టు లాగుతూ ప్రదక్షిణలు చేశారు.


మొక్కుల్లో భాగంగా రథం లాగుతున్న భక్తులు


తల్లులను దర్శించుకుంటున్న భక్తులు

అగ్రంపహాడ్‌లో మొక్కుల జోరు

▸▸ తల్లుల దర్శనానికి తరలివస్తున్న భక్తులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 25: అగ్రంపహాడ్ జాతరలో సమ్మక్క, సారక్క శనివారం వన ప్రవేశం చేసినా ఆదివారం భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. కోరిన కోర్కెలు తీర్చాలని అమ్మలకు భక్తులు మొక్కులు చెల్లిస్తున్నారు. దీంతో జాతర ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తులు అధికంగా రావడంతో శనివారం రాత్రి తరలించాల్సిన భక్తుల కానుకలతో నిండిన 50 హుండీలను ఆదివారం రాత్రి వరంగల్‌లోని బట్టలబజార్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలోకి పూజలు నిర్వహించిన అనంతరం తరలిస్తున్నారు. భక్తుల రద్దీని చూసిన పరకాల ఆర్డీవో శ్రీనివాస్ మరో ఐదు హుండీలను ఏర్పాటు చేయించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా సీఐ సంతోష్ పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నారు. వనదేవతలకు మొక్కులో భాగంగా భక్తులు వేసిన బంగారం(బెల్లం)తో గద్దెల వద్ద గుట్టలుగా పేరుకుపోయింది. జాతరలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎండోమెంట్ ఈవో శేషగిరి, జాతర చైర్మన్ శీలం రమేష్, మాజీ చైర్మన్ బోరిగం స్వామి, డైరెక్టర్లు, భక్తులకు సేవలు అందిస్తున్నారు.



ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 25: హనుమకొండ పెద్దమ్మగడ్డ సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ పెద్దమ్మగడ్డకు చెందిన మేకల కుమారస్వామి పెద్దమ్మగడ్డ సమీపంలోని కాకతీయ కెనాల్ సమీపంలో శనివారం సాయంత్రం బహిర్భూమికి వెళు తున్నానని చెప్పి బయటకు వెళ్లాడు. కాగా ములుగురోడ్డు నుంచి మేడారం వైపు వెళ్లే ఆర్టీసీ బస్సు ఆదివారం సాయంత్రం వెనుక నుంచి ఢీ కొట్టింది. కుమారస్వామి అక్కడే పడిపోవడంతో చుట్టుపక్కల వారు చూసి 108కు సమాచారం అందించారు. వైద్య సిబ్బంది వచ్చి చూడగా తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో చికిత్స కోసం ఎంజీఎంకు తరలించారు. బాధితుడు కుమారస్వామి బావమరిది వేల్పుల స్వామి హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆర్టీసీ బస్ డ్రైవర్ కోడెపాక భద్రయ్య బస్సును అతివేగంగా, అజాగ్రత్తగా నడపడం వల్లనే ప్రమాదం జరిగినట్టు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.



హనుమకొండలోని టీఎస్‌రెడ్‌కో కార్యాలయం

ఇక ఉచిత సౌర విద్యుత్

● 300 యూనిట్ల వరకు ఫ్రీ ● పీఎంఎస్‌వైతో పేదలకు లబ్ధి ● తప్పనున్న మామూలు కరెంట్ బిల్లుల భారం

● 60 శాతం పెరగనున్న రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్ సబ్సిడీ ● ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం రోజుకు 24వేల సౌర విద్యుత్ ఉత్పత్తి

హనుమకొండ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సూర్యోదయ యోజన పథకం కింద రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్ ద్వారా నెలకు 300 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇవ్వనున్నట్టు చేసిన ప్రకటన ప్రజల్లో ఆసక్తిని రేపుతోంది. అనేక మంది ఈ కొత్త పథకం గురించి ఆసక్తిగా ఆరా తీస్తున్నారు. రెండు రోజుల క్రితం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామాన్ ప్రవేశ పెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లో ఈ పథకం గురించి ప్రకటించారు. ప్రస్తుతం కరెంట్ బిల్లులు వినియోగదారులకు షాక్ ఇస్తున్నాయి. ఎంత పొదుపుగా వాడుకుంటున్నా నెలకు రూ.1000 నుంచిరూ .1500 కన్నా తక్కువ రావడం లేదు. పేద, మధ్యతరగతివారికి ఇది మోయలేనంత భారం అవుతోంది. ఈ పరిస్థితుల్లో రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేసుకున్నవారికి నెలకు 300 యూనిట్ల వరకు ఉచితంగా సరఫరా ఎంతో ప్రయోజనకరంగా ఉండనున్నది. దీనితో చాలా మంది ఈ పథకం గురించి ఆరా తీస్తున్నారు.

రోజుకు 24వేలకుపైగా యూనిట్ల ఉత్పత్తి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రస్తుతం 1556 మంది సోలార్ పలకలను అమర్చుకోవడం ద్వారా సౌర శక్తిని గృహావసరాలకు వాడుకుంటున్నారు. జిల్లాలో రోజుకు 24896 యూనిట్లు ఉత్పత్తి అవుతోంది. పలువురు తమ భవనాల రూఫ్‌టాప్‌లపై లేదా ఇంటి ఆవరణల్లో సోలార్ ప్యానెళ్లు అమర్చుకోవడం ద్వారా ఉత్పత్తవుతున్న సౌర విద్యుత్‌లో వినియోగించుకోగా మిగిలిన దానిని ఎన్‌పీడీసీఎల్‌కు విక్రయిస్తున్నారు. వీరికి ప్రతీ ఆరు నెలలకు ఒకసారి ఆ సంస్థ బిల్లులను చెల్లిస్తోంది. ప్రజల్లో తగిన అవగాహన, ఆసక్తి లేకపోవడం వల్ల ఎక్కువ మంది సోలార్ ఎనర్జీని వినియోగించుకోవడం లేదు. అయితే ఇప్పుడిప్పుడే ప్రజలు దీని పట్ల మొగ్గు చూపుతున్నారు. విద్యుత్ బిల్లులు అంతకంతకు పెరుగుతుండడంతో సహజంగానే ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వాడకం పట్ల ఆసక్తి చూపుతున్నారు. ఇందులో భాగంగా నగరంలోని పలు కాలనీల్లో స్వంత భవనాలు కలిగిన వారు తమ పైకప్పులపై ఇప్పుడిప్పుడే సోలార్ ప్యానెళ్లను అమర్చుకుంటున్నారు. దీని ద్వారా ఉత్పత్తి అవుతున్న సోలార్ ఎనర్జీని గృహ అవసరాలకు వాడుకుంటున్నారు.. తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధనవనరుల అభివృద్ధి సంస్థ (టీఎస్‌రెడ్‌కో) సోలార్ వ్యవస్థల ఏర్పాటుకు పెద్ద మొత్తంలో సబ్సిడీ ఇస్తుండడం వల్ల ఎక్కువ మంది సౌరవ్యవస్థల ఏర్పాటుకు మొగ్గు చూపుతున్నారు.

భారం తగ్గించేందుకే..

ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి సూర్యోదయ యోజన పథకాన్ని ప్రకటించింది. గృహ వినియోగదారులను సౌర విద్యుత్ వినయోగం వైపు ప్రోత్సహించి, మామూలు కరెంట్ వినియోగాన్ని తగ్గించి వారికి విద్యుత్ భారం నుంచి ఉపశమనం కల్పించడం ఈ పథకం లక్ష్యం. దీని ద్వారా ఇంటిపైన సోలార్ ప్యానెళ్లు అమర్చి రాత్రి పూట మాత్రం డిస్కంలు సరఫరా చేసే విద్యుత్‌ను ఉపయోగించుకునేలా చేయడం ఈ పథకం ప్రత్యేకత. ఇంట్లో ప్రస్తుతం ఉన్న ఎలక్ట్రిసిటీ ఫిట్టింగ్‌లో ఎలాంటి మార్పులు చేయకుండా ఉన్నది ఉన్నట్టుగా యథావిధిగా వాడుకునేలా ఈపథకాన్ని రూపొందించారు.

ఉచితం ఎలా?

రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్ కింద సోలార్ విద్యుత్‌ను 300 యూనిట్ల వరకు ఉచితంగా ఇవ్వనున్నట్టు ప్రకటించడంతో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి సిద్ధమవుతున్నారు. సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలంటే భారీగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. సామాన్య ప్రజలు అంత మొత్తం వెచ్చించలేరు. అందుకు ప్రజలకు రుణ భారం లేకుండా భారీగా సబ్సిడీ ఇస్తూ సోలార్ సిస్టమ్‌ను అందచేసేందుకు ప్రధాన మంత్రి సూర్యోదయ్ యోజన పథకాన్ని తీసుకువచ్చింది. ఈ పథకం కింద సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకునేవారికి సబ్సిడీని భారీగా పెంచేందుకు సిద్ధమైనట్లు ప్రకటించింది. ఇప్పుడు 40 శాతం సబ్సిడీ ఇస్తుండగా దానిని 60 శాతం పెంచనున్నారు. అయితే ప్రస్తుతం సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకునేవారికి వారు వాడుకున్న విద్యుత్‌పోనూ మిగిలిన కరెంట్‌కు మాత్రమే డిస్కమ్‌లు బిల్లులు ఇస్తున్నాయి. ఈ పథకం కింద ఈ సిస్టమ్ ఏర్పాటు చేసుకున్న వినియోగదారుడు 300 యూనిట్ల వరకు వాడుకున్నదానికి కూడా ఉచితం కింద యూనిట్‌కు ఇంత అని బిల్లు చెల్లించనున్నట్టు తెలుస్తోంది. అయితే ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు వెలువడాల్సి ఉంది.

పెరగనున్న సబ్సిడీ

300 యూనిట్ల కంటే తక్కువ విద్యుత్ వినియోగం ఉన్న వినియోగదారులు సోలార్ సిస్టమ్ కోసం దరఖాస్తు చేసుకుంటే కేంద్రం 60 శాతం సబ్సిడీతో సోలార్ సిస్టమ్ అందిస్తుంది. మిగిలిన 40 శాతం రుణాన్ని లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తుదారులు 40 శాతం డబ్బులు చెల్లించగానే రూఫ్‌టాప్ సోలార్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ఏర్పాటు చేస్తారు. ఒక వేళ అవసరానికి మించి విద్యుత్ ఉత్పత్తి అయినట్లయితే దానిని డిస్కమ్‌లకు విక్రయించుకోవచ్చు. ఈ పథకం ద్వారా కోటి మంది లబ్దిదారులు రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్ ఏర్పాటు ద్వారా 300 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను పొందేందుకు అవకాశం ఉంది. దీని ద్వారా వినియోగదారునికి సంవత్సరానికి రూ. 15వేల నుంచి రూ. 1.80 లక్షల వరకు ఆదా అవుతుంది.

ప్రతీ కేవీపీకి..

ప్రస్తుతం టీఎస్ రెడ్‌కో రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థ ఏర్పాటుకు ప్రోత్సాహకరమైన సబ్సిడీనే ఇస్తోంది. మూడు కిలోవాట్ల వరకు ఏర్పాటు చేసుకునేవారికి కిలోవాట్‌కు రూ 14588 సబ్సిడీ ఇస్తోంది. 3 కెవి సిస్టమ్ ఏర్పాటుకు రూ. 2,6,400 వ్యయం అవుతుంది. ఇందులో లబ్దిదారుడికి రూ. 43764 సబ్సిడీ లభిస్తుంది. అదే 5 కెవి యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్నట్లయితే రూ 3,24,500 ఖర్చవుతుంది. రూ 58352 సబ్సిడీ లభిస్తుంది. 10 కెవి యూనిట్‌ను స్థాపించుకుంటే రూ 6,49,00 వ్యయం కాగా ఇందులో రూ. 94822 సబ్సిడీ వస్తుంది. ఇప్పుడు పీఎం సూర్యోదయ్ యోజన పథకం కింద ఈ సబ్సిడీని 60 శాతం పెంచడం వల్ల లబ్దిదారులకు మరింత ఆర్థిక ప్రయోజనం లభిస్తుంది. ఎక్కువ మంది రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు వచ్చే అవకాశం ఉందని రెడ్‌కో అధికారులు చెబుతున్నారు. సోలార్ సిస్టమ్‌లో ఒక కెవికి నాలుగు యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. 3 కెవి యూనిట్‌ను ఏర్పాటు చేసుకుంటే రోజుకు 12 యూనిట్లు అంటే నెలకు 372 యూనిట్లు ఉత్పత్తి అవుతుంది. అవసరాన్ని బట్టి ఇందులో గరిష్టంగా 200 నుంచి 250 యూనిట్లు వాడుకున్నా మిగతా సౌరవిద్యుత్‌ను డిస్కమ్‌కు విక్రయించుకోవచ్చు. డిస్కమ్‌లు యూనిట్‌కు రూ. 4.20 పైసలు చెల్లిస్తాయి. ఎంత విక్రయిస్తే అంత మొత్తం ఆరు నెలలకు ఒకసారి చెల్లిస్తాయి.

మీటర్ ఒక్కటే మారుతుంది

రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్ ఏర్పాటులో మీటరు ఒక్కటే మార్చుతారు. దాని స్థానంలో ఇన్‌పుట్, అవుట్‌పుట్‌ల సదుపాయం రెండూ ఉండే ఒక ప్రత్యేకమైన మీటరును మాత్రం అమర్చుతారు. మిగిలిన ఏర్పాట్లు ఏవీ మారవు. కేవలం ఆన్‌గ్రిడ్ కనెక్షన్ తీసుకుంటేనే ఈ పథకం వల్ల లబ్ధిచేకూరుతుంది. ఉదయం అంతా సోలార్ విద్యుత్‌ను రాత్రి వేల మామూలు కరెంట్‌ను వాడుకోవచ్చు.

తాళం పగులగొట్టి చోరీ

రూ.4లక్షల నగదు, తులం బంగారం అపహరణ

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 25: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నిరూప్‌నగర్ తండాలో ఇంటి తాళాలు పగులగొట్టిన గుర్తు తెలియని వ్యక్తులు రూ.4లక్షల నగదు, తులం బంగారం అపహరించుకువెళ్లారు. నిరూప్‌నగర్ తండాలో నివాసం ఉంటున్న ఎ.రాజు తన స్వగ్రామం జంగాల పల్లికి ఈనెల 18న పక్కన ఉండే బంధువులకు చెప్పి వెళ్లాడు. శనివారం పక్కన ఉండే బంధువులు చూడగా తాళాలు పగులగొట్టి ఉండటం గమనించారు. బంధువులు రాజుకు సమాచారం ఇవ్వగా ఇంటికి వచ్చిన ఆయన దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. నగదు, బంగారం అపహరించుకుపోయినట్లు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. చోరీ విషయాన్ని ఎస్‌ఐ విజయ్‌కుమార్ ధ్రువీకరించారు.

ఎమ్మెల్యేను అవమానపరిచిన 10 మంది అరెస్టు

ఆత్మకూరు, ఫిబ్రవరి 25: పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి దంపతులను అవమానపరిచి, కానిస్టేబుల్‌ను నెట్టేసి విధులకు ఆటంకం కలిగించిన కేసులో 10 మందిపై కేసు నమోదు చేసినట్లు ఆదివారం ఆత్మకూరు సీఐ సంతోష్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. గత శుక్రవారం అగ్రంపహాడ్ సమ్మక్క సారలమ్మను శుక్రవారం ఉదయం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకుని తిరిగి వస్తున్న సమయంలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి దంపతులు, బీఆర్‌ఎస్ నాయకులు ఎదురుపడ్డారు. ఎమ్మెల్యేను చూసిన బీఆర్‌ఎస్ నాయకులు అవమానపరుస్తూ నినాదాలు చేశారు. వారిని అడ్డుకోబోయిన కానిస్టేబుల్‌ను నెట్టేసి విధులకు ఆటంకం కలిగించారు. కానిస్టేబుల్ రమేష్ ఫిర్యాదు మేరకు బీఆర్‌ఎస్ నాయకులైన అగ్రంపహాడ్‌కు చెందిన ఆవుల శ్రీనివాస్, అక్కంపేటకు చెందిన రేగుల కిషోర్, అగ్రంపహాడ్‌కు చెందిన వంచ సాంబరెడ్డి, పెద్దాపూర్‌కు చెందిన వేల్పుల గణేష్, గుడెప్పాడ్‌కు చెందిన కాంతాల రవీందర్‌రెడ్డి, ఆత్మకూరు వైఎస్ ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి, అక్కంపేట మాజీ సర్పంచ్ కూస కుమారస్వామి, గుడెప్పాడ్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాంతాల కేశవరెడ్డి, దామెర బీఆర్‌ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు నేరేళ్ల కమలాకర్, దామెర వైస్ ఎంపీపీ ఎండీ జాకీర్ అలీ అరెస్టు చేసినట్లు తెలిపారు.

నేడు నగరానికి త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి రాక

సుబేదారి, ఫిబ్రవరి 25: త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి సోమవారం హనుమకొండకు వస్తున్నారని ఓరుగల్లు సిటీజన్స్ ఫోరం కన్వీనర్ డాక్టర్ ఎ. సమ్మిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సిటీజన్స్ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 5 గంటలకు హనుమకొండ హంటర్‌రోడ్‌లోని డీకన్వెన్షన్ హాల్‌లో గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు సమ్మిరెడ్డి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

హుండీల లెక్కింపునకు రంగం సిద్ధం

హనుమకొండ టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాట్లకు కసరత్తు



మేడారం గద్దెలపై ఏర్పాటు చేసిన హుండీలు

హనుమకొండ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క - సారలమ్మ మహాజాతర హుండీల లెక్కింపు ఈనెల 29 నుంచి ప్రారంభం కానున్నది. ప్రతీ జాతరలాగానే ఈ సారి కూడా హనుమకొండలోని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కల్యాణ మండపంలోనే ఈ లెక్కింపు చేపడతారు. ఈ మేరకు ఏర్పాట్లకు కసరత్తు మొదలైంది. హుండీల లెక్కింపు దాదాపు పదిరోజుల పాటు కొనసాగనున్నది. మేడారంలోని తల్లుల గద్దెల ప్రాంగణంలోని హుండీలను లెక్కింపు కోసం కల్యాణ మండపానికి సోమవారం తరలించనున్నట్లు మేడారం సమ్మక్క సారలమ్మ జాతర కార్యనిర్వహణాధికారి రాజేంద్రం తెలిపారు. హుండీల సీళ్లను పరిశీలించడం, తరలింపునకు ముందు వాటిపై దేవాదాయశాఖకు చెందిన ఉన్నతాధికారుల సంతకాలతో పగడ్బందీగా అదనపు సీళ్ల వేయడం మొదలైంది. ప్రతీ హుండీకి నెంబర్లు వేశారు. వీటి ప్రకారం రికార్డుల్లో వాటి వివరాలను నమోదు చేస్తున్నారు. క్రమ సంఖ్యను బట్టి భారీ పోలీసు బందోబస్తు మధ్య ఆర్టీసీ కార్గో బస్సుల్లో వీటిని మండపానికి తీసుకువస్తారు. మండపానికి చేరుకున్న తర్వాత ఇదే నెంబర్ల ప్రకారం క్రమపద్ధతిలో దింపుతారు. భద్రపరిచే ముందు వాటి సీళ్లను మరోసారి పరిశీలిస్తారు.

512 హుండీలు

మేడారం సమ్మక్క - సారలమ్మ జాతరలో ఈ సారి మొత్తం 512 హుండీలను ఏర్పాటు చేశారు. ఈ హుండీలన్నీ దాదాపు నిండిపోయాయి. నిండిన హుండీలను ఎప్పటికప్పుడు గద్దెల ప్రాంగణంలోనే ఒక పక్కన పెట్టారు. ఈ హుండీలలో 482 ఇనుపవి, మిగతావి క్లాత్ హుండీలు. గత జాతర కన్నా ఈసారి 16 హుండీలను అదనంగా ఏర్పాటు చేశారు. వీటితోపాటు అవసరాన్ని బట్టి వాడుకోవడానికి మరికొన్ని హుండీలను కూడా జాతర ప్రాంగణంలో అందుబాటులో ఉంచారు.

ఏర్పాట్లు

హుండీల లెక్కింపునకు ఏర్పాట్లు చేయడం మొదలైంది. లెక్కింపు సందర్భంగా ఎలాంటి పొరపాట్లు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తారు. మండలం లోపల, బయట సీసీ కెమరాలను ఏర్పాటు చేస్తారు. లెక్కింపు ప్రతీ రోజు ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుంది. లెక్కింపు కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు దేవాదాయశాఖ హైదరాబాద్ జోన్‌కు చెందిన అధికారులను నియమిస్తారు. వీరితోపాటు పోలీసులు, రెవెన్యూ, అధికారులుంటారు. లెక్కించేందుకు స్వచ్ఛంద సేవా సంస్థల కార్యకర్తలను ఆహ్వానిస్తారు. లెక్కింపు జరిగే జరిపేవారితో పాటు అధికారులకు డ్రెస్‌కోడ్‌ను ఏర్పాటు చేస్తారు. ప్రక్రియ మొత్తాన్ని వీడియో తీసి సీసీ కెమెరాల ఫుటేజీని భద్రపరుస్తారు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ఈవో రాజేంద్రం, అసిస్టెంట్ కమిషనర్ శ్రీరాముల సునీత, డిప్యూటీ కమిషనర్ శ్రీ కాంతరావు హుండీల లెక్కింపును పర్యవేక్షిస్తారు. మూడు వందల మందికిపైగా సిబ్బంది, వలంటీర్లు లెక్కింపులో పాల్గొంటారు. లెక్కించిన డబ్బులను ఏ రోజు కారోజు బ్యాంకులో జమచేస్తారు.

తిరుగువారం వారం వరకు..

మేడారం జాతరలో హుండీలను తిరుగవారం (బుధవారం) వరకు కొనసాగిస్తారు. శనివారం దేవత వనప్రవేశం జరిగినా భక్తుల మొక్కులు చెల్లించుకోవడం కొనసాగుతోంది. ఇప్పటికీ భారీ సంఖ్యలో భక్తులు దర్శనాలు చేసుకుంటున్నారు. తిరుగువారం వరకు భక్తుల రాక ఉంటుంది. అప్పటి వరకు మరికొన్ని ఖాళీ హుండీలను గద్దెల ప్రాంగణంలో అందుబాటులో ఉంచుతారు. తిరువారం తర్వాత వీటిలోని కానుకలను కూడా లెక్కిస్తారు.

దశదిన కర్మకు వచ్చి అనంతలోకాలకు..

- కాలువలో పడి యువకుడి మృతి
- ధర్మసాగర్ మండలం ఎలుకుర్తిలో ఘటన
- మృతుడు వరంగల్ కరీమాబాద్ వాసి



దూడ రఘుతేజ (ఫైల్)

ధర్మసాగర్, ఫిబ్రవరి 25 : ధర్మసాగర్ మండలం ఎలుకుర్తి గ్రామంలోని కాలువలో పడి వరంగల్ కరీమాబాద్‌కు చెందిన దూడ రఘు(26) అనే యువకుడు మృతి చెందినట్టు సీఐ విశ్వేశ్వర్ ఆదివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం నర్సింగరావుపల్లి గ్రామంలో రఘు స్నేహితుడైన మండల అరుణ్ కుమార్ తాత దశ దిన కర్మకు శనివారం రఘు వచ్చాడు. ఉదయం సుమారు 9 గంటల సమయంలో నర్సింగరావుపల్లి నుంచి అరుణ్ కుమార్‌తో పాటు, అతడి బావ కోహిత్, రఘు ముగ్గురు కలిసి ఎలుకుర్తి గ్రామంలోని దక్షిణ కాలువ వద్దకు వచ్చారు. ఈ క్రమంలో రఘు బహిర్భూమికి వెళ్లి నీటి కోసం కెనాల్‌లోకి దిగుతుండగా ప్రమాదవశాత్తు కెనాల్‌లో కాలు జారి పడ్డాడు. రఘుకు ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ విషయాన్ని చుట్టు పక్కల వారికి తెలుపడంతో రఘు ఆచూకీ కోసం కెనాల్‌లో వెతకగా నీటి ప్రవహం ఎక్కువగా ఉండడంతో ఆచూకీ కనిపించ లేదు. దీంతో కెనాల్‌లోకి నీటి సరఫరాను నిలిపి వేసిన తర్వాత మృత దేహం కోసం మరో సారి గజ ఈతగాళ్లతో వెతకగా మృత దేహం ఆచూకీ లభించింది. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి విచ్చేసి మృత దేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం మార్చురీకి తరలించారు. కాగా, మృతుడి తల్లి, తండ్రి కొద్ది రోజుల క్రితం మృతి చెందారని పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కరీమాబాద్ నానమియాతోటలో విషాదం

కరీమాబాద్, ఫిబ్రవరి 25: హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని దక్షిణ కాలువలో ప్రమాదవశాత్తు పడి వరంగల్ కరీమాబాద్ నానామియాతోట ప్రాంతానికి చెందిన ఓ యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన ప్రకారం... దూడ రఘు తేజ(26) హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. రఘుతేజ స్నేహితుడి తాత దశదిన ఖర్మ ఉండటంతో స్నేహితుడితో కలిసి శనివారం హైదరాబాద్ నుంచి ధర్మసాగర్ మండలంలోని నర్సింగరావుపల్లి గ్రామానికి చేరుకున్నారు. ఆదివారం ఉదయం బహిర్భూమి కోసం కాలువలోకి దిగి బాటిల్‌లో నీళ్ల తీసుకుంటుండగా ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. రఘుతేజకు ఈత రాకపోవడంతో నీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో కొద్దిదూరం కొట్టుకుపోయి ఊపిరాడక మృతి చెందాడు. కాగా, రఘుతేజ తండ్రి దూడ కుమారస్వామి అనారోగ్యంతో రెండు నెలల క్రితం మృతి చెందాడు. తల్లి దూడ కళావతి పది సంవత్సరాల క్రితమే అనారోగ్యంతో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. రెండు నెలల వ్యవధిలోనే తండ్రి, కుమారుడు మృతి చెందడంతో నానమియా తోటలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రసాయనశాస్త్రంలో ముఖీద్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 25: హనుమకొండ కిషన్‌పురలోని చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ రసాయనశాస్త్ర పరిశోధకుడు మహమ్మద్ ముఖీద్ డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు ఆదివారం చైతన్య టూ బీ వర్సిటీ కులపతి డాక్టర్ సీహెచ్‌వీ పురుషోత్తంరెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ డాక్టర్ సాత్వికరెడ్డి మహ్మద్ ముఖీద్‌కు డాక్టరేట్ పట్టా అందచేసి అభినందనలు తెలిపారు. 'న్యూ క్యాటలైటిక్ సిస్టమ్స్ ఫర్ సమ్ సెలెక్టివ్ సీసీ అండ్ సీ హెటిరో ఆటమ్ బాండ్ ఫార్మేషన్స్ ఇన్ కెమికల్ సింథసిస్' అనే అంశంపై ప్రొఫెసర్ నరసింహస్వామికి పర్యవేక్షణలో మహమ్మద్ మఖీద్ పరిశోధన గ్రంథాన్ని రూపొందించారు. డాక్టరేట్ సాధించిన మహమ్మద్ ముఖీద్‌ను చైతన్య డిమ్డ్ టూబీ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ గుర్రాపు దామోదర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రవీందర్, ప్రొఫెసర్ కవిత, రిసెర్చ్ డీన్ ప్రొఫెసర్ ఆర్.క్రిష్టోఫర్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ సుందర్‌రామ్, కంట్రోలర్ జగదీశ్‌కుమార్, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ రాంబాబు, ఇతర స్కాలర్స్ అభినందనలు తెలిపారు.

నీటిపారుదల శాఖలో అక్రమంగా పదోన్నతులు

● సీనియారిటీకి తిలోదకాలు ● నిబంధనలకు నీళ్లు ● దొడ్డిదారిన హడావుడిగా ఉత్తర్వులు




హనుమకొండ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : నీటిపారుదల శాఖలో నలుగురు ఉద్యోగులకు నిబంధనలకు విరుద్ధంగా పదోన్నతులు కల్పించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు ముడుపులు సీనియారిటీని పట్టించుకోకుండా దొడ్డిదారిన ఈ ఉద్యోగులకు పదోన్నతులు కట్టబెట్టి తమకు అన్యాయం చేశారని నీటిపారుదల శాఖలోని విభాగతా ఉద్యోగులు వాపోతున్నారు.

నీటిపారుదల శాఖ 3వ డివిజన్ ఈఈ కార్యాలయం, సూపరింటెండెంట్ ఐఈ కార్యాలయం, 5వ డివిజన్ ఈఈ (సీ అండ్ఐ) ఈఈ కార్యాలయం, జనగామ 4వ డివిజన్ నీటిపారుదల ఈఈ కార్యాలయంలో పని చేస్తున్న మొత్తం నలుగురు జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ కావడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2022, 2023, 2024 సంవత్సరాల సీనియారిటీ లిస్టు లేకుండానే ఈ పదోన్నతులు ఇచ్చినట్టు తెలుస్తోంది. పదోన్నతులకు సంబంధించి కోర్టుకు వెళ్ళిన కొందరికి అనుకూలంగా తీర్పువెలువడ్డాయి. వారికి పదోన్నతులు ఇచ్చే ముందు ఈఎన్‌సీ హెచ్‌వోడికి క్లారిఫికేషన్ కోసం లేఖలు రాసారు. వాటికి సమాధానాలు రాక ముందే ఈ పదోన్నతులు కల్పించనట్టు సమాచారం. నీటిపారుదల శాఖ పునఃవ్యవస్థీకరణ తర్వాత తర్వాత కొత్తగా సీనియారిటీ లిస్టు తీసారు. దీనిని కూడా పట్టించుకోలేదు. పదోన్నతులు కల్పించే ముందు నిబంధనల ప్రకారం ముందు సీనియారిటీ లిస్టును ప్రకటించాలి. ఉద్యోగుల నుంచి అభ్యంతరాలు ఏమైనా ఉంటే స్వీకరించాలి. ఆ తర్వాత మెరిట్, సీనియారిటీ ప్రకారం అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలి. ఉన్నతాధికారులు ఇవేమి పట్టించుకోలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నలుగురు జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తూ హడావుడి ఉత్తర్వుల జారీ చేయడం వెనక ఏదో మతలబు ఉందని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ఈ విషయంలో పెద్ద మొత్తంలో చేతులు మారి ఉంటాయని అనుమానిస్తున్నారు. ప్రభుత్వం ఈ విషయంలో వెంటనే జోక్యం చేసుకొని ఈ పదోన్నతులను నిలిపివేయాలని, విచారణ జరిపి నిబంధనల ప్రకారం అర్హులైనవారికి ప్రమోషన్లు ఇవ్వాలని నీటిపారుదల శాఖలోని ఉద్యోగులు కోరుతున్నారు.

చాక్‌పీసులకు కూడా పైసల్లేవ్!

- భారంగా పాఠశాలల నిర్వహణ
- చెక్‌పవర్ లేక నిధులు డ్రా చేసుకోలేని దుస్థితి
- విలవిలాడుతున్న ప్రధానోపాధ్యాయులు



హనుమకొండ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ)ల ఎన్నికలను రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయడంతో పాఠశాలల నిర్వహణ కష్టంగా మారింది. హెడ్‌మాస్టర్లకు చేతిలో చిల్లిగవ్వలేని పరిస్థితి ఏర్పడింది. చాక్‌పీస్‌లు కొనేందుకు కూడా డబ్బుల్లేని దుస్థితి నెలకొంది. పాఠశాలలు ఊడ్చేందుకు కూడా నయాపైసా లేదు. ఏది కావాలన్నా హెడ్‌మాస్టర్లు తమ జేబుల్లోంచి డబ్బులు ఖర్చుపెట్టాల్సి వస్తోంది. 'మన ఊరు - మనబడి' పనులు ఎక్కడివక్కడ ఆగిపోయాయి. పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వం ఇచ్చిన డబ్బులు ఉండి కూడా డ్రా చేసుకోలేని దయనీయ స్థితి ఉంది. పాఠశాలల నిర్వహణ నిధులను ఖర్చు చేయాలంటే పాఠశాల నిర్వహణ కమిటీ అధ్యక్షుడి సంతకం ఉండాలి. పాత ఎస్‌ఎంసీలు లేకపోవడం.. కొత్తవి ఎన్నిక కాకపోవడం.. ఈ పరిస్థితికి కారణం. వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్న తరుణంలో అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాల్లో ఈ విచిత్ర పరిస్థితి ఏర్పడింది.

పొడిగింపు - రద్దు

ప్రస్తుత ఎస్‌ఎంసీల కాలపరిమితి ఎప్పుడో ముగిసింది. చివరిసారిగా 2019 నవంబర్‌లో ఎస్‌ఎంసీ చైర్మన్ల ఎన్నికలు జరిగాయి. గత ప్రభుత్వం వాటి కాలపరిమితిని రెండోసారి పొడిగించింది. దాని ప్రకారం కిందటేడు నవంబర్ 30తో ముగిసింది. నూతన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న ఎస్‌ఎంసీలన్నిటినీ రద్దు చేసింది. వీటి ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించింది. ఈనెల 29న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు జరగాల్సి ఉంది. ఎస్‌ఎంసీ సభ్యులు, చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికకు నోటీసు ఇచ్చి పిల్లల తల్లిదండ్రుల జాబితాను ఈనెల 20న నోటీసు బోర్డుల్లో ఉంచటడంతో పాటు ఈనెల 22న అభ్యంతరాలు స్వీకరించాలని ఆదేశాలు రావడంతో తదనుగుణంగా ఏర్పాట్లు కూడా జరిగాయి. ఈ తరుణంలో ఎన్నికలను తాత్కాలికంగా నిలివేస్తూ పాఠశాల విద్యా కమిషనర్ ఎ.శ్రీదేవసేన ఆదేశాలు జారీ చేశారు. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఎన్నికలు నిలిపివేయాలని స్పష్టం చేశారు. ఈ మేరకు దృష్టి పెట్టాల్సిందిగా అన్ని జిల్లాల డీఈవోలు, ఈవో, డీపీవోలు, సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ)లకు కమిషనర్ ఆదేశాలు పంపించారు.

నిధులకు కట కట

ఈ ప్రభుత్వ నిర్ణయం ఫలితంగా అటు పాత కమిటీలు లేక ఇటు కొత్త కమిటీలు ఏర్పాటు కాక పాఠశాలలకు మంజూరయిన నిధుల వాడకంలో సమస్యలు తలెత్తుతున్నాయి. నిధులు డ్రా చేయడానికి చెక్కులపై జాయింట్ సంతకం కావలసి ఉండడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పాఠశాల హెడ్‌మాస్టర్‌తో పాటు సీఎంసీ చైర్మెన్ సంతకం పెడితే నిధులు డ్రా చేసుకోవడానికి వీలుంటుంది. ఈ విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో నిధులను ఎలా డ్రా చేయాలో తెలియక హెడ్‌మాస్టర్లు సందిగ్ధంలో పడ్డారు. పాఠశాల నిర్వహణకు నిధులు వాడుకునే పరిస్థితి లేక ఇబ్బందులు పడుతున్నారు. పరీక్షలు దగ్గర పడుతున్నాయి. ఈ సమయంలో ఎస్‌ఎంసీ ఎన్నికల నిర్వహణ చేపడితే సందడి ఏర్పడి విద్యార్థుల పరీక్షల సన్నద్ధతకు భంగం వాటిల్లుతుందని భావించి ప్రభుత్వం ఎన్నికల వాయిదా నిర్ణయం తీసుకోని ఉంటుందని భావిస్తున్నారు. పరీక్షలు పూర్తయ్యే వరకు అంటే మార్చి నెలాఖరు వరకు నిధులు లేకుండా స్కూళ్లను నడపడం ఎలా అన్నదే ప్రశ్న. చాక్‌పీసులు, వివిధ రకాల రిజిస్టర్లు, కరెంట్ బిల్లులు, తాగునీరు, స్వీపర్ తదితర ఖర్చులకు డబ్బుల్లేక హెచ్‌ఎంలు ఇబ్బంది పడుతున్నారు. నిధులు లేక మన ఊరు-మనబడి పనులు ఆగిపోయాయి. పూర్తయిన పనులకు బిల్లులు రావడం లేదు. ఈ పనులను ఎక్కువగా ఎస్‌ఎంసీ చైర్మెన్లు, సర్పంచులే చేశారు. వారంతా ఇప్పుడు బిల్లుల కోసం తిరుగుతున్నారు. కొత్త విద్యా సంవత్సరంలో కొత్త ఎంసీల ఎంపిక తర్వాతగానీ ఈ బిల్లులు వచ్చేట్టు లేవు. అంత వరకు డబ్బులకు కటకట తప్పని పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి జిల్లాలో మూడు వేలకు పైగా ప్రభుత్వ, ఏయిడెడ్ పాఠశాలు ఉండగా వీటిలో లక్షా 25వేల మందికిపైగా విద్యార్థులు చదువుకుంటున్నారు.

మన ఊరు-మన బడికి బ్రేక్

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మొదటి విడత మన ఊరు-మనబడిలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులు ఇంకా పూర్తికాలేదు. ఎస్‌ఎంసీ కమిటీ చైర్మెన్లు, సభ్యుల తీర్మానాల ద్వారానే పనులు నిర్వహించాలి. పాఠశాల నిర్వహణ వ్యవహారాల్లోప వీటి పాత్ర కీలకం. మధ్యాహ్న భోజనం నుంచి విద్యార్థులకు అందే ప్రతీ సంక్షేమ పథకంలో వారికి బాధ్యతలు, భాగస్వామ్యం, పర్యవేక్షణ ఉండేలా గత ప్రభుత్వం ఎస్‌ఎంసీలకు అధికారాలు ఇచ్చింది. వచ్చే జూన్ నుంచి తిరిగి నూతన విద్యా సంవత్సరం (2024-25) మొదలు కానున్నది. సాధారణంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులు పదో తరగతి ఉత్తీర్ణత సాధించి వెళ్లిన వెంటనే వారి తల్లిదండ్రులు ఎస్‌ఎంసీ కమిటీ చైర్మెన్లుగాగానీ, సభ్యులుగాగానీ ఉంటే వారిస్థానంలో వేరేవారిని ఎన్నుకోవాలి. కానీ చాలా పాఠశాలల్లో విద్యార్థులు పాఠశాల వదిలి వెళ్లినా తల్లిదండ్రులే ఎస్‌ఎంసీ చైర్మెన్లు, సభ్యులుగా కొనసాగుతున్నారు.

డామిట్.. సీన్ రివర్స్!



- మళ్లీ ఇన్‌స్పెక్టర్ల బదిలీలకు రంగం సిద్ధం
- ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కసరత్తు
- లక్షలు కుమ్మరించి పోస్టింగ్ పొందిన వారి గుండెల్లో గుబులు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 25: అనుకున్నట్లే అయింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత పలుకుబడితో ఇన్‌స్పెక్టర్ పోస్టింగ్ పొందిన వారికి లోక్‌సభ ఎన్నికల ఎఫెక్ట్ పడుతుందని ఊహించినట్లుగానే జరిగింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, మహబూబాబాద్‌తో పాటు కరీంనగర్, భువనగిరి లోక్‌సభ స్థానాల్లో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ల బదిలీలు జరగనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన ఇన్‌స్పెక్టర్ల బదిలీలలో పారదర్శకత లోపించిందని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు అందాయి. స్పందించిన కమిషన్.. ఈనెల 23న కేంద్ర ఎన్నికల సంఘం గైడ్‌లైన్స్‌తో కూడిన ఆదేశాలు రాష్ట్ర పోలీసు శాఖకు జారీ చేసింది. 26వ తేదీన సాయంత్రం 5 గంటల వరకు జరిగిన పోలీసు ఇన్‌స్పెక్టర్ల బదిలీలకు సంబంధించిన పూర్తి వివరాలు డీజీ కార్యాలయానికి అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని భారత ఎన్నికల కమిషన్ లేఖలో కోరింది. ఆయా జిల్లాల పరిధిలో జరిగిన ఇన్‌స్పెక్టర్ల బదిలీలపై తుది నివేదిక సమర్పించాలని ఎన్నికల కమిషన్ కోరింది. ఒక ఇన్‌స్పెక్టర్ ఒక లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో మూడేళ్లపాటు పని చేయడం.. అలాగే అదే ప్రాంతంలో జన్మించి స్థానికంగా విధులు నిర్వర్తించేవారికి స్థానచలనం కలిగించాలని సూచించింది. ఈ మేరకు ఇదే విషయమై రాష్ట్ర డీజీపీ శనివారం పోలీసు కమిషనరేట్‌తో పాటు ఆయా జిల్లాల పోలీసు ఉన్నతాధికారులతో కాన్ఫరెన్స్‌లో మాట్లాడినట్లు సమాచారం.

పోస్టింగ్‌లు పొందిన వారి గుండెల్లో గుబుల్

వరంగల్ పోలీసు కమిషనరేట్‌తోపాటు ఇతర జిల్లాలో పలు పోలీసు స్టేషన్‌లలో ఇన్‌స్పెక్టర్లుగా పనిచేసేందుకు లక్షలు కుమ్మరించి పోస్టింగ్‌లు పొందిన అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. మూడు రోజుల కిందట భారత ఎన్నికల కమిషన్ నుంచి ఆదేశాలు వెలువడడంతో తలలు పట్టుకుంటున్నారు. ఇటీవల చాలామంది పోస్టింగ్ పొందిన వారు సొంత నియోజకవర్గంలోనే విధులు నిర్వర్తిస్తుండడంతో అయోమయానికి గురవుతున్నారు. విషయాన్ని వారి గాడ్‌ఫాదర్లకు చెప్పుకుని నీరసిస్తున్నట్టు తెలుస్తోంది. దీంతో లోక్‌సభ ఎన్నికల తర్వాత ఇక్కడే పోస్టింగ్‌లు వచ్చేలా చేస్తామని నేతలు భరోసా ఇచ్చినట్టు సమాచారం. అయితే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నేడో, రేపో బదిలీలో జరుగుతాయని సమాచారం.

సీఎంఆర్ లక్ష్యం పూర్తయ్యేనా?

నెలాఖరులోగా సీఎంఆర్ ఇవ్వాలి ● అక్రమ వ్యాపారం సాగించే మిల్లర్లపై చర్యలు

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 25: కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను మిల్లర్లు అప్పగించే గడువును మరోసారి ఈ నెలాఖరు వరకు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈసారైనా లక్ష్యం పూర్తవుతుందా లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సీఎంఆర్ సేకరణ గడువు పెంచాలని కోరడంతో ఈ నెల 29వ తేదీ వరకు మిల్లర్లు 2022-23 సంవత్సరానికి సంబంధించి వానకాలం, యాసంగి సీజన్ల బియ్యాన్ని అందజేయవచ్చంది. అప్పటికే పలుమార్లు గడువు పొడిగించిన కేంద్ర ప్రభుత్వం ఇక గడువు పెంచేది లేదని స్పష్టం చేసింది. డిసెంబరు 31వ తేదీతోనే గడువు ముగిసినా మిల్లర్లు సీఎంఆర్ బియ్యాన్ని తిరిగి ఇవ్వకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు కేంద్రం జనవరి 31వ తేదీ వరకు పొడిగించింది. అయినా లక్ష్యాన్ని చేరకపోవడంతో మరోసారి గడువు పొడిగించింది. సీఎంఆర్ ధాన్యంతో అక్రమంగా వ్యాపారం నిర్వహించే వారిపై పౌరసరఫరాలశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఎన్నడూ లేని విధంగా తనిఖీలు చేస్తూ ధాన్యం నిల్వలు లేకుంటే మిల్లులపై కఠిన చర్యలు తీసుకునేందుకు సైతం వెనుకాడేది లేదని హెచ్చరికలు జారీ చేశారు.

సేకరణలో జాప్యం


2022 సంవత్సరంలో వానకాలం సీజన్‌లో హనుమకొండ జిల్లాలో మొత్తం 63 రైస్ మిల్లులు ఉండగా 61 మిల్లులకు 90,886 మెట్రిక్ టన్నుల లక్ష్యంగా నిర్దేశించించారు. 88,103 సరఫరా చేయగా, ఇంకా 2783 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మిల్లర్లు సరఫరా చేయాల్సి ఉంది. 97శాతం సీఎంఆర్ లక్ష్యాన్ని చేరుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. అలాగే వానకాలం సీజన్‌లో 34 మిల్లులకు 95,590 మెట్రిక్ టన్నులు లక్ష్యం నిర్దేశించగా, 47,849 బియ్యం అప్పగించగా, ఇంకా 48,220 బియ్యం సరఫరా చేయాల్సి ఉంది. వానకాలం లక్ష్యాన్ని 50శాతం మాత్రమే మిల్లర్లు చేరుకున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. 2023 సంవత్సరానికి జిల్లాలోని 63 మిల్లులకు 79,161 మెట్రిక్ టన్నుల ధాన్యం లక్ష్యం నిర్దేశించగా 53,037 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అప్పగించాల్సి ఉంటుంది.

నెలాఖరులోగా సీఎంఆర్ ఇవ్వాలి

జిల్లాలో సీఎంఆర్ విషయంలో గత రెండు, మూడు సీజన్లుగా రైస్ మిల్లర్లు ప్రభుత్వ ఆదేశాలు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతీ సంవత్సరం రెండు సీజన్లలో పెండింగ్ పెడుతూనే ఉన్నారు. గత రెండు సీజన్లుగా సకాలంలో బియ్యం అప్పగించని మిల్లుల్లో సోదాలు నిర్వహించాలని ప్రభుత్వం నుంచి అధికారులకు ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. లక్ష్యం చేరని మిల్లర్లపై అవసరమైతే జరిమానా విధించడంతో పాటు ఆర్.ఆర్. యాక్టు ప్రకారం చర్యలు తీసుకోనున్నారు. బియ్యం అప్పగించని రైస్ మిల్లులపై రెవెన్యూ, పోలీస్, పౌరసరఫర సంస్థలతో కూడిన టాస్క్‌ఫోర్స్ త్వరలోనే దాడులు చేసే అవకాశం ఉందనే సమాచారంతో మిల్లర్లు ప్రభుత్వం నిర్దేశించిన బియ్యాన్ని అందించేందుకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ ఆదేశాలు పాటించాలి

మహేందర్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్



గడువులోగా మిల్లర్లు వారి లక్ష్యాలను పూర్తి చేయాలి. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సీఎంఆర్‌ను నెలాఖరులోగా అప్పగించాలి. ప్రభుత్వ ధాన్యాన్ని సొంతానికి వాడుకున్నా, ప్రభుత్వ నిబంధనలు పాటించని మిల్లర్లపై జరిమానా విధించడంతో పాటు ఆర్.ఆర్. యాక్టు ప్రకారం చర్యలు తీసుకుంటాం. మిల్లర్లు సీఎంఆర్‌ను పెండింగ్ ఉంచకుండా వారికి సరఫరా చేసిన ధాన్యానికి అనుగుణంగా బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాలి.

మేడారం బస్సులో బంగారం చోరీ

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 25: మేడారం జాతరకు వెళ్లి వస్తున్న ఇద్దరు వ్యక్తుల మెడలో నుంచి బంగారం చోరీకి గురైంది. అలసిపోయి నిద్రమత్తులో ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు బంగారాన్ని చోరీ చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లాకు చెందిన గంగాధర మధు, అతడి భార్య స్వప్న ఆదివారం మేడారం జాతరకు వెళ్లారు. దైవ దర్శనం తర్వాత ఇద్దరు కలిసి మధ్యాహ్నం 2.30 గంటలకు మేడారం బస్‌స్టేషన్‌లో ఆర్టీసీ బస్సును ఎక్కారు. పొద్దంతా అలసిపోయి ఉండడంతో వారు బస్సులోఎక్కి కూర్చున్న తర్వాత నిద్రలోకి జారుకున్నారు. సాయంత్రం 6గంటల వరకు హనుమకొండ కొత్తబస్‌స్టేషన్‌లో దిగిన తర్వాత మెళకువ వచ్చి మెడలో చూసుకోగా ఇద్దరి మెడలో ఉన్న బంగారు గొలుసు, పుస్తెల తాడు కనిపించలేదు. లబోదిబో మంటూ చుట్టుపక్కల వారిని అడిగినా ప్రయోజనం లేకుండా పోయింది. అంతే కాకుండా మధు జేబులో ఉన్న పర్సును కూడా గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్టు బాధితులు తెలిపారు. సోమవారం హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బాధితులు తెలిపారు. 50 గ్రాముల బంగారం, రూ.8వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్టు బాధితులు తెలిపారు.



ఇద్దరు యువకుల ఆత్మహత్యాయత్నం

మామునూరు, ఫిబ్రవరి 25: నగరంలోని 43వ డివిజన్ మామునూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గల నక్కలపల్లిలో ఉసిల్ల రాంబాబు, ఉసిల్ల ప్రవీణ్ అనే యువకులు మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు ఎక్కి ఆత్మాహత్యాయత్నానికి పాల్పడ్డారు. గ్రామంలో కొంత కాలంగా జరుగుతున్న భూ వివాదంలో తమకు న్యాయం చేయాలంటూ ఆ ఇద్దరు యువకులు వాటర్ ట్యాంకు ఎక్కి హల్‌చల్ చేశారు. భూ వివాదంలో ఆదివారం ఇరువర్గాల మధ్య గొడవ జరిగిందని గ్రామస్తులు తెలిపారు. ఈ క్రమంలో వాటర్ ట్యాంకు ఎక్కిన యువకులను కాపాడేందుకు గ్రామస్థులు రావడంతో రంగశాయిపేట-నెక్కొండ రహదారిపై గంట పాటు రాకపోకలు స్తంభించాయి.

మామునూరు ఎస్ఐ కృష్ణవేణి సంఘటనా స్థలానికి చేరుకొని న్యాయం జరిగే విధంగా చేస్తామని పోలీసులు చెప్పడంతో యువకులు దిగివచ్చినట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయంపై ఎస్ఐ కృష్ణవేణిని వివరణ కోరడానికి ప్రయత్నించగా అందుబాటులో లేరు.

రాష్ట్రంలో వర్సిటీ విద్యను ప్రక్షాళన చేయాలి

సీఎం రేవంత్‌రెడ్డికి ప్రొఫెసర్ గాదె దయాకర్ విజ్ఞప్తి



సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడుతున్న ప్రొఫెసర్ గాదె దయాకర్

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 25: రాష్ట్రంలోని వర్సిటీ విద్యను, ఉన్నత విద్య రంగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి కేయూ కెమిస్ట్రీ విభాగం రిటైర్డు ప్రొఫెసర్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ప్రచారక మిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రొఫెసర్ గాదె దయాకర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని తన నివాసంలో కలిసి ఉన్నత విద్య, వర్సిటీల ప్రక్షాళలపై చర్చించారు. ఆరేళ్లుగా వర్సిటీలతో వీసీల పాలన అస్తవ్యస్థంగా మారిందని పేర్కొన్నారు. వెంటనే ఉన్నత విద్యకు న్యాయం చేయాలని కోరారు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న అన్ని వర్గాల పేద విద్యార్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందించే దిశగా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సమగ్రనివేదికలో కోరారు. రాబోయో వైస్‌చాన్స్‌లర్ల నియామకాల్లో సమర్థవంతమైన అంకిత భావం కల్గిన నిజాయితీ పరులను నియామించాలని రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

దీప దాసుమున్షీకి రామగళ్ల విజ్ఞప్తి



దీప దాసుమున్షీతో పరమేశ్వర్

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 25: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీప దాసు మున్షీని హైదరాబాద్ గాంధీభవన్‌లో వరంగల్ పార్లమెంట్ టికెట్ ఆశావహుడు డాక్టరు రామగళ్ల పరమేశ్వర్ ఆదివారం కలిశారు. పార్లమెంట్ టికెట్ కేటాయించాలని విన్నవించారు.

సినీ రంగంలో స్వయంకృషితో రాణించాలి

మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్



సీడీని ఆవిష్కరిస్తున్న అజ్మీరా సీతారాం నాయక్

వడ్డెపల్లి, ఫిబ్రవరి 25: యువత సినీ రంగంలో స్వయంకృషితో రాణించాలని మాజీ ఎంపీ, ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్ అన్నారు. ఆదివారం హనుమకొండ ప్రశాంత్ నగర్ తెలంగాణ చౌరస్తాలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో నూతన సినీ ప్రొడక్షన్ హౌస్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై 'తల పోసిన తలంబ్రాల సాక్షిగా' అనే సీడీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీతారాం నాయక్ మాట్లాడుతూ.. సినిమాల చిత్రీకరణకు ఓరుగల్లులోని లొకేషన్లు అణువుగా ఉన్నాయని చెప్పారు. కాకతీయులు ఏలిన ఓరుగల్లు కవులు, కళాకారులకు పుట్టినిల్లు అని అన్నారు. కార్యక్రమంలో ప్రొడక్షన్ హౌస్ సంస్థ ప్రతినిధి ఇంద్రజిత్, నటీ నటులు వాన్య అగర్వాల్, గడ్డం రాజ్, శ్రావన్, గణేష్, అనిల్, లక్కీ, యూటూబ్ ఫేమస్ రైటర్, సింగర్ దిలీప్ దేవగన్, స్టార్ డైరెక్టర్ మోహన్ మరిపల్లి, భూక్యా సాంబయ్య నాయక్, కిషన్‌రాయ్, దేవేందర్, సిద్దూ పాల్గొన్నారు.

పాస్టర్లకు రూ. 10వేల భృతి చెల్లించాలి

వర్ధన్నపేట, ఫిబ్రవరి 25 : దీప దూప నైవేద్యం పథకం కింద అర్చకులకు నెలకు రూ. 10వేలు ఇచ్చినట్లుగా రాష్ట్రంలోని పాస్టర్లకు నెలకు రూ.10వేల భృతి ఇవ్వాలని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ బీపీ, షుగర్ బాధితులకు కూడా చేయూత పింఛన్ వర్తింపజేయాలన్నారు.

అస్తవ్యస్తంగా హనుమాన్‌నగర్ జంక్షన్

• ప్రతీ రోజు ట్రాఫిక్ జామ్.. • అడ్డదిడ్డంగా ఆటోల పార్కింగ్
• రోడ్డు మధ్యలో లేబర్ అడ్డా • ఇబ్బందులు పడుతున్న ప్రజలు





హనుమాన్ జంక్షన్‌లో ట్రాఫిక్ జామ్ కావడంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 25: వరంగల్ గ్రేటర్‌గా మారినా కూడా కొన్ని చోట్ల ప్రజలకు ట్రాఫిక్ అవస్థలు తప్పడం లేదు. ఉదయం కుటుంబ సభ్యులతో బయటకు వెళ్లాలంటే నరకయాతన అనుభవించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. నగరంలో ఎక్కడా కూడా అధికారిక పార్కింగ్ జోన్లు లేక పోవడం, ఆపై రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేస్తే పోలీసులు ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో జరిమానాలు పంపిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు అతి పెద్ద భారంగా కనిపిస్తోంది. ప్రధానంగా హన్మకొండ పెద్దమ్మగడ్డ, కేయూ రోడ్డులో ఉన్న హనుమాన్‌నగర్ జంక్షన్‌లో ప్రజలు ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2, 5, 54వ డివిజన్‌ల కూడలిలో ఉన్న హనుమాన్‌నగర్ జంక్షన్‌లో చుట్టు పక్క గ్రామాల ప్రజలతో పాటు స్థానికులకు ఇబ్బంది కలిగిస్తోంది. ఈ జంక్షన్ నుంచి ప్రతీ రోజు పలు గ్రామాల ప్రజలు ప్రయాణిస్తుంటారు. నిత్యం విద్యాసంస్థలతో కూడిన ప్రైవేటు బస్సులు, ద్విచక్రవాహనాలు, ఆర్టీసీ బస్సులు, భారీ లారీలు ఇక్కడి నుంచే రాకపోకలు సాగిస్తుంటాయి.

కానీ జంక్షన్‌లో ట్రాఫిక్, సివిల్ పోలీసుల పర్యవేక్షణ కనిపించడంలేదు. జంక్షన్ ఆనుకుని కిరాణం ముందు ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫారం ఉండంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ అమర్చిన సెంట్రల్ లైటింగ్ సిస్టం ఉన్న ఫలంగా తొలగించడంలో రాత్రి సమయంలో ఈ ప్రాంతం అంధకారంగా మారుతోంది. దీంతో అకతాయిలు, దొంగలు, హల్‌చల్ చేస్తున్నారు. ఈ మార్గంగుండా పెగడపెల్లి, గుండ్లసింగారం, రెడ్డిపురం, సీతానాగారం, ముచ్చెర్ల, నాగారం, బైరాన్‌పల్లి, అర్వపెల్లి, అంబాల, కమలాపూర్ గ్రామాలకు రోజుకు వందలాది మంది ప్రజలు ప్రయాణం సాగిస్తారు. కానీ ఇక్కడ నెలకొన్న సమస్యలను పోలీసులు, ప్రజా ప్రతినిధులు గానీ పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.

ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంది..



హనుమాన్‌నగర్ జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంది. ఉదయం 8 గంటల సమయంలో ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే కనీసం గంట పడుతుంది. దీనికి తోడు రోడ్లపైనే అడ్డదిడ్డంగా వాహనాలు పార్కింగ్ చేయడం, లేబర్ అడ్డామీదకు వచ్చిన వారు రోడ్డుపైనే నిలబడడంతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుంది. జిల్లా అధికారులు స్పందించాలి. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి.

\- గట్ల రంజిత్‌రెడ్డి, షాపు నిర్వాహకుడు

ఉదయం వేళ ట్రాఫిక్ జామ్

హనుమాన్‌నగర్ జంక్షన్‌లో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 10 గంటల వరకు అడుగుతీసి అడుగు వేయాలంటే చాలా కష్టంగా ఉంటోంది. ఇక్కడి లేబర్ అడ్డాపై ఉదయం దినసరి కూలీలు వందలాది మంది రోడ్డుపైనే గుంపులు గుంపులుగా నిలబడి ఉంటారు. అదే సమయంలో గ్రామీణ ప్రాంతాల నుంచి నగరానికి పాఠశాల, కళాశాలల బస్సులు ప్రయాణిస్తుంటాయి. ఆఫీసులు, స్కూళ్లకు వెళ్లే ఉద్యోగులు, ఉపాధ్యాయులు ద్విచక్రవాహనాలపై ప్రయాణిస్తుంటారు. రోడ్డుపైనే వరుసగా కూరగాయల వ్యాపారులు తిష్టవేసి కూర్చుంటారు. రోడ్డుకు రెండు వైపులా షాపులకు అడ్డంగా ఆటోలు బారులు తీరి ఉంటాయి. పెగడపెల్లి వెళ్లే రోడ్డు ఇరుకుగా ఉండడంతో ప్రజలు ఇక్కడే ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నారు. ఈ సమస్య ప్రజలు చాలా కాలంగా ఎదుర్కొంటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సెంటర్‌లో గతంలో హన్మకొండ, కేయూ, ట్రాఫిక్ పోలీసులు వంతులుగా డ్యూటీలు చేస్తూ ట్రాఫిక్ సమస్యలను నియంత్రించే వారు. కానీ ఇటీవల ఎవరూ పట్టించుకోక పోవడంతో ఇక్కడి ట్రాఫిక్ సమస్య మరింత ఇబ్బందిగా మారింది. ఇటీవల ట్రాఫిక్ పాయింట్ ఏర్పాటు చేసినా సిబ్బంది లేక పోవడంతో ఉత్సవ విగ్రహంలా కనిపిస్తోంది. ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి మ్యాన్‌వల్‌గా ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇక్కడి లేబర్ అడ్డాను పక్కనే ఉన్న హనుమాన్ గుడి ప్రాంగణంలోకి మారిస్తే ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని ప్రజలు సూచిస్తున్నారు.

రోడ్డుపైనే ఆటోలు, కూరగాయల షాపులు

ఉదయం 5 గంటలు కాకముందే రోడ్డుపైన బారులుగా కూరగాయల చిరువ్యాపారులు దర్శనమిస్తారు. వారికి తోడుగా రోడ్డుపైనే పదుల సంఖ్యలో అడ్డదిడ్డంగా ఆటోలు పార్కింగ్ చేయడంతో ప్రయాణికులకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో కమర్షియల్ షాపుల ముందు ఆటోలు నిలిపి వ్యాపారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆటోలు తీయాలని కోరితే షాపుల యజమానులపైకి దాడులకు పాల్పడుతున్నారని జంకుతున్నారు. పోలీసులు వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పరికి సదానందంను పార్లమెంటుకు పంపాలి

తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ రాష్ట్ర జేఏసీ చైర్మన్ సాయిబాబు



సాయిబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంఘం నాయకులు

వడ్డెపల్లి, ఫిబ్రవరి 25 : వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా దరఖాస్తు చేసుకున్న వరంగల్ మండలం పైడిపెల్లి గ్రామానికి చెందిన తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరికి సదానందంకు అవకాశం కల్పించాలని రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ సాయిబాబు, కో చైర్మన్ ఇనుగాల శ్రీధర్, కో కన్వీనర్ బీసీరెడ్డి, వైస్ చైర్మన్ అనిల్‌కుమార్ కాంగ్రెస్ జాతీయ అధిష్ఠాన వర్గంతో పాటు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం హనుమకొండ వడ్డెపల్లి రోడ్డులోని ఓ ప్రైవేటు సమావేశ మందిరంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ జేఏసీ సమావేశంలో పరికి సదానందంకు సంపూర్ణ మద్దతును ప్రకటిస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సదానందంకు లోక్‌సభ టికెట్ కేటాయిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 60 వేల మంది విద్యుత్ ఇంజనీర్లు, కార్మికులు, ఇతర ఉద్యోగులందరు సంపూర్ణ మద్దతు ప్రకటించి ఉద్యోగ సంఘాల నేత అయిన సదానందంను ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని అన్నారు. సమావేశంలో జేఏసీ, అసోసియేషన్ నాయకులు సామ్యానాయక్, నార్ల సుబ్రహ్మణ్యేశ్వర్‌రావు, మహేందర్‌రెడ్డి, మచ్చిక బుచ్చయ్య గౌడ్, మహ్మద్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

దత్త క్షేత్రంలో వైభవంగా అభిషేకాలు

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 25: దేవతలకు ప్రీతికరమైన మాఘ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం నగరంలో ములుగు రోడ్డులో గల శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్త క్షేత్రంలో దత్తాత్రేయ స్వామికి వైభవంగా తైలం, సుగంధ ద్రవ్యాలు, క్షీరాభిషేకం నిర్వహించారు.

పెద్ద ఎత్తున భక్తులు హాజరు కాగా భక్తుల చేత ఉత్సవ మూర్తికి నువ్వుల నూనెతో అర్చకుడు రాపాక గోపీకృష్ణ శర్మ అభిషేకం చేయించారు. ఆదివారం రోజున దత్తాత్రేయ స్వామికి తైలంతో అభిషేకం నిర్వహించడం వలన అనారోగ్య, గ్రహ బాధలు లేకుండా మంచి జరుగుతుందని భక్తులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థులు సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 25: పూర్వ విద్యార్థుల సమ్మేళనం హనుమకొండ హంటర్‌రోడ్‌లోని విష్ణుప్రియ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించుకున్నారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మునిగలవీడులోని జిల్లా పరిషత్ పాఠశాల 50 యేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వ విద్యార్థులు సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను ఏప్రిల్ 19, 20, 21 తేదీల్లో ఘనంగా నిర్వహించాలని పూర్వ విద్యార్థులు నిర్ణయించుకున్నారు. ఈ సందర్భంగా గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల గౌరవ అధ్యక్షుడు బియ్యాల దేవేందర్‌రావు, అధ్యక్షుడు దేశబోయిన వీరమల్లు మాట్లాడుతూ.. ఉత్సవాలను విజయవంతం చేయడానికి ప్రతీ పూర్వ విద్యార్థి బాధ్యతగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి తిరుమల్ మరింగంటి, కోదుమూరి రమేశ్, కె.లక్ష్మారెడ్డి, రిటైర్డ్ ప్రొఫెసర్ కొమ్మారెడ్డి, బి.కోటయ్య, ఆకారపు వెంకటేశ్వర్లు, కాయల వేణు, పారుపల్లి ఉమేశ్, బియ్యాల సతీష్, కె.నాగరాజు, కోండ్లె సత్యనారాయణ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లెల్ల రాజయ్య మృతి తీరనిలోటు



మాట్లాడుతున్న డీఆర్‌ఓ వైవి.గణేష్

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 25: కవి, రచయిత, విశ్రాంత ఉపాధ్యాయుడు నల్లెల్ల రాజయ్య మృతి తీరని లోటని డీఆర్ఓ వైవి. గణేష్ అన్నారు. ఆదివారం హనుమకొండ కలెక్టరేట్ ఆవరణలోని టీజీవో భవన్‌లో నల్లెల్ల రాజయ్య సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డీవో మాట్లాడుతూ.. రాజయ్య పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక ద్వారా పరిచయం అయ్యారని, పచ్చదనం పెంపు కోసం పద్మాక్షి చెరువుకట్టపై అనేక చెట్లు నాటి సంకించారని గుర్తు చేశారు. పర్యావరణ, పచ్చదన ప్రేమికుడుని ఇంత తొందరగా కోల్పోవడం విచారకరమన్నారు. వక్తలు మాట్లాడుతూ.. పౌరస్పందన వేదిక ఏర్పాటు చేసి దాని ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ చురుకుగా పాల్గొనేవాడని అన్నారు. నల్లెల్ల రాజయ్య విగ్రహం ఏర్పాటు చేసేందుకు అన్ని సంఘాలు కృషి చేయాలని తెలిపారు. సంస్మరణ సభలో కె.పురుషోత్తం, టి.శ్రవణ్ కుమార్, పుల్లూరు సుధాకర్, సిరాజుద్దీన్, శంకర్‌రావు, డాక్టర్ చంద్రభాను, బాసిత్, బిల్ల మహేందర్, మండల పరశురాములు, డాక్టర్ కె.అనితారెడ్డి, పి.రాజ్‌కుమార్, పి.చంద్రశేఖర్‌రెడ్డి, జి.నరేశ్, కె.దామోదర్, డి.రామానుజం, అస్నాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైకుంఠధామం అభివృద్ధి కమిటీ ఎన్నిక



మడికొండ వైకుంఠ ధామం అభివృద్ధి కమిటీ సభ్యులు

మడికొండ, ఫిబ్రవరి 25: మడికొండలోని మెట్టుగుట్ట సమీపంలోని వైకుంఠధామంలో కనీస వసతులు కూడా లేకుండా చనిపోయిన వారిని దహనం చేసే సందర్భంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈసమస్యలను పరిష్కరించుకోవడానికి స్థానికులే ముందుకు వచ్చి స్థానిక మునిసిపల్ కార్యాలయం వద్ద మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం రాజకీయాలకు అతీతంగా వైకుంఠధామం(శ్మశానవాటిక) అభివృద్ధి కోసం అఖిల పక్షం కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా పెట్టెం సాంబయ్య, ఉపాధ్యక్షుడిగా దువ్వ శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా నర్మెట భిక్షపతి గాండ్ల, ముఖ్య సలహాదారులుగా దువ్వ నవీన్, వస్కుల శంకర్, బ్లిల రవిందర్, బొల్లికొండ వినోద్‌కుమార్, బుర్ర రాజ్‌కుమార్, పెండ్లి క్రిష్ణమూర్తి, బుర్ర శ్రీధర్, పైడిపాల రఘుచందర్, బైరి లింగమూర్తి, కొలిపాక కుమార్‌బాబు, అల్లం శ్రీనివాస్, పల్లపు అర్జున్, గడుసు రాజు, కొప్పుల నవీన్, రసజ్ఞ, జవ్వాజి కిషన్, జంపయ్య, కామని మల్లేష్, గున్నాల గౌతం ఎన్నికయ్యారు. కార్యక్రమంలో 46వ డివిజన్ కార్పొరేటర్ మునిగాల సరోజన కరుణాకర్ పాల్గొని శ్మశాన వాటికలో అభివృద్ధి పనులకు సహకరిస్తామని తెలిపారు.



గ్రాడ్యుయేషన్ డేలో విద్యార్థులతో అతిథులు

ఆయుర్వేద వైద్యానికి ఉజ్వల భవిష్యత్

బోర్డు ఆఫ్ ఇండియన్ మెడిసిన్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ శ్రీనివాస్

వడ్డెపల్లి, ఫిబ్రవరి 25 : ప్రాచీన కాలం నుంచి వాడుకలో ఉన్న ఆయుర్వేద వైద్యానికి ఉజ్వల భవిష్యత్ ఉందని బోర్డ్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో అనంతలక్ష్మీ ఆయుర్వేద ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఆయనతో పాటు కళాశాల ప్రిన్సిపాల్ కె. అశోక్ కుమార్ ఆయుర్వేద పితామహుడు ధన్వంతరి చిత్రపటానికి పూల మాలలు వేసి వందనం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. నూతనంగా గ్రాడ్యుయేషన్ పత్రాలను అందుకున్న యువ డాక్టర్లు సమాజానికి విశిష్టమైన వైద్య సేవలను అందించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు జ్ఞానేశ్వర్, జగన్మోహనాచార్యులు, రజినీకాంత్, హరీష్, కృపాకర్, మనుజ, నివేదిత, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మడికొండ, ఫిబ్రవరి 25: మడికొండలోని వాల్మీకి నగర్‌కు చెందిన పెనుకుల సాయి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. అతడి దశదిన కర్మను పురస్కరించుకొని ఆదివారం స్థానిక కాంగ్రెస్ నాయకులు కుర్ల మోహన్, బైరి లింగమూర్తి, పైడిపాల రఘుచందర్, పల్లపు అర్జున్, మండల రఘు, ముచ్చు అజయ్‌కుమార్, బోగి మహేందర్, ముష్కె. సాంబయ్య, కంచనపల్లి వెంకటయ్య సాయి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.

తెలుగు భాషను పరిరక్షించుకోవాలి

ఆచార్య బన్న ఐలయ్య

హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 25: తెలుగు బాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత సమాజంలో ఎంతైనా ఉందని ఆచార్య బన్న ఐలయ్య అన్నారు. ఆదివారం హనుమకొండలోని బీఈడీ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేడు అనేక భాషలు ప్రపంచ వ్యాప్తంగా అంతరించి పోతున్నాయని, భాష అంతరిస్తే జాతి కూడా అంతరించినట్లేనని చెప్పారు. మన మాతృభాషను కాపాడుకోవల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

ఉదయ సాహితీ వంటి సంస్థలు మాతృభాష పరిరక్షణ కోసం పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉదయ సాహితీ వరంగల్ జిల్లా శాఖ అధ్యక్షురాలు వకుళ వాసు, శ్రీలేఖ సాహితీ అధ్యక్షుడు డాక్టర్ టి. శ్రీరంగ స్వామి, తెలంగాణ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి బిల్ల మహేందర్, ఉదయ సాహితీ రాష్ట్ర అధ్యక్షుడు దాస్యం లక్ష్మయ్య, సంస్థ గౌరవ అధ్యక్షుడు ఏడెల్లి రాములు, నగునూరి రాజన్న, మేరుగు అనురాధ తదితరులు పాల్గొన్నారు.

అమృత్ రైల్వే స్టేషన్‌గా వరంగల్

5వ పేజీ తరువాయి

అర్థిస్తున్న వరంగల్ రైల్వే స్టేషన్ అమృత్ భారత్ రైల్వే స్టేషన్‌గా మరింత అభివృద్ధి చెందుతుందని అధికారులు చెబుతున్నారు.

ప్రారంభానికి ఏర్పాట్లు

వరంగల్‌తో పాటు పలు రైల్వే స్టేషన్ల అమృత్ భారత్ అభివృద్ధి పనులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ ప్రారంభ కార్యక్రమానికి వరంగల్ రైల్వే స్టేషన్‌లో రైల్వే అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రైల్వే స్టేషన్‌లోని నాలువ ప్లాట్‌ఫారంపై ప్రధాని వర్చువల్ ప్రారంభం వీక్షించేలా, ప్రధాని ప్రసంగం వినేలా స్క్రీన్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి అతిథులు ఎవరనే విషయంలో స్థానిక రైల్వే అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు.

మహేష్‌బాబు 'నేనొక్కడినే'తో వెండితెరకు పరిచయమైన నటి **కృతి సనన్**. ఆ తరువాత అద్భుతమైన అభినయంతో జాతీయ అవార్డు గెలుచుకుంది. 'మిమీ రాథోడ్'గా అయినా... 'జానకి'గా అయినా... పాత్ర ఏదైనా మెప్పించగల ప్రతిభ ఆమెది. పరిశ్రమలోకి వచ్చి పదేళ్లయినా... ఆమెలో ఇంకా అవే టీనేజీ మెరుపులు... నవ యవ్వన కాంతులు. ఎలా..?



ఫిట్‌గా ఉంటే... ఆరోగ్యం... ఆనందం

వారసులు వరుస కట్టిన బాలీవుడ్‌లో... బంధుప్రీతిని ధైర్యంగా ప్రశ్నించిన నటి కృతి సనన్. గాడ్‌ఫాదర్లు ఎవరూ లేకపోయినా... కేవలం ప్రతిభను నమ్ముకొని ఇన్నేళ్లుగా రాణిస్తోంది. 'పరిశ్రమకు చెందినవారే కాదు... ప్రతిభావంతులైన ఇతర నటులకు కూడా అవకాశాలు ఇవ్వాలి' అంటూ ఆ మధ్య హిందీ చిత్ర నిర్మాతలను ఉద్దేశించి ఆమె చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. దేశ రాజధాని ఢిల్లీలో పుట్టి పెరిగిన కృతి తండ్రి రాహుల్ సనన్ సీఏ. తల్లి గీత ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ఫిజిక్స్ ప్రొఫెసర్. పంజాబీ కుటుంబం. 'ఢిల్లీ పబ్లిక్ స్కూల్'లో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసిన కృతి... నోయిడా 'జేపీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ'లో 'ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీ కమ్యూనికేషన్స్'లో ఇంజనీరింగ్ చదివింది. అయితే ఉద్యోగాల వైపు వెళ్లలేదు.

గ్లామర్ రంగంపై మక్కువతో ముంబయికి వెళ్లింది కృతి. మోడలింగ్ చేస్తుండగా... 2014లో ఆమెకు తెలుగులో 'నేనొక్కడినే'లో హీరోయిన్‌గా అవకాశం లభించింది. ఆ చిత్రం షూటింగ్ జరుగుతుండగానే టైగర్ షరాఫ్‌తో 'హీరోపంతి'లో నటించి బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. దానికి గానూ ఫిలిమ్‌ఫేర్ అవార్డు దక్కించుకుంది. అది మొదలు కృతి కెరీర్‌కు ఎక్కడా బ్రేక్‌లు పడలేదు. మరుసటి ఏడాది తెలుగులోనే మరో చిత్రం... 'దోచెయ్'లో హీరోయిన్‌గా చేసింది. 2021లో విడుదలైన 'మిమీ'లో నటనకు జాతీయ అవార్డు గెలుచుకుంది. గత ఏడాది భారీ బడ్జెట్ చిత్రం 'ఆదిపురుష్'తో కృతి పేరు మరోసారి దేశమంతా మారుమోగింది. పదేళ్లలో దాదాపు పాతిక సినిమాలు చేసిందంటే ఆమె నటిగా ఎంత బిజీగా ఉందో వేరే చెప్పక్కర్లేదు. 2019లో ఏకంగా ఆరు చిత్రాల్లో నటించిన కృతి... ఎంచుకున్న పాత్రలో మెప్పించడానికి ఎంతటి కష్టాన్నయినా భరించడానికి సిద్ధంగా ఉంటుంది. 'మిమీ' కోసం పదిహేను కిలోల బరువు పెరిగిన ఆమె... దాన్ని తగ్గించుకోవడానికి అంతకు మించి శ్రమించింది.

కృతి సనన్‌కు అభిమానుల జాబితా కూడా అదే స్థాయిలో ఉంటుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెను 5.6 కోట్ల మంది ఫాలో అవుతున్నారు. ఇతర సామాజిక మాధ్యమాల్లో అభిమానులు దీనికి రెండింతలు ఉంటుంది. ఇక కోకాకోలా, టైటాన్, టిస్సాట్ తదితర బడా బ్రాండ్లకు ప్రచారకర్తగా వ్యవహరిస్తోంది. డబ్బు సంపాదనే ధ్యేయం కాకుండా... సామాజిక సేవలో కూడా కృతి ముందుంటుంది. కరోనా సమయంలో ఆపన్నుల కోసం ప్రభుత్వానికి విరాళాలు ఇచ్చింది. కైలాష్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ కోసం నిధులు సేకరించింది. సినీ పరిశ్రమలో బంధుప్రీతినీ, పురుషాధిక్యతను ప్రశ్నించిన ఆమె... రెమ్యూనరేషన్ విషయంలో కథానాయికల పట్ల వివక్ష చూపడాన్ని నిలదీసింది. వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకుల హృదయాల్లో చోటు సంపాదించుకున్న ఈ అందాల నటి ఎప్పుడూ తనను తాను ఫిట్‌గా ఉంచుకోవడానికి అధిక ప్రాధాన్యం ఇస్తుంది. ఎందుకంటే ఆరోగ్యమే మహాభాగ్యం కదా.

వర్కవుట్ ఇలా...

కృతి వర్కవుట్స్‌లో పిలేట్స్ నుంచి యోగా వరకు అన్ని రకాల వ్యాయామాలూ ఉంటాయి. షూటింగ్‌ల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు జిమ్ అందుబాటులో లేకపోతే... ఇండోర్ ఎక్సర్‌సైజ్‌లతో ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటుంది. 'శారీరక దారుఢ్యం ఉంటే... ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటాం. ఇవన్నీ ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి. ఫిట్‌గా ఉన్నామంటే దానర్థం... శరీరం మంచి రోగనిరోధకశక్తితో, బలంగా ఉన్నట్టు. నేను వెళ్లినచోట ఒకవేళ జిమ్ లేకపోతే రన్నింగ్, యోగా చేస్తాను. అంతేకానీ ఏదో కారణం దొరికింది కదా అని వర్కవుట్స్ మానేయను' అని ఓ సందర్భంలో చెప్పుకొచ్చింది కృతి. ఆమెకు డ్యాన్స్ అంటే ప్రాణం. అందుకే నాట్యాన్ని వ్యాయామంలో భాగం చేసింది. 'నేను కథక్ నేర్చుకున్నాను. డ్యాన్స్ అద్భుతమైన వ్యాయామం' అంటుంది తను.

- ఉదయం లేవగానే రన్నింగ్, సైక్లింగ్ లేదా స్విమ్మింగ్‌తో 45 నిమిషాల కార్డియో సెషన్. ఇది అదనపు కేలరీలు కరిగించడానికి దోహదపడుతుంది.



- వెయిట్‌లిఫ్టింగ్, బాడీవెయిట్ వ్యాయామాలతో కూడిన స్ట్రెంత్ ట్రైనింగ్. ఒక్కో రోజు ఒక్కో మజిల్ గ్రూప్స్ మీద వర్కవుట్స్ ఉంటాయి.
- శరీరం ఫ్లెక్సిబుల్‌గా, బ్యాలెన్స్‌డ్‌గా ఉండడానికి యోగా.
- యోగా తరువాత ధ్యానం. దీనివల్ల మానసిక ప్రశాంతత, ఏకాగ్రత కుదురుతాయి. ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుంది.
- వారంలో రెండు రోజులు వ్యాయామాలకు అదనంగా డ్యాన్స్

'మీ శరీరాన్ని మీరు జాగ్రత్తగా చూసుకొంటే... అది మిమ్మల్ని జాగ్రత్తగా చూసుకొంటుంది' అంటున్న కృతి బద్ధకం వదిలి రోజులో ఎంతోకొంత సమయాన్ని వ్యాయామాలకు కేటాయించాలని అభిమానులకు పిలుపునిస్తోంది.

ఇదీ మెనూ...

పోషకాలున్న సమతుల ఆహారానికి కృతి ప్రాధాన్యం ఇస్తుంది. ప్రాసెస్‌డ్, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంటుంది. ఆమె డైట్‌లో తాజా పండ్లు, కూరగాయలు, తక్కువ స్థాయిలో మాంసకృత్తులు ఉంటాయి.

- బ్రేక్‌ఫాస్ట్‌లో ఓట్స్, గుడ్లు, పండ్లు.
- మధ్యాహ్న భోజనంలో బ్రౌన్ రైస్, ఉడకబెట్టిన కూరగాయ ముక్కలతో గ్రిల్డ్ చికెన్ లేదా ఫిష్.
- రాత్రి భోజనంలో సూప్స్, సలాడ్స్ లేదా గ్రిల్డ్ వెజిటబుల్స్‌తో తేలికపాటి ఆహారం.
- వీటికి మధ్యలో ప్రతి రెండు గంటలకు ఖర్జూరా లేదా మరేదైనా డ్రైఫ్రూట్. ఖర్జూరా శరీరానికి తక్షణ శక్తినిస్తుంది.
- శరీరం డీహైడ్రేట్ కాకుండా కాపాడుకోవడానికి కృతి రోజంతా విరివిగా నీళ్లు తాగుతుంది.



భిన్నాభిప్రాయాన్ని సహించలేని అసహనానికి, నచ్చని వారిని వేధించే క్రూరమైన మనస్తత్వానికి పరాకాష్ట ట్రోలింగ్. అంతర్జాలం వేదికగా సాగే ఈ వికృత క్రీడకు అత్యధికంగా బాధితులు మహిళలే! స్వతంత్రమైన ఆలోచనలు కలిగిన మహిళల స్వాభిమానాన్ని దెబ్బతీయడమే ట్రోలర్ల ప్రధాన లక్ష్యం. నిలదీసే వ్యక్తులకు వారి వ్యక్తిత్వమే సర్వస్వం కనుక... లోకం దృష్టిలో వారిని లోకువ చేయడానికి అంతర్జాల జులాయిలు అల్లే కట్టుకథలకు, బూతు రాతలకు హద్దే లేదు. అలా నిత్యం విద్వేష దుర్భాషలను భరిస్తున్న కొందరు పోరాట స్త్రీల అనుభవ కథనాలతో 'ట్రోల్' పుస్తకాన్ని 'ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక', 'మలుపు బుక్స్' కలిసి తీసుకొచ్చాయి. తద్వారా వారి మానసిక వ్యథను అక్షరబద్ధం చేశారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఆలోచనలు కలిగిన మహిళలపై సామాజిక మాధ్యమాలే అస్త్రంగా అనాగరిక ధోరణుల గుంపు సాగిస్తోన్న అమానవీయ కాండపై 'నవ్య' కథనం.

ట్రోలింగ్... విద్వేషాల వికృత క్రీడ

సత్యాన్ని నిట్టనిలువునా మట్టుబెట్టగల అత్యంత శక్తిమంతమైన ఆయుధం ట్రోలింగ్. ప్రశ్నించే గొంతులను అడ్డంగా కోసేయడమే దాని లక్ష్యం. ఇది ఇటీవలి ధోరణి కాదు. తరతరాల చరిత్ర దీని సొంతం. భిన్నాభిప్రాయాన్ని భరించలేని తనంతో ద్వేషం వెళ్ళగక్కడం దీని స్వభావం. ఇదివరకు కూడా ఇతరులను వేధించడం, బాధించడం, వ్యక్తిత్వ హననం లాంటివి గోడ పత్రికలు, కరపత్రాలు, వెకిలి రాతలతో దుష్ప్రచారం చేయడం లాంటి అనేక రూపాల్లో కొనసాగింది. అంతర్జాలం వచ్చాక అది మరింత వ్యవస్థీకృతమైందంటారు నిపుణులు. కశ్మీర్‌లో బుర్హాన్ వనీ మరణానంతరం అక్కడి పరిణామాలు, పరిస్థితుల మీద కథనాలు రాసినందుకుగాను విపరీతమైన ట్రోలింగ్‌కు గురయ్యారు ప్రముఖ పాత్రికేయురాలు స్వాతి చతుర్వేది. ఈ క్రమంలో ట్రోల్‌కు సంబంధించిన అనేక విషయాలను ఆమె 'ఐ యామ్ ఎ ట్రోల్' పుస్తకం ద్వారా వెలుగులోకి తెచ్చారు. ఆ పుస్తకాన్ని 'నేనొక అంతర్జాల పోకిరిని' పేరుతో సత్యరంజన్ తెలుగులోకి అనువదించారు. కశ్మీరులోని వాస్తవ పరిస్థితులపై వార్తాకథనాలుగా వెలువరించినందుకు... లుటెన్‌సిన్‌సైడర్ ఖాతా ద్వారా తాను సామాజిక మాధ్యమాల ద్వారా ఎదుర్కొన్న అసభ్యమైన, విద్వేషపూరితమైన వేధింపులను, దుష్ప్రచారాలను స్వాతి ఆ పుస్తకం ద్వారా వెల్లడించారు. రాజకీయపార్టీ అండదండలతో ట్రోలర్లు ఎలా వ్యవస్థీకృతంగా పనిచేస్తారో కూడా ఆమె తన పరిశోధన ద్వారా వెలుగులోకి తెచ్చారు. ప్రముఖ జర్నలిస్ట్ రానా అయూబ్ కూడా దాదాపుగా అంతే తీవ్రమైన వేధింపులు ఎదుర్కొన్నారు.

ఆ నమ్మకాన్ని దెబ్బకొట్టాలి

తెలుగులోనూ ట్రోల్ బాధితురాళ్ళ అనుభవాలు భిన్నమేమీ కాదు. సత్యం పక్షాన నిలిచినందుకు కొందరు, సంప్రదాయాలపట్ల సొంత అభిప్రాయాలను వ్యక్తం చేసినందుకు మరికొందరు, రాజకీయ నిరసన తెలిపినందుకు ఇంకొందరు ఎంతో మానసిక క్షోభను అనుభవించాల్సివస్తోంది. "ఈ కాలం అమ్మాయిలు 'నమ్మకం-మోసం' అనే చట్రం నుంచి బయటికివచ్చి తెలివిగా వ్యవహరించాలి, ముఖ్యంగా శారీరక సంబంధాల విషయంలో జాగరూకత పాటించాలి" అని ఫేస్‌బుక్‌లో పోస్టు రాసినందుకు తనపై విపరీతమైన ట్రోలింగ్ జరిగిందని చెబుతున్నారు జర్నలిస్టు ఆలమూరు సౌమ్య. "నా మీద బూతులతో దాడి చేశారు. ఆడవాళ్ళపై దాడి అనగానే బూతుల్లోకి దిగిపోతారు. అదే ట్రోలర్ల ఆయుధం. మహిళల శీలంపై దుష్ప్రచారాన్ని అస్త్రంగా చేసుకొని వాడటం అనాదిగా వస్తున్న ఆచారం. బూతులతో దాడికి దిగగానే మహిళలు ముడుచుకుపోతారన్నది వాళ్ళ నమ్మకం. ఆ నమ్మకాన్ని దెబ్బకొట్టాలి. 'నీ బూతులు నాకు అంటవు. నువ్వు పెట్టిన నియమాలు నాకు చెల్లవు' అని ఢంకా బజాయించి చెప్పాలి" అంటారు సౌమ్య.

అలాంటివి ఎందుకు రాశావన్నారు?

కరోనా సమయంలో 'సైన్సుమాత్రమే నమ్మండి. సనాతన ధర్మాన్ని పారద్రోలండి' నినాదాన్ని సోషల్‌మీడియాలో షేర్ చేసినందుకు... ఒక్కపూటలోనే 840కు పైగా కామెంట్లతో దుర్భాషలాడుతూ తనపై దాడి చేసినట్టు మహబూబ్‌నగర్‌కు చెందిన కాగుల శ్రీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి సమయంలో బయటనుంచి తనకు మద్దతు పెద్దగా లభించలేదంటారామె. "అలాంటివి ఎందుకు రాయాలి. ముక్కుమొఖం తెలియనివారితో తిట్లు తినాలా" లాంటి మాటలు ఎదురయ్యాయన్నారు. అయితే, ఆ సమయంలో తన భర్త, పిల్లలు అండగా నిలిచి ధైర్యం చెప్పారన్నారు.

> **ప్రత్యామ్నాయ ప్రజాసంస్కృతి...**
>
> "ట్రోల్‌కు గురైనవాళ్లు కూడా తమ భావజాలానికి అటో ఇటో కాస్త జరిగారనో, వ్యతిరేకించారనో ఇతరులను ట్రోల్ చేయడం, సామాజిక మాధ్యమాలలో వేధింపులకు గురవుతున్న ప్రగతిశీలురు - తాము మనువాద మత రాజకీయాలను వ్యతిరేకించేప్పుడు కూడా ట్రోల్ భాషనే ఆశ్రయించడం ఇప్పటి వాస్తవమే కావచ్చు. కానీ అది కొనసాగించవలసిన సంప్రదాయం మాత్రం కాదు. అభిప్రాయాల మీద చర్చ ఎప్పుడూ కోరదగినదే. కానీ అభిప్రాయాలను వ్యక్తం చేసిన వ్యక్తులను ఎద్దేవా చేసి మానసికంగా, నైతికంగా గాయపరచడం వలన ప్రత్యామ్నాయ ప్రజాసంస్కృతిని అభివృద్ధి పరచగలుగుతున్నామా అని ఆత్మ విమర్శ చేసుకోవలసిన సందర్భం ఇది."
>
> - 'ట్రోల్' పుస్తకం నుంచి

ట్రోలర్లను నియంత్రించే విధానం అవసరం...

సీఏఏ, ఎన్ఆర్సీలకు వ్యతిరేకంగా షాహీన్‌బాగ్ ఉద్యమంలో పాల్గొన్న ఖలీదా పర్వీన్ ఫొటోను బుల్లీబాయ్ యాప్‌లో ఉంచిన సంగతి వెలుగులోకి వచ్చింది. 'సుల్లీడీల్స్' యాప్‌లోనూ కొంత మంది మహిళల గురించి అశ్లీలంగా రాయడం, వారి ఫొటోలు ఆన్‌లైన్‌లో పెట్టి ట్రోల్ చేసిన విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పెద్దగా స్పందన రాలేదని ఖలీదా పర్వీన్ చెబుతున్నారు. "ఒక్కోసారి అనిపిస్తుంది ఆ ట్రోలర్స్‌ను ప్రభుత్వమే పెంచి, పోషిస్తోందని. ప్రభుత్వం పూనుకుంటే కానీ ఈ ట్రోలింగ్ ఆగదు. సైబర్ క్రైమ్ విభాగాన్ని పటిష్టం చేయాలి. ట్రోలర్లను నియంత్రించే విధానాన్ని కనిపెట్టాలి" అని ఖలీదా డిమాండ్ చేస్తున్నారు. సామాజిక ఉద్యమకారులు సజయ, సంధ్య, దేవి... దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌కు వ్యతిరేకంగా పోరాడినందుకు, కశ్మీర్‌లో చిన్నారి ఆసిఫా అత్యాచారాన్ని వ్యతిరేకిస్తూ మాట్లాడినందుకు తాము హత్యాచారం బెదిరింపులనూ ఎదుర్కొన్నట్టు వివరించారు. సామాజిక మాధ్యమాల వేదికగా వారిని దుర్భాషలాడుతూ రాయడానికి వీల్లేని పదాలతో తిట్టారని తెలిపారు. స్త్రీల మతస్వేచ్ఛ గురించి రాసినందుకు తాను కూడా అలాంటి బెదిరింపులను, బూతుల దాడిని ఎదుర్కొన్నట్టు కవయిత్రి మెర్సీ మార్గరేట్ చెబుతున్నారు.

'వ్యభిచారిణి' అంటూ ప్రచారం...

కరోనా బాధితులకు హెల్ప్‌లైన్ నిర్వహిస్తున్న క్రమంలో... ఒక కాలర్ దురుద్దేశంతో మాట్లాడటాన్ని గమనించి, వారించినందుకు తాను ట్రోలింగ్‌కు లోనైనట్లు సామాజిక కార్యకర్త దీప్తి చెబుతున్నారు. ఆ పోకిరీ తన నెంబరును కొన్ని వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేసి వ్యభిచారిణిగా ప్రచారం చేయడంతో... తెలియని నెంబర్ల నుంచి వేధింపులు ఎదురయ్యాయని ఆమె తెలిపారు. "పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆకతాయి ఆచూకి తెలిసింది. నా నెంబరు షేర్ అయిన గ్రూపులను మూసేయించారు. దాంతో వేధింపులు ఆగాయి. ట్రాన్స్ వ్యక్తులు ఎక్కువ ట్రోల్‌కు లోనవడం చూస్తుంటాం. కొన్నాళ్ళ కిందట ఉజ్జయినికి చెందిన 16ఏళ్ళ ప్రాన్సు సోషల్ మీడియాలో తన లైంగికతను ప్రకటించినందుకు ట్రోలింగ్‌కు గురయ్యాడు,ఆత్మహత్య చేసుకొన్నాడు" అని దీప్తి ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా ప్రజాక్షేత్రంలో అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడుతూనో, సత్యం పక్షాన నిలిచి రాస్తున్న... సూరేపల్లి సుజాత, స్వాతి వడ్లమూడి, అరుణ గోగులమండ, కొండవీటి సత్యవతి, సి. వనజ, తులసి చందు, కె.ఎన్. మల్లీశ్వరి లాంటివారు తమ ట్రోలింగ్ అనుభవాలను రాశారు. అయితే, వీరంతా ట్రోలింగ్‌కు ఎదురీది మరీ పోరాడుతున్నారు. ప్రజాస్వామ్య హక్కుల కోసం నినదిస్తున్నారు. ట్రోలింగ్ లాంటి అమానవీయ సంస్కృతిని నిలువరించడానికి తమవంతు గళం విప్పుతున్నారు.

> **మనలోనూ ఓ ట్రోలర్...**
>
> 
>
> ట్రోలింగ్ అనేది సమకాలీన సమస్య. చాలాసార్లు ట్రోల్స్ ప్రత్యేక వ్యక్తిని లక్ష్యంగా చేసుకొని జరిగేవే అయినా అవి వ్యక్తిగతం కాదు. ప్రశ్నించే గొంతును ఒంటరి చేసి, న్యూనపరిచి నిష్క్రమించేలా చేయడమే వాటి లక్ష్యం. ట్రోల్స్ వెనక ఉన్న పితృస్వామిక, కుల, మత, ఆర్థిక, అధికార రాజకీయాలను గురించిన చర్చను ప్రారంభించాలన్న ఆలోచనతో... ట్రోల్‌కు గురైన మహిళల అనుభవ కథనాలను ఒక పుస్తకంగా తీసుకువచ్చాం. తెలుగు సమాజంలో ట్రోల్ అవుతున్న వాళ్లలో చాలామంది మాకు తెలిసిన వాళ్లు, స్నేహితులు అయినప్పటికి జాబితా సిద్ధం చేయడానికి కొంత కసరత్తు అవసరమైంది. ఆ క్రమంలో కొంతమందిని అనుభవాలు రాసిమ్మని అడిగాం. ఇద్దరు ముగ్గురు వ్యక్తిగత కారణాలతో కాదన్నారు. అత్యంత తీవ్రంగాట్రోలింగ్‌కు గురవుతున్నవారిలో ట్రాన్స్ మహిళలు కూడా ఉన్నారు. వారి అనుభవాలను ఇందులో విశితం చేయలేకపోయామన్న వెలితి ఉంది. లెఫ్ట్‌వింగ్ వ్యక్తులు కూడా కొన్ని సందర్భాలలో రైట్ వింగ్ అనుసరిస్తున్న పద్ధతిలోనే వ్యక్తిత్వ హననానికి పాల్పడటం చూస్తున్నాం. ఎవరైనా ప్రజాస్వామ్య పరిధి దాటి విమర్శించడం సరికాదు. మనలోనూ ఒక ట్రోలర్ ఉంటాడన్న సంగతి మరవకూడదు. విమర్శ, ట్రోలింగ్ వేర్వేరు అనే స్పృహతో ఉండాలి. విమర్శను విచక్షణతో సమాజం ముందు ఉంచాలి. లేకుంటే ట్రోలర్లుకు మనకు తేడా లేకుండా పోతుందని మరువకూడదు.
>
> - కేఎన్ మల్లీశ్వరి, ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి, ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక

> **బాధిత స్త్రీలకు మద్దతుగా గొంతునిస్తూ...**
>
> 
>
> సామాజిక మాధ్యమాల్లో ట్రోలింగ్ సహజమేమో అన్నంతగా పాతుకుపోయింది. సామాజిక మత, రాజకీయ అంశాలపై పనిచేసేవారు కూడా దీనికి మినహాయింపు కాదు. ఉద్యమకారులు, రచయితలు, జర్నలిస్టులు మొదలైన వారిపై గురిపెట్టి అశ్లీల, అసభ్యపదజాలంతో వ్యక్తిత్వ హననం లక్ష్యంగా బెదిరింపులతో దాడులు చేయడం చూస్తున్నాం. ఆధునిక సమాజంలో స్త్రీల ద్వారా జరుగుతున్న మతవ్యాప్తి గురించి హెచ్చరికతో వ్యాసం రాసినందుకు మాలో ఒకరు అలా ట్రోలింగ్‌కు గురైన సందర్భం- దీని గురించి ఆలోచించవలసిన, పనిచేయవలసిన అవసరాన్ని మరింత గుర్తు చేసింది. సమకాలీన సామాజిక, రాజకీయ అంశాల మీద పనిచేస్తున్న అనేక మంది మిత్రులు తరచుగా ట్రోలింగ్‌కు బెదిరింపులకు గురవడం రచయితలుగా మమ్మల్ని కలవరపెట్టింది. వారికి మద్దతుగా 15మంది స్త్రీల అనుభవ కథనాలతో పుస్తకం తీసుకొచ్చాం. దీన్ని 'మలుపు' ప్రచురణల సహకారంతో ప్రచురించాం. ఈ పుస్తకంలోని స్త్రీలు మతతత్వానికి ఎదురుగా నిలబడి 'లౌకికత సంగతి ఏమిట' న్నారు. 'స్త్రీల శరీరాలపై స్త్రీలకే హక్కు లేదా?' అన్నారు. 'మైనార్టీలు కూడా మనుషులే, వారికి హక్కులుంటాయ'న్నారు. 'కొన్ని కులాలకు ఆధిక్యం ఎందుకు?' అని నిలదీశారు. అందుకుగాను తీవ్రమైన ట్రోలింగ్‌కు గురయ్యారు. బాధ, దుఃఖం, ఆగ్రహానికి గురవుతూ కూడా తాము నమ్మిన విలువలు, విశ్వాసాల వ్యాప్తి కోసం నిలిచిపోరాడుతున్న స్త్రీలతో సంభాషణకు తలుపులు తీస్తుంది 'ట్రోల్' పుస్తకం. ఏక మతరాజ్య స్థాపన కోసం భిన్నాభిప్రాయాలను బుల్డోజ్ చేసుకుపోతున్న వర్తమాన అధికార రాజకీయాల అంధకారంలో ఆశను వాగ్దానం చేస్తుందీ పుస్తకం.
>
> - ప్రొఫెసర్ కాత్యాయనీ విద్మహే, తెలంగాణ కార్యదర్శి, ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక

నవ్య | చిత్రజ్యోతి

ఆపరేషన్... సక్సెస్ బాధ్యత మనదే



చిరంజీవి

"రొమాంటిక్, యాక్షన్ సినిమాలు ఎన్నో వస్తుంటాయి, చూస్తుంటాం. కానీ 'ఆపరేషన్ వాలెంటైన్' లాంటి సినిమాలను ప్రేక్షకులు తప్పకుండా చూడాలి. సైన్యానికి నివాళిగా ఈ సినిమాను హిట్ చేయాల్సిన బాధ్యత మనందరిదీ' అని చిరంజీవి అన్నారు. వరుణ్‌తేజ్ కథానాయకుడిగా శక్తి ప్రతాప్ సింగ్ దర్శకత్వం వహించిన చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. మానుషి చిల్లర్ కథానాయిక. సందీప్ ముద్దా నిర్మాత. మార్చి 1న విడుదలవుతోంది. ఆదివారం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ "టాప్‌గన్ తరహాలో అద్భుతమైన విజువల్స్‌తో మనం కూడా సినిమా తీయగలమని ఈ చిత్రంతో నిరూపించాం. వినోదం కోసం కాదు రియల్ హీరోస్ గురించి తెలుసుకోవడానికి ఈ సినిమా చూడాలి. తక్కువ బడ్జెట్‌తోనూ మంచి క్వాలిటీతో సినిమాలు ఎలా తీయాలో శక్తి నుంచి తెలుగు పరిశ్రమ నేర్చుకోవాలి. నా బిడ్డ వరుణ్‌తేజ్ నన్ను ఎప్పుడూ ఫాలో అవ్వలేదు. డిఫరెంట్ జానర్స్‌లో సినిమాలు చేసుకుంటూ హీరోగా ఎదిగాడు. ఎయిర్‌ఫోర్స్‌పై తెలుగులో ఇదే తొలి చిత్రం. ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. వరుణ్‌తేజ్ మాట్లాడుతూ 'సరిహద్దుల్లో సైనికుల త్యాగాలను చూపించాలని ఈ సినిమా తీశాం. మాకున్న బడ్జెట్‌లో చెమటోడ్చి ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. జవాన్లకు సెల్యూట్ చేసేలా మా సినిమా ఉంటుంది' అన్నారు. శక్తిప్రతాప్‌సింగ్ మాట్లాడుతూ 'వరుణ్‌తేజ్‌లో యంగ్ చిరంజీవిగారిని చూశాను. ఈ సినిమాకు ఆయన నటన ప్రత్యేకాకర్షణ' అన్నారు. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇచ్చే చిత్రమిదని నిర్మాత సందీప్ ముద్దా తెలిపారు.

టీడీపీ, జనసేనకు ఓటేసి సత్తా చూపండి

- మెగా అభిమానులకు నాగేంద్రబాబు పిలుపు

'సైనికుల్లా తుపాకులకు ఎదురెళ్లాల్సిన అవసరం లేదు. జనసేన, టీడీపీ కూటమికి మీ ఓటు గుద్దండి. ఈ ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికల్లో మీ సత్తా చూపించండి' అని ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మెగా అభిమానులకు నాగేంద్రబాబు పిలుపునిచ్చారు. ఆయన ప్రసంగానికి సిద్ధమవగానే వేదిక ముందున్న అభిమానుల అరుపులతో ఆ ప్రాంగణం మార్మోగింది. వారిని మరింత ఉత్సాహపరుస్తూ నాగబాబు ప్రసంగించారు. 'పవన్ కల్యాణ్ అభిమానుల్లారా... మీ అరుపులతో కొంతమంది గుండెల్లో రైళ్లు పరుగెట్టాలి. బాగా అరవండి' అని కోరారు. ప్రయత్నం చేస్తే ఏదో ఒక రోజు విజయం వరిస్తుంది అనే సూక్తిని పవన్ కల్యాణ్ త్వరలోనే నిరూపిస్తాడు అని నాగేంద్రబాబు చెప్పారు.

పవర్ తర్వాత లవర్



నాని హీరోగా డీవీవీ ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్‌పై 'సరిపోదా శనివారం' చిత్రం నిర్మాణంలో ఉన్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఇదే బేనర్‌లో నాని మరో చిత్రం చేయబోతున్నారు. ప్రస్తుతం పవన్ కల్యాణ్‌తో 'ఓజీ' తెరకెక్కిస్తున్న సుజీత్ నాని కొత్త చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. 'ఇది సుజీత్ సినిమా. పవర్ తర్వాత లవర్ వస్తాడు' అని నాని సోషల్ మీడియాలో స్పందించారు. 'నాని 32' వర్కింగ్ టైటిల్. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.

సీనియర్ నిర్మాత వి.మహేశ్ కన్నుమూత



సీనియర్ నిర్మాత, సినీ రచయిత, హైదరాబాద్‌లోని ఫిల్మ్ నగర్ హౌసింగ్ సొసైటీ కమిటీ సభ్యుడు వి. మహేశ్(85) శనివారం రాత్రి చెన్నైలో గుండెపోటుతో మరణించారు. ఇంట్లోని బాత్రూమ్‌లో జారిపడటంతో ఆయనను హుటాహుటిన సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్ళగా, అప్పటికే ఆయన మృతి చెందినట్టు వైద్యులు ప్రకటించారు. 1975లో చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టిన ఆయన.. దాసరి నారాయణ రావు దర్శకత్వంలో ఏఎన్నార్ హీరోగా 'మనుషులంతా ఒక్కటే' అనే చిత్రాన్ని 1976లో నిర్మించారు. ఆ తర్వాత 'మహాపురుషుడు', 'సింహపురి సింహం', 'ముసుగుదొంగ' వంటి పలు చిత్రాలను నిర్మించారు. 'మనుషులంతా ఒక్కటే' చిత్రానికిగాను ఉత్తమ రచయితగా వి. మహేశ్ నంది అవార్డును అందుకున్నారు. తన అన్నయ్య వి.వి.రాజేంద్రకుమార్‌తో కలిసి చిత్రాలకు ప్రచార సామాగ్రిని తయారు చేసే సంస్థ స్టూడియో రూప్ కళను ప్రారంభించారు. ఆదిత్య చిత్ర పేరుతో నిర్మాణ సంస్థను నెలకొల్పారు. అలాగే, శ్రీ వేంకటేశ్వర భక్తి చానెల్‌లో ప్రసారమైన 'హరి భక్తుల కథలు' అనే ధారావాహికకు నిర్మాత, రచయిత ఆయనే. అవివాహితుడైన మహేశ్ స్వస్థలం నెల్లూరు జిల్లా కొరుటూరు. పలువురు సినీ ప్రముఖులు మహేశ్ మృతి పట్ల తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

క్లైమాక్స్ గురించి చెప్పొద్దు



బాల నటుడు దీపక్ సరోజ్ హీరోగా అరంగేట్రం చేసిన 'సిద్ధార్థ్ రాయ్' చిత్రం ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోందని చిత్రబృందం సంతోషం వెలిబుచ్చింది. ఆదివారం నిర్వహించిన సక్సెస్‌మీట్‌లో దీపక్ సరోజ్ మాట్లాడుతూ 'అన్ని ఏరియాల్లో 'సిద్ధార్థ్‌రాయ్'కు చక్కటి ఆదరణ లభిస్తోంది. ఇప్పటికే సినిమా చూసిన ప్రేక్షకులు చూడనివాళ్లకు ఓపెనింగ్, క్లైమాక్స్ గురించి చెప్పవద్దు' అని కోరారు. మా సినిమాకు యువత నుంచి మంచి ఆదరణ లభిస్తోంది అని దర్శకుడు వీ యశస్వి తెలిపారు.

మరొకరితో చేసేవాణ్ణి కాను

- టీజీ కీర్తికుమార్



'నేను వెన్నెల కిశోర్ అభిమానిని. ఆయన కోసమే 'చారి 111' చిత్రం కథ రాసుకున్నాను. ఆయన కాదంటే మరొకరితో ఈ సినిమా చేసేవాణ్ణి కాదు' అని దర్శకుడు టీజీ కీర్తి కుమార్ చెప్పారు. ఈ చిత్రం మార్చి 1న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా కీర్తి కుమార్ 'చారి 111' విశేషాలను మీడియాతో పంచుకున్నారు. 'నా తొలి చిత్రం 'మళ్లీ మొదలైంది'లో వెన్నెల కిశోర్ నటించారు. అప్పుడే ఆయనకు 'చారి 111' స్క్రిప్టు చెప్పా. ఆయనకు నచ్చింది. ఇదొక స్పై యాక్షన్ కామెడీ ఫిల్మ్. ఇందులో విలన్ ఎవరనేది ఆసక్తికరంగా ఉంటుంది. ఈ సినిమాకు సీక్వెల్ ప్లాన్ కూడా ఉంది' అని చెప్పారు.

అబ్బాయిలే పుడుతున్నారు!



హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అబ్బాయే కావాలనే ఆలోచనో..? ఆడ పిల్లంటే చులకనో..? రాష్ట్రంలో లింగ నిష్పత్తి వ్యత్యాసం ఆందోళనకర స్థాయికి చేరుతోంది. దీనికి యథేచ్ఛగా లింగ నిర్ధారణ పరీక్షలు కారణమనే ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఈ- బర్త్ పోర్టల్ గణాంకాల ప్రకారం జనవరిలో జన్మించినవారిలో 52% మగపిల్లలే ఉన్నారు. గత నెలలో రాష్ట్రవ్యాప్తంగా 9,986 జననాలు రికార్డయ్యాయి. ఇందులో 5,181 మంది అబ్బాయిలు కాగా, 4,805 మంది అమ్మాయిలు. ఇంతటి వ్యత్యాసం ప్రమాదకరమని సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మగపిల్లల సంఖ్య పెరుగుతుండగా, ఆడ పిల్లల సంఖ్య తగ్గుతోందని, ప్రస్తుతం రాష్ట్రంలో వెయ్యిమంది అబ్బాయిలకు 988 మంది అమ్మాయిలున్నారని పేర్కొంటున్నారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం గణాంకాల ప్రకా రం బాలల లింగ నిష్పత్తి (చైల్డ్ సెక్స్ రేషియో) 1000:932గా ఉంది. కాగా, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి వెయ్యి మంది పురుషులకు 999 మంది స్త్రీలుండగా, పట్టణ ప్రాంతాల్లో 970 మంది ఉన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఈ-బర్త్ పోర్టల్ జనవరి గణాంకాల మేరకు 78% జిల్లాల్లో అబ్బాయిలే ఎక్కువగా జన్మించారు. ఇందులో ములుగు వినహా 32 జిల్లాల గణాంకాలను అప్‌లోడ్ చేశారు. రాష్ట్రంలోనే అత్యధికంగా పెద్దపల్లి జిల్లాల్లో అబ్బాయిల బర్త్ రేటు ఎక్కువగా ఉంది. అక్కడ 69% మంది మగ పిల్లలు పుట్టినట్లు లెక్కలు చెబుతున్నాయి. మహబూబాబాద్ జిల్లా(60) ఆ తర్వాత స్థానంలో ఉంది. నల్లగొండ (56%), సూర్యాపేట (55%), ఆదిలాబాద్, హైదరాబాద్, మేడ్చల్ (54%), ఖమ్మం, మంచిర్యాల (53%) జిల్లాల్లోనూ అబ్బాయిల జననాలు సగంపైగా ఉన్నాయి. కాగా, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి జిల్లాల్లో మగపిల్లల కంటే ఆడ పిల్లలే ఎక్కువగా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

ఈ ఏడు జిల్లాల్లో మహాలక్ష్ములదే పైచేయి

రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లోనే ఆడపిల్లల జననాల శాతం ఎక్కువగా ఉంది. అవి.. జయశంకర్ భూపాలపల్లి (62%), నిర్మల్ (54.28%), వికారాబాద్ (53%), కొమరంభీం ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం (52%), జగిత్యాల (51%), రాజన్న సిరిసిల్ల (51.55%), వీటన్నిటిలోనూ ఆడపిల్లల జననాలు 50 శాతానికిపైగా ఉండడం విశేషం. నిజానికి ఈ ఏడింటిలో నాలుగు ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న జిల్లాలు. అయినప్పటికీ ఆడపిల్ల జననాలు ఎక్కువగా ఉండానికి.. ప్రైవేటు ఆస్పత్రులు తక్కువగా ఉండడం ఓ కారణమై ఉండొచ్చని వైద్యవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మిగతా జిల్లాల్లో ప్రైవేటు ఆస్పత్రులు ఎక్కువగా ఉండడంతో పాటు, యథేచ్ఛగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారని.. పుట్టబోయేది ఆడపిల్ల అని తెలిస్తే గర్భ విచ్ఛిత్తికి పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే కొన్ని సామాజిక వర్గాల్లో యువకులకు పెళ్లిళ్లు కావడం లేదని.. ప్రస్తుత చైల్డ్ సెక్స్‌రేషియో వ్యత్యాసం ఇలాగే కొనసాగితే రెండు దశాబ్దాల తర్వాత యువకులకు పెళ్లిళ్లు కావడం కష్టమేనని సామాజిక వేత్తలు హెచ్చరిస్తున్నారు. లింగ నిర్ధారణ పరీక్షలపై కఠినంగా వ్యవహరించాలని వారు ప్రభుత్వానికి సూచిస్తున్నారు.

లోకం తీరు



బకాయిలు @57,399 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

కాలంలో (2014 జూన్ 2 నుంచి 2023 డిసెంబరు దాకా) రూ.28,842 కోట్లు బకాయి పడ్డాయి. ఇక డిస్కమ్‌లకు స్వయంగా ప్రభుత్వమే చెల్లిస్తానని హామీ ఇచ్చిన బకాయిలు రూ.14,928 కోట్లు ఉన్నాయి. అంటే డిస్కమ్‌లకు ప్రభుత్వ శాఖలు/ప్రభుత్వం చెల్లించాల్సిన మొత్తం బాకీలు రూ.43,770 కోట్లు. ఇక నీటిపారుదల శాఖలో కాంట్రాక్టర్లకు/భూనిర్వాసితులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.13,629.18 కోట్లు. ఈ రెండు శాఖల బకాయిలు కలిపితే రూ.57,399 కోట్లు. ఇవి ఏ లెక్కన చూసుకున్నా ఒక ఆర్థిక సంవత్సరంలో ప్రాజెక్టుల నిర్మాణాలకు కేటాయించిన సొమ్ముకంటే ఎక్కువే. ఈ బకాయిలు తీరిస్తే తప్ప విద్యుత్ సంస్థల్లో ఆర్థిక సాధికారతకు, నీటిపారుదల ప్రాజెక్టుల పనుల పురోగతికి అవకాశం లేదు. గత పదేళ్లలో ప్రభుత్వం నీటిపారుదల శాఖ ప్రాజెక్టులపై రూ.1.80 లక్షల కోట్లకు పైగా వెచ్చించింది. ఇందులో రూ.93 వేల కోట్లదాకా కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికే పెట్టింది. అవసరం లేకున్నా కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో రూ.33 వేల కోట్లతో అదనపు టీఎంసీని చేపట్టారని విమర్శలు కూడా వచ్చాయి. రూ.93 వేల కోట్లు వెచ్చించిన కాళేశ్వరంలో ఏకంగా రూ.46 వేల కోట్ల మేర దుర్వినియోగం జరిగిందని ఇటీవలే 'కాగ్' నివేదిక తప్పుపట్టింది. కాగా, డిస్కమ్‌లకు కరెంట్ బిల్లులతో పాటు ఇతర బకాయిలు రూ.43,770 కోట్లుగా కొత్త ప్రభుత్వం గుర్తించింది. 2016-17 నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరం దాకా అంచనా వేసిన దాని కంటే వాస్తవిక వ్యయం (ట్రూ-అప్) రూ.12,550 కోట్లు కాగా.. ఆ మొత్తాన్ని తామే చెల్లిస్తామని గత ప్రభుత్వం ప్రకటించినా చెల్లింపులు చేయలేదని శ్వేతపత్రంలో గుర్తు చేసింది. అంతేకాకుండా ఇంధన సర్దుబాటు చార్జీల రూపంలో కూడా రూ.2,378 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది.



ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయిస్తున్న అధికారులు

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు నేలమట్టం

- ఆంధ్రజ్యోతి కథనంతో కదిలిన యంత్రాంగం
- దాదాపు 30 ప్రికాస్ట్ గదులు, ఫెన్సింగ్ తొలగింపు

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలో రాత్రికి రాత్రే వెలసిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు నేలమట్టం చేశారు. ప్రికాస్ట్‌లతో నిర్మించిన 30 గదులతో పాటు ఫెన్సింగ్‌ను తొలగించారు. హైదరాబాద్ శివారులో కోట్ల రూపాయల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోందని రాత్రికి రాత్రే ప్రికాస్ట్ నిర్మాణాలు వెలుస్తున్నాయని "నీకింత.. నాకింత"లా కబ్జా శీర్షికతో ఆదివారం ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమైన కథనానికి జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న జిల్లా కలెక్టర్ ఈ వ్యవహారంపై పూర్తి విచారణ చేయాలని ఆదేశించారు. దాంతో అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీందర్‌దత్, ఆర్‌ఐ బిక్షపతి ఆదివారం పెద్దఅంబర్‌పేట్‌లోని సర్వే నెంబర్ 64/6, 64/7లోని ప్రభుత్వ భూమిని పరిశీలించారు. మూడు ఎక్స్‌కవేటర్ల సహాయంతో అక్కడ వెలసిన దాదాపు 30 గదులను, ఖాళీ స్థలాలకు వేసిన ఫెన్సింగ్‌లను తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రవీందర్‌దత్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల ఆక్రమణ, కబ్జాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకొని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ భూమికి సంబంధించి గతంలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు కోర్టుకు వెళ్లారని తెలిపారు. కేసు కోర్టు పరిధిలో ఉన్నది చెప్పారు.

నాపై అవమానకర పోస్టులు పెడుతున్నారు

- సైబర్ క్రైం పోలీసులకు వైఎస్ షర్మిల ఫిర్యాదు
- యూట్యూబర్ శ్రీరెడ్డి సహా 10 మందిపై కేసు

హైదరాబాద్, ఫిబ్రవరి 25: ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఫిర్యాదు మేరకు యూట్యూబర్, నటి శ్రీరెడ్డి సహా పది మంది వ్యక్తులపై తెలంగాణ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. కొందరు వ్యక్తులు సామాజిక మాధ్యమాల్లో తనపై అవమానకర పోస్టులు పెడుతున్నారంటూ షర్మిల ఫిర్యాదు చేశారు. యూట్యూబ్‌తో పాటు ఇతర సోషల్ మీడియా వేదికల్లో ఆ వ్యక్తులు అప్‌లోడ్, పోస్టు చేసిన ఈ కంటెంట్ తన గౌరవానికి భంగం కలిగించేలా ఉందని ఆమె పేర్కొన్నారు. తాను ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలైన తర్వాత జిల్లాల పర్యటనలకు వెళుతున్నానని, అయితే తనను, తన అనుచరులను లక్ష్యంగా చేసుకుని కొందరు అవమానకర వ్యాఖ్యలతో దాడి చేస్తున్నారన్నారు. దోషులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో సైబర్ క్రైం పోలీసులు శ్రీరెడ్డి తదితరులపై కేసు నమోదు చేశారు.

ఎన్నికలున్నాయి.. విచారణకు రాలేను

(మొదటి పేజీ తరువాయి)

షెడ్యూల్ ఖరారైందని.. అందుకే సోమవారం విచారణకు హాజరు కాలేనని లేఖలో కవిత పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో.. నోటీసులు రద్దు చేయాలని, లేదంటే ఉపసంహరించుకోవాలని కోరారు. తన నుంచి సీబీఐకి ఏమైనా సమాధానాలు కావాలంటే వర్చువల్‌గా విచారణకు హాజరవుతానంటూ సమాధానమిచ్చారు. 2022 డిసెంబరులో అప్పటి దర్యాప్తు అధికారి సెక్షన్ 160 కింద తనకు నోటీసులు ఇచ్చారని, ప్రస్తుతం ఇచ్చిన సెక్షన్ 41ఏ నోటీసులు దీనికి పూర్తి విరుద్ధంగా ఉన్నాయన్నారు. నోటీసులు జారీ చేసిన సందర్భం కూడా రాజకీయ కోణంలో ఆలోచించే విధంగా ఉందన్నారు. తనకు ఎన్నికల ప్రచార బాధ్యతలు ఉన్నందున.. ఈ సమయంలో ఢిల్లీకి పిలవడం అనేది ఎన్నికల ప్రక్రియలో పాల్గొనకుండా అవరోధం కలిగిస్తుందని, ఇది తన ప్రజాస్వామిక, రాజ్యాంగ హక్కులకు భంగం కలిగిస్తుందని కవిత స్పష్టం చేశారు. గతంలో ఇదే కేసులో ఈడీ తనకు నోటీసులు జారీ చేయగా తాను సుప్రీంకోర్టును ఆశ్రయించానని, ఆ కేసు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున, తనను విచారణకు పిలవబోమని గతంలోనే అదనపు సొలిసిటర్ జనరల్ సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చారని ప్రస్తావించారు. సొలిసిటర్ జనరల్ ఇచ్చిన హామీ సీబీఐకి కూడా వర్తిస్తుందని తెలిపారు. గతంలోనూ సీబీఐ బృందం హైదరాబాద్‌లోని తన నివాసానికి వచ్చినప్పుడు విచారణకు సహకరించానని గుర్తు చేశారు. కానీ, 15 నెలల విరామం తర్వాత ఇప్పుడు తనను విచారణకు పిలవడం, కొత్తగా సెక్షన్లు మార్చడం అనేక అనుమానాలకు తావిస్తుందని లేఖలో కవిత పేర్కొన్నారు.

సీఎంగా రేవంత్‌ను ముందే ప్రకటిస్తే కాంగ్రెస్‌కు

30 కూడా వచ్చేవికావు

మొదటి పేజీ తరువాయి)

కోత విధిస్తున్న విషయం వాస్తవం కాదా? అని నిలదీశారు. రాష్ట్రంలో లక్షా 67 వేల మంది నిరుద్యోగులున్నారని, అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో వారికి ఇస్తామన్న నిరుద్యోగ భృతి ఏమైందని ప్రశ్నించారు. 18 ఏళ్లు నిండిన యువతులు కోటి 24 లక్షల మంది ఉండగా, అభయ హస్తం కింద రూ.2500 జమ చేస్తామన్న అంశం ఏమైందన్నారు. వంద రోజుల్లో 2లక్షల ఉద్యోగాలు ఇస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పటివరకు నోటిఫికేషన్ జారీ చేయకపోగా, కేసీఆర్ హయాంలో ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందించి తమ ఘనతగా చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ ప్రజల హక్కులను ఢిల్లీకి తాకట్టు పెట్టిన ఘనత బీజేపీకి, రేవంత్‌రెడ్డికే దక్కిందని విమర్శించారు. విభజన చట్టం ప్రకారం తెలంగాణలో ఏ ఒక్క ప్రాజెక్టుకూ జాతీయ హోదా కల్పించకుండా మోసగించిన బీజేపీ.. కర్ణాటకలో అప్పర్ భద్ర ప్రాజెక్టుకు ఆ హోదా ఎలా కల్పించిందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పజెప్పిందని ఆరోపించారు.

24 ఏళ్ల తర్వాత సర్వీసింగ్‌కు కారు

కేసీఆర్ నాయకత్వంలో 14 ఏళ్లు ఉద్యమం చేసి తెలంగాణ సాధించి, పదేళ్లు తెలంగాణను అభివృద్ధి చేసిన కారు.. 24 ఏళ్ల తర్వాత సర్వీసింగ్‌కు వచ్చిందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో వంద స్పీడ్‌తో దూసుకెళ్లాలని, సంపూర్ణమైన మెజారిటీతో పార్టీని గెలిపించాలని అన్నారు. 'ఒక్క సంవత్సరం కార్యకర్తలను కాపాడుకోండి.. ఆ తర్వాత వారే అండగా ఉంటారు' అని పార్టీ నాయకులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. పదవులు రాలేదన్న బాధ నాయకుల్లో ఉండొచ్చు కానీ, ప్రజల్లో మాత్రం లేదని తెలిపారు. కేసీఆర్‌ను దూరం చేసుకున్నందుకు అన్ని వర్గాల ప్రజలు బాధపడుతున్నారని పేర్కొన్నారు. తాను నాలుగు రోజులు అమెరికాకు వెళ్తే.. కేటీఆర్ ఇక రాడంటూ ప్రచారం చేశారని మండిపడ్డారు. ప్రజల అభిమానం చూస్తుంటే అంతరిక్షంలోకి వెళ్లినా.. పిలిచిన వెంటనే వచ్చి అండగా ఉండేందుకు సిద్ధంగా ఉంటానన్నారు. ఇటీవల బీఆర్ఎస్ నేతల ఇళ్లపై కాంగ్రెస్ నాయకులు ఇటుకలతో దాడి చేశారని, త్వరలోనే వాళ్లపై రాళ్లతో దాడి చేసే రోజులు వస్తాయని హెచ్చరించారు. కాగా, ఇటీవల దాడికి గురైన న్యూస్‌లైన్ జర్నలిస్టు శంకర్‌కు ఏం జరిగినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే బాధ్యత వహించాలని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. నిజాలు చెప్పే గొంతుకలను మూయించాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తుర్కయాంజాల్‌లో నివాసముండే శంకర్‌ను ఆదివారం రాత్రి మాజీ ఎమ్మెల్యేల మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో కలిసి కేటీఆర్ పరామర్శించారు.



లాస్య నందిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న కేటీఆర్

మారేడుపల్లి: రోడ్డు ప్రమాదంలో రెండు రోజుల క్రితం మృతి చెందిన ఎమ్మెల్యే లాస్య నందిత కుటుంబాన్ని కేటీఆర్ ఆదివారం పరామర్శించారు. లాస్య నందిత తల్లి గీత, తోబుట్టువులు నమ్రత, నివేదితను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు.

నందిత కుటుంబానికి అండగా ఉంటాం

అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రమాదం జరిగిన రోజు తాను విదేశాల్లో ఉండడం వల్ల రాలేకపోయానన్నారు. సాయన్న అకాల మరణంతో వారి కుటుంబానికి తీరని లోటు జరిగిందని, ఇప్పుడు ఆయన కూతురు లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీవ్ర బాధాకరమని అన్నారు. లాస్య నందిత కుటుంబానికి పార్టీ పరంగా తాము అండగా ఉంటామని కేటీఆర్ భరోసా ఇచ్చారు. ఆయన వెంట మాజీ మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, కంటోన్మెంట్ మాజీ బోర్డు మెంబర్లు జక్కుల మహేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

రైల్వే ప్రాజెక్టులకు నేడు మోదీ శ్రీకారం

- 27 రాష్ట్రాల్లో రూ.41వేల కోట్లతో పనులు
- 553 అమృత భారత్ స్టేషన్లకు శంకుస్థాపన
- 22.57 కోట్లతో బేగంపేట స్టేషన్ అభివృద్ధి

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సుమారు రూ.41 వేల కోట్ల వ్యయంతో 27 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో చేపట్టిన రైల్వే మౌలిక సౌకర్యాల కల్పన ప్రాజెక్టులకు సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేయనున్నారు. ప్రధానంగా అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ.19 వేల కోట్లతో దాదాపు 553 రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతారు. రూ.21,520 కోట్లతో చేపట్టిన రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, అండర్‌పాస్‌లకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేయనున్నారు. అమృత్ భారత్ స్టేషన్లను స్థానిక సంస్కృతి, వారసత్వ వైభవం ప్రతిబింబించేలా అభివృద్ధి చేయనున్నారు. రూ.385 కోట్లతో అభివృద్ధి చేసిన ఉత్తరప్రదేశ్‌లోని గోమతి నగర్ రైల్వే స్టేషన్‌ను కూడా ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రూ.22.57 కోట్ల అంచనా వ్యయంతో బేగంపేట రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ సభలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొంటారని రైల్వే అధికారులు తెలిపారు.

ఐఏఎస్‌లకూ జగన్ మార్క్ టోపీ!

రెండేళ్లుగా ఎన్‌పీఎస్ కంట్రిబ్యూషన్ నై.. రిటైర్‌మెంట్ తర్వాత మిగిలేది శూన్యం

- అఖిల భారత సర్వీసు అధికారుల ఆవేదన
- ప్రభుత్వంతో తేల్చుకునేందుకు సిద్ధం
- నేడు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ భేటీ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ అధికారంలోకి వచ్చిన 6 నెలల వరకు ఉద్యోగులు ప్రశాంతంగానే ఉన్నారు. కానీ, ఆ తర్వాత నుంచి తమకిచ్చిన హామీలు, హక్కుల కోసం నేటి వరకు పోరాటం చేస్తూనే ఉన్నారు. ఇలా పోరాటం చేస్తున్న ఉద్యోగులతో ప్రభుత్వం తరపున అఖిల భారత సర్వీసు అధికారులైన ఐఏఎస్‌లే సమావేశాలు, సంప్రదింపులు జరుపుతున్నారు. అయితే, చిత్రంగా జగన్ ప్రభుత్వం ఐఏఎస్‌లకు కూడా కుచ్చు టోపీ పెడుతోంది. గత 25 నెలల నుంచి వీరి ఖాతాలకు చేరాల్సిన ఎన్‌పీఎస్(జాతీయ పింఛను పథకం) కంట్రిబ్యూషన్ సొమ్మును జమ చేయడం లేదు. దీంతో వారు రగిలిపోతున్నారు. అలాగని.. ఈ విషయంపై బయటపడితే పొలిటికల్ బాసుల నిర్దయాలకు బలైపోవాల్సి వస్తుందని భయపడి మిన్నకుండిపోయారు. నాలున్నరేళ్ల నుంచి ఉద్యోగులు తమ హక్కులు, ప్రయోజనాల కోసం పోరాటం చేస్తున్నా ఐఏఎస్‌లు మాత్రం నోరుమెదపలేదు. అయితే, ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో స్పందించకపోతే.. మరింతగా నష్టపోతామని గ్రహించి, ఎన్నికలకు 2 నెలల ముందు బయటపడ్డారు. తమకు 25 నెలల నుంచి ఎన్‌పీఎస్ కంట్రిబ్యూషన్ జమకావడం లేదని, ఇదేం ఖర్మరా బాబు అని ఏ ఇద్దరు ఐఏఎస్‌లు కలిసినా చర్చించుకుంటున్నారు. దీనివల్ల రిటైర్మెంట్ తర్వాత తమకు పెన్షన్ రూపంలో అందాల్సిన సొమ్ము సామాజిక పెన్షన్ల కంటే తక్కువగా ఉన్నా ఆశ్చర్య పోనవసరం లేదంటున్నారు. పైగా ఈ ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిలు వచ్చే ప్రభుత్వం ఇస్తుందన్న గ్యారంటీ లేదని, ఇప్పుడు గట్టిగా ఒత్తిడి చేయకపోతే మొదటికే మోసం వస్తుందని నిర్ణయానికి వచ్చారు. ఈ అంశంపై సీరియస్‌గా చర్చించాలని, ప్రభుత్వంతో అమీతుమీ తేల్చుకోవాలని ఐఏఎస్‌లు తమ సంఘం నాయకులకు తేల్చి చెబుతున్నారు. ఈ సమస్యే ప్రధాన అజెండాగా సోమవారం ఐఏఎస్‌ల అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మీటింగ్ జరగనుంది. అయితే, ఈ సమస్యను సమావేశం అజెండాలో చేర్చితే, అది మీడియాకు లీకైతే ప్రభుత్వం పరువుపోతుందని, అందుకే ఈ అంశాన్ని అప్పటికప్పుడు టేబుల్డ్ ఐటమ్‌గా చర్చించాలని నిర్ణయించారు. 25 నెలల నుంచి ఐఏఎస్‌లకు ఎన్‌పీఎస్ కంట్రిబ్యూషన్ జమ కావడంలేదన్న విషయం బయటకుపొక్కితే తీవ్ర చర్చనీయాంశం అవుతుందని, ఈ ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇబ్బందులు పడుతుందని అసోసియేషన్ నాయకులు భావిస్తున్నారు. అందుకే గుట్టుచప్పుడు కాకుండా చర్చించి, మీడియాకు దూరంగా ఉంచాలని నిర్ణయించారు.

ఉద్యోగులకు ఏడాదిగా ఎగవేత

ప్రభుత్వ ఉద్యోగులు తమకు హక్కుగా అందాల్సిన ప్రయోజనాలపై నాలుగున్నరేళ్ల నుంచి వివిధ రూపాల్లో జగన్ సర్కారుపై పోరాటం చేస్తున్నారు. 2022, నవంబరులో కూడా తమకు సీపీఎస్ కంట్రిబ్యూషన్ జమ చేయాలంటూ మంత్రులకు, సెక్రటరీలకు వినతిపత్రాలిస్తూ నిరసన వ్యక్తం చేశారు. దీంతో ప్రభుత్వం 2023, మార్చి వరకు సీపీఎస్ కంట్రిబ్యూషన్ జమ చేసింది. ఆ తర్వాత నుంచి ఇప్పటి వరకు కంట్రిబ్యూషన్ కింద రూపాయి కూడా ఇవ్వలేదు. దీంతో మార్కెట్‌లో పెట్టుబడుల ద్వారా ఉద్యోగులకు దక్కాల్సిన మెరుగైన రాబడులను వారు కోల్పోతున్నారు. ఫలితంగా రిటైర్మెంట్ తర్వాత వారికి అందే అరకొర పెన్షన్‌లో భారీకోత పడనుంది.

500 కుటుంబాల చేతుల్లో 75% సంపద

- తెలంగాణ రచయితలు కొత్త ఒరవడి సృష్టించాలి: జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి
- తెలంగాణ భాషా, సాహిత్యరంగాలకు డ్రాఫ్ట్ రూపొందించాలి: కె.శ్రీనివాస్
- గత పాలకులు తెలంగాణ జాతికి చేతబడి చేశారు: అందెశ్రీ



మహాసభల్లో మాట్లాడుతున్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): దేశ సంపదలో 75 శాతం కేవలం 500 కుటుంబాల చేతుల్లో కేంద్రీకృతమై ఉందని.. ప్రజల జీవితాలు ఛిద్రమైపోతున్నాయని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి తరుణంలో తెలంగాణ రచయితలు దేశం వైపు దృష్టి సారించి సత్యాన్వేషణ చేయాలని.. తమ రచనలను ప్రజలకు చేరువ చేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన 'తెలంగాణ రచయితల వేదిక 8వ రాష్ట్ర మహాసభల'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సాహిత్యం మానవ సంబంధాలను దగ్గరకు తీసుకురావాలని.. రచయితలు మార్కెట్ పోకడలను అనుసరిస్తే సాహిత్యం ఆత్మహత్య చేసుకుంటుందని పేర్కొన్నారు. తెలంగాణ రచయితలు భాష, సాహిత్య, సాంస్కృతికపరంగా కొత్త ఒరవడులను సృష్టించాలన్నారు. ఇక.. తెలుగు భాష, సాంస్కృతిక, సాహిత్య రంగాలపై ప్రత్యేక పాలసీని రూపొందించుకోవాలని 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ డాక్టర్ కె.శ్రీనివాస్ అన్నారు. గత పదేళ్లలో పాలకులు దీనికి సంబంధించి ఎలాంటి విధానాన్నీ రూపొందించలేదని విమర్శించారు. ప్రభుత్వం తెలంగాణ సమాజం, సాహిత్య, సాంస్కృతిక విధానంపై డ్రాఫ్ట్‌ను రూపొందించి ప్రజల్లో చర్చకు పెట్టాలని అభిప్రాయపడ్డారు. రచయితల వేదిక వంటి సంస్థలు తెలంగాణ సాహిత్య కళారంగాలకు మార్గనిర్దేశం చేస్తే బాగుంటుందన్నారు. ప్రత్యేక రాష్ట్రం పరిధిలో పొందాల్సిన ప్రయోజనాలు, సాధించుకోవాల్సిన లక్ష్యాలు చాలా ఉన్నాయన్న ఆయన.. సమాజంలో నైతిక విలువలు, సాహిత్య సాంస్కృతిక రంగాలను పునరుజ్జీవింపజేయాల్సిన బాధ్యత రచయితలపై ఉందన్నారు. తెలంగాణకు ఉన్న కీర్తిని గత పదేళ్ల అధికారం చెలాయించిన ప్రభుత్వం అణచివేసిందని ప్రముఖ కవి డాక్టర్ అందెశ్రీ ఆవేదన వెలిబుచ్చారు. గత పాలకులు చేసినది చండీయాగం కాదని తెలంగాణ జాతికి చేతబడి అని ఆయన విమర్శించారు. "వర్తమాన తెలంగాణ - కవులు, రచయితల కర్తవ్యాలు" అనే అంశంపై డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్, తెలంగాణ భాష సాహిత్య సాంస్కృతులకు ఎదురవుతున్న సవాళ్లు, పరిష్కారాలు అనే అంశంపై డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు ప్రసంగించారు. ఇక.. ఆదివారం రాత్రి జరిగిన ముగింపు సభకు తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరాం హాజరయ్యారు. తెలంగాణ సమగ్ర చరిత్రను పునర్‌లిఖించాలని, రాష్ట్ర సాహిత్య చరిత్ర, సంస్కృతి పునర్నిర్మాణంలో కవులు, రచయితలు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ భాషకు సమగ్ర పదకోశాన్ని నిర్మించాలని, గిరిజన కళలు, సంస్కృతిని కాపాడడం కోసం మ్యూజియాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ మహాసభకు తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి అధ్యక్షత వహించగా ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు, జూకంటి జగన్నాథం, సంగెవేని రవీంద్ర, జి.నాగభూషణం, అనిశెట్టి రజిత, ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత, జూపాక సుభద్ర, బూర్ల వెంకటేశ్వర్లు, డాక్టర్ దామెర రావులు, అశోక్‌కుమార్, భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.

రిలయన్స్ చేతికి డిస్నీ ఇండియా?

ఈ వారం ఒప్పందం కుదుర్చుకునే చాన్స్!



న్యూఢిల్లీ: దేశ మీడియా రంగంలో భారీ విలీనం చోటు చేసుకోబోతోంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) వాల్ట్ డిస్నీ ఇండియా తమ మీడియా వ్యాపారాలను విలీనం చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. దీనికి సంబంధించి రెండు సంస్థల మధ్య ఇప్పటికే స్పష్టమైన అవగాహన కుదిరినట్టు తెలుస్తోంది. రెండు కంపెనీలు ఈ వారంలో డీల్‌కు సంబంధించి అధికారిక ప్రకటన చేస్తాయని భావిస్తున్నారు. అయితే రిలయన్స్ ఇండస్ట్రీస్‌గానీ, వాల్ట్ డిస్నీ గానీ దీనిపై అధికారికంగా నోరు మెదపడం లేదు. అయితే ఈ నెల ఆరంభంలో డిస్నీ తన భారత వ్యాపారంలో 60 శాతం వాటాను రిలయన్స్‌కు చెందిన వయాకామ్18కి విక్రయించేందుకు సిద్ధంగా ఉందని వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం వెల్లడించింది. ఇందులో భాగంగా కంపెనీ విలువను రూ.33,000 కోట్లు (390 కోట్ల డాలర్లు)గా లెక్కగట్టినట్లు పేర్కొంది.

రిలయన్స్‌కు 61 శాతం వాటా!

విలీన కంపెనీలో రిలయన్స్ ఇండస్ట్రీకు 61 శాతం, వాల్ట్ డిస్నీకి 39 శాతం వాటా ఉంటుందని సమాచారం. అయితే దేశంలోని డిస్నీ ఆస్తుల విలువ మదింపు తర్వాత రెండు కంపెనీల మధ్య ఈ వాటాలపై స్పష్టమైన అవగాహన వస్తుందని తెలుస్తోంది. భారత స్ట్రీమింగ్ బిజినెస్‌లో వాల్ట్ డిస్నీ అనేక సవాళ్లు ఎదుర్కొంటోంది. అమెజాన్ ప్రైమ్ వంటి స్ట్రీమింగ్ యాప్స్‌తో సబ్‌స్క్రైబర్లు తగ్గిపోతున్నారు. మీడియా, స్ట్రీమింగ్ వ్యాపారాల్లో దిగ్గజంగా ఎదిగిన రిలయన్స్‌తో జట్టు కట్టడం ద్వారా స్ట్రీమింగ్ బిజినెస్‌లో తన స్థానాన్ని పటిష్ఠం చేసుకోవచ్చని డిస్నీ భావిస్తోంది, అందుకే ఈ విలీనం దిశగా చర్యలు తీసుకుందని భావిస్తున్నారు.

22,500 పైన బుల్లిష్

(ఫిబ్రవరి 26-మార్చి 1 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

టెక్ వ్యూ

నిఫ్టీ గత వారం 22,298-21,875 పాయింట్ల మధ్యన కదలాడి 22,213 వద్ద ఫ్లాట్‌గాముగిసింది. ఈ వారాంతంలో 22,500 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

120, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 21,779, 21,663, 20,347, 19,954 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 22,600, బ్రేక్‌డౌన్ స్థాయి: 21,825
నిరోధ స్థాయిలు : 22,415, 22,515, 22,615 (22,315 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు : 22,015, 21,915, 21,815

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



25వ తేదీ		విజయవాడ	490
హైదరాబాద్	500	విశాఖపట్నం	500
26వ తేదీ		వరంగల్	502
చిత్తూరు	568	డజను గుడ్లు రూ.72	
గోదావరి	490		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	140	గోదావరి	144
వరంగల్	140	విజయవాడ	144
కరీంనగర్	140	గుంటూరు	144
మహబూబ్‌నగర్	140	ఒంగోలు	144
కర్నూలు	140	చిత్తూరు	144
విశాఖపట్నం	127		

అంగరంగ వైభవంగా అనంత్ అంబానీ ప్రీ-వెడ్డింగ్ వేడుకలు

న్యూఢిల్లీ: మామూలుగానే పెళ్లంటే ఎక్కడ లేని హడావుడి ఉంటుంది. ఇక ఆసియా కుబేరుని కుమారుని వివాహం అంటే మాటలా...? వాస్తవానికి ఇప్పుడు జరగబోయేది వివాహం కూడా కాదు, ప్రీ-వెడ్డింగ్ వేడుక మాత్రమే. అదెవరో కాదు, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) అధినేత ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీది. ఎన్‌కోర్ హెల్త్‌కేర్ సీఈఓ వీరేన్ మర్చంట్, ఎంటర్‌ప్రెన్యూర్ శైలా మర్చంట్‌ల కుమార్తె రాధికా మర్చంట్‌తో అనంత్ వివాహం జూలైలో జరగనుంది. ఆ వివాహానికి కొద్ది నెలల ముందుగానే మార్చి ఒకటో తేదీ నుంచి మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా ప్రీ-వెడ్డింగ్ వేడుక నిర్వహిస్తున్నారు. ప్రపంచ పారిశ్రామిక, వ్యాపార, క్రీడా, సినిమా రంగాల దిగ్గజాలను ఈ వేడుకకు ఆహ్వానించారు. ఈ కార్యక్రమం రిలయన్స్ అతిపెద్ద రిఫైనరీ ఉన్న గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో జరగబోతోంది. ముంబై నుంచి అతిథులను జామ్‌నగర్‌కు తరలించేందుకు చార్టర్డ్ విమానాలు కూడా ఏర్పాటు చేశారు. ఈ వేడుకకు ఆహ్వానాలు పంపిన పారిశ్రామిక, వాణిజ్య దిగ్గజాల్లో మార్క్ జుకర్‌బర్గ్, బిల్ గేట్స్, సుందర్ పిచాయ్, శంతను నారాయణ్, బాబ్ ఐగర్, లారీ ఫింక్ (బ్లాక్‌రాక్), సుల్తాన్ అహ్మద్ అల్ జబేర్ (అద్నాక్), ఈఎల్ రోత్‌షిల్డ్ (లిన్ ఫారెస్టర్ రోత్ షిల్డ్ ఛైర్మన్), గౌతమ్ అదానీ కుటుంబం, ఎన్ చంద్రశేఖరన్, కుమార మంగళం బిర్లా కుటుంబం, గోద్రెజ్ కుటుంబం, నందన్ నీలేకని, సంజీవ్ గోయెంకా, రిషద్ ప్రేమ్‌జీ ఉన్నారు.

పెట్టుబడులపై జర జాగ్రత్త

వారెన్ బఫెట్

ఒమాహా (అమెరికా): పెట్టుబడులపై అత్యంత జాగ్రత్తగా ఉండాలని స్టాక్ మార్కెట్ దిగ్గజం వారెన్ బఫెట్ మదుపరులను కోరారు. వాల్‌స్ట్రీట్ (అమెరికా స్టాక్ మార్కెట్ కేంద్ర స్థానం) పండితులు లేదా ఆర్థిక సలహాదారుల సలహాలు గుడ్డిగా నమ్మి పెట్టుబడులు పెడితే నిండా మునుగుతారని హెచ్చరించారు. తాజాగా విడుదల చేసిన తన వార్షిక లేఖలో ఆయన ఈ హెచ్చరిక చేశారు. అమెరికాలో టెక్ కంపెనీల షేర్లు చుక్కలంటిన నేపథ్యంలో బఫెట్ ఈ హెచ్చరిక చేయడం విశేషం. భారీ లాభాలు, ఆస్తులు నమోదు చేసినట్టు కంపెనీలు చూపే లెక్కలనూ పెద్దగా పట్టించుకోవద్దని ఆయన మదుపరులను కోరారు. ఆ లాభాలు, ఆస్తుల్లో ఎక్కువ భాగం కాగితాలపై ఉండేవే తప్ప, నిజమైన లాభాలు, ఆస్తులు కావని బఫెట్ స్పష్టం చేశారు.

తగ్గిన కరెన్సీ సర్క్యులేషన్

ముంబై : భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) రూ.2,000 నోట్ల చలామణిని వెనక్కి తీసుకోవడం నోట్ల చలామణిపై పెద్ద ప్రభావమే చూపింది. దీంతో 2022 ఫిబ్రవరి 9న 8.2 శాతంగా ఉన్న నగదు చలామణి (కరెన్సీ సర్క్యులేషన్) వృద్ధి రేటు ఈ నెల 9వ తేదీకి 3.7 శాతానికి పడిపోయింది. జనవరిలో బ్యాంకు డిపాజిట్ల వృద్ధి రేటు రెండంకెల్లో ఉండడానికి రూ.2,000 నోట్ల చలామణిని వెనక్కి తీసుకోవడమే కారణమని భావిస్తున్నారు. గత ఏడాది మార్చి 19న రూ.2,000 నోట్ల చలామణిని వెనక్కి తీసుకుంటున్నట్టు ఆర్‌బీఐ ప్రకటించింది. దాంతో అప్పట్లో రూ.3.56 లక్షల కోట్లుగా ఉన్న రూ.2,000 నోట్ల చలామణి ఈ ఏడాది జనవరి నెలాఖరుకు రూ.8,897 కోట్లకు పడిపోయింది.

బైజూస్ అవకతవకలపై సమీక్ష

అవసరమైతే 'పేటీఎం'నీ సమీక్షిస్తాం: ఐసీఏఐ

కోల్‌కతా: ఎడ్యుకేషన్ స్టార్టప్ కంపెనీ బైజూస్ నిర్వహణలో చోటు చేసుకున్నట్టు చెబుతున్న అవకతవకల ఆరోపణలపై ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) కూడా దృష్టి పెట్టింది. ఆ సంస్థకు చెందిన ఫైనాన్షియల్ రిపోర్టింగ్ రివ్యూ బోర్డు (ఎఫ్ఆర్ఆర్‌బీ) ఇప్పటికే ఈ విషయాలను సమీక్షిస్తోంది. ఐసీఏఐ జాతీయ అధ్యక్షుడు రంజిత్ కుమార్ అగర్వాల్ ఈ విషయం చెప్పారు. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ (పీపీబీఎల్)లో చోటు చేసుకున్నట్టు చెబుతున్న అవకతవకలనూ అవసరమైతే ఎఫ్ఆర్ఆర్‌బీ సమీక్షిస్తుందని ఆయన చెప్పారు. మార్చి నుంచి జరిగే ఎఫ్ఆర్ఆర్‌బీ బోర్డు సమావేశాల్లో దీనిపై నిర్ణయం తీసుకుంటామని అగర్వాల్ చెప్పారు. రెగ్యులేటరీ నిబంధనలు తుంగలో తొక్కినందున ఆర్‌బీఐ ఇప్పటికే పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై కొన్ని ఆంక్షలు విధించింది.

ఆటుపోట్లకు అవకాశం!

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారం మిశ్రమంగా కదలాడే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతవారం నిఫ్టీ ప్రతి సెషన్‌లోనూ సరికొత్త జీవితకాల గరిష్ఠాలను తాకింది. అయితే పటిష్ఠతను కనబరచకపోవటంతో కొద్దిగా నిరోధాన్ని ఎదుర్కొంది. ఈ వారం డెరివేటివ్స్ ముగింపు కారణంగా ఆటుపోట్లకు అవకాశం ఉంది. నిఫ్టీ మార్చి ఫ్యూచర్స్‌కు 22,350 వద్ద మద్దతు, 22,500 వద్ద నిరోధ స్థాయిలున్నాయి. వీటిని బట్టే గమనం ఉంటుంది. నిరోధాన్ని ఎదుర్కొంటేనే బుల్లిష్‌నెస్ వస్తుంది. లేదంటే కరెక్షన్‌కు వీలుంది.

స్టాక్ రికమండేషన్స్

గోద్రెజ్ ప్రాపర్టీస్: చివరి నాలుగు సెషన్లలో ఈ షేరు లాభాల్లోనే ముగిసింది. గత శుక్రవారం ఈ షేరు 3.41 శాతం లాభంతో రూ.2,468 వద్ద క్లోజైంది. నిఫ్టీతో పోలిస్తే ఈ కౌంటర్ మెరుగైన పనితీరును కనబరుస్తోంది. డెలివరీ, ట్రేడింగ్ వాల్యూమ్ క్రమంగా పెరుగుతోంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.2,450 శ్రేణిలో ప్రవేశించి రూ.2,550/2,610 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,410 వద్ద కచ్చితమైన స్టాప్‌లాస్ పెట్టుకోవాలి.

జెఎస్‌డబ్ల్యూ ఎనర్జీ: సుదీర్ఘకాలంగా ఈ కౌంటర్‌లో అప్‌ట్రెండ్ కొనసాగుతోంది. డిసెంబరు త్రైమాసిక ఫలితాలు ప్రకటించినప్పటి నుంచి అక్యుములేషన్ జరుగుతోంది. గత శుక్రవారం ఈ షేరు 3.86 శాతం లాభంతో రూ.506 వద్ద క్లోజైంది. మూమెంటమ్ ట్రేడర్లు రూ.500 స్థాయిల్లో ఈ కౌంటర్‌లోకి ప్రవేశించి రూ.585/655 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.475 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్‌బీఐ లైఫ్: డిసెంబరు త్రైమాసిక ఫలితాలు ప్రకటించిన నాటి నుంచి ఈ షేరు జోరును ప్రదర్శిస్తోంది. వాల్యూమ్‌ను బట్టి ఇన్వెస్టర్లు ఈ స్టాక్‌ను వదులుకునేందుకు ఇష్టపడటం లేదని తెలుస్తోంది. గత శుక్రవారం రూ.1,529 వద్ద క్లోజైన ఈ షేరు సరికొత్త జీవితకాల గరిష్ఠాన్ని బ్రేక్ చేసేందుకు ప్రయత్నిస్తోంది. నిరోధాన్ని అధిగవిస్తే మరింత బుల్లిష్‌నెస్ వస్తుంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.1,500 శ్రేణిలో ఎంటరై రూ.1,580/1,640 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,470 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

అంబుజా సిమెంట్స్: సుదీర్ఘ దిద్దుబాటు తర్వాత గత ఏడాది నవంబరులో ప్రారంభమైన బుల్‌రన్ ఇంకా కొనసాగుతోంది. జార్ఖండ్‌లో కొత్తగా రూ.1,000 కోట్లతో యూనిట్ ఏర్పాటు చేస్తుండటం, నిఫ్టీతో పోలిస్తే మెరుగైన ప్రదర్శన, తాజాగా జీవితకాల గరిష్ఠాన్ని అధిగమించటం కలిసి వచ్చే అంశాలు. గత శుక్రవారం ఈ షేరు రూ.602 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లో రూ.600 వద్ద పొజిషన్ తీసుకుని రూ.660/725 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.575 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

అదానీ విల్మార్ : కొద్ది నెలలుగా డౌన్‌ట్రెండ్‌లో ఉన్న ఈ కౌంటర్‌లో ఇప్పుడిప్పుడే మూమెంటమ్ పెరుగుతోంది. గత వారం ఈ షేరు దాదాపు 13 శాతం మేర లాభపడింది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ గణనీయంగా పెరిగింది. గత శుక్రవారం ఒక్కరోజే 8.12 శాతం లాభంతో 389.95 వద్ద క్లోజైంది. ఈ కౌంటర్‌లోకి ఇన్వెస్టర్లు రూ.375 శ్రేణిలో ప్రవేశించి రూ.410/480 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.355 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.


- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

22,300 పైన నిలకడ తప్పనిసరి

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం పాజిటివ్‌గా ప్రారంభమైనా 22,000 వద్ద విఫలమై 300 పాయింట్ల మేరకు కరెక్షన్‌కు లోనైంది. కాని చివరి ట్రేడింగ్ రోజున బలమైన రికవరీ సాధించి జీవితకాల గరిష్ఠ స్థాయి 22,200 సమీపంలో క్లోజైంది. 22,000 వద్ద ఆరు వారాల పాటు సాగిన సైడ్‌వేస్, కన్సాలిడేషన్ అనంతరం గత వారం బ్రేకౌట్ సాధించింది. ఆకస్మిక బలహీనత ఏర్పడితే తప్ప మార్కెట్ సానుకూల ట్రెండ్‌లో ఉంది. అమెరికా, భారత్ త్రైమాసిక జీడీపీ గణాంకాలు వెలువడనున్న దృష్ట్యా మార్కెట్‌కు ఈ వారం అత్యంత కీలకం. ఈ గణాంకాలకు మార్కెట్ బలంగా స్పందించే ఆస్కారం ఉంది. గత వారంలో మిడ్‌క్యాప్ 10, స్మాల్‌క్యాప్ 100 సూచీలు కన్సాలిడేషన్ ధోరణిలో ట్రేడయ్యాయి. గతంలో ఏర్పడిన గరిష్ఠ స్థాయిల కన్నా దిగువనే ఉన్నాయి. గతవారం ప్రధాన నిరోధ స్థాయిల్లో బ్రేకౌట్ సాధించినందు వల్ల టెక్నికల్ పుల్‌బ్యాక్‌కు ఆస్కారం ఉంది. స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి. ఈ పుల్‌బ్యాక్‌లో కూడా సానుకూలత కోసం రాబోయే కొద్ది రోజుల్లో మార్కెట్ మద్దతు స్థాయిల కన్నా పైన తప్పనిసరిగా నిలదొక్కుకోవాలి.

బుల్లిష్ స్థాయిలు: మరింత అప్‌ట్రెండ్ కోసం నిఫ్టీ గత శుక్రవారం ఏర్పడిన జీవితకాల గరిష్ఠ స్థాయి 22,300 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఆ పైన కొత్త శిఖరాలకు బాటలు వేస్తుంది. మానసిక అవధి 22,600.

బేరిష్ స్థాయిలు: బలహీనతకు లోనైనా తక్షణ అప్‌ట్రెండ్ కోసం ప్రధాన మద్దతు స్థాయి 22,000 వద్ద నిలదొక్కుకుని తీరాలి. ఈ స్థాయిలో విఫలమైతే స్వల్పకాలిక బలహీనత దిశగా అప్రమత్తతను సూచిస్తుంది.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం మైనర్ అప్‌ట్రెండ్‌లో ట్రేడయి 425 పాయింట్ల లాభంతో క్లోజైంది. కాని గరిష్ఠ, కనిష్ఠ స్థాయిలకు నడుమ అనిశ్చితంగా క్లోజ్ కావడం మరింత కన్సాలిడేషన్ ఉండవచ్చుననేందుకు సంకేతం. గత కొద్ది వారాలుగా ఈ సూచీ 47,000 వద్ద నిరోధం ఎదుర్కొంటోంది. మరింత అప్‌ట్రెండ్ కోసం నిరోధ స్థాయి 47,300 కన్నా పైన నిలదొక్కుకోవడం తప్పనిసరి. మద్దతు స్థాయి 46,500 వద్ద విఫలమైతే అప్రమత్త సంకేతం ఇస్తుంది.

పాటర్న్: మార్కెట్‌కు 22,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద మద్దతు ఉంది. సానుకూలత కోసం ఇక్కడ కన్సాలిడేట్ అయి తీరాలి.

టైమ్ : ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి రివర్సల్ ఉండవచ్చు.


సోమ వారం స్థాయిలు	
నిరోధం	22,300, 22,355
మద్దతు	22,160, 22,100

www.sundartrends.in

అదిగదిగో సిరీస్

భారత్ లక్ష్యం 192
ప్రస్తుతం 40/0
ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ 145

అశ్విన్‌కు 5, కుల్దీప్‌నకు 4 వికెట్లు
భారత్ రెండో ఇన్నింగ్స్ 307
ధ్రువ్ జురెల్ శతకం మిస్


అశ్విన్ (5/51)

1
సొంత గడ్డపై ఎక్కువ వికెట్లు (354) తీసిన భారత బౌలర్‌గా అశ్విన్. కుంబ్లే (350) రికార్డును అధిగమించాడు. అలాగే భారత్ తరఫున ఎక్కువసార్లు (35) 5+ వికెట్లు తీసి కుంబ్లేతో సమంగా నిలిచాడు. ఓవరాల్‌గా నాలుగో బౌలర్.

స్టోక్స్-మెకల్లమ్ ఆధ్వర్యంలో ఇంగ్లండ్ ఓ ఇన్నింగ్స్‌లో మూడు రన్‌రేట్ లోపే పరుగులు సాధించడం ఇదే తొలిసారి.

రాంచీ: భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య నాలుగో టెస్టు అనూహ్య మలుపులతో సాగుతోంది. తొలి రెండు రోజులు వెనుకబడిన టీమిండియా.. ఆదివారం జూలు విదిల్చి, మ్యాచ్‌ను తమ గుప్పిట్లోకి తెచ్చుకుంది. ధ్రువ్ జురెల్ (90) అసామాన్య బ్యాటింగ్‌తో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 307 పరుగులు చేసింది. దీంతో ఇంగ్లండ్‌కు కేవలం 46 పరుగుల ఆధిక్యమే దక్కింది. ఆ తర్వాత బజ్‌బాల్ ఆటతో భారీ లక్ష్యాన్ని ఆతిథ్య జట్టు ముందుంచాలనుకున్న ఇంగ్లండ్ ఆశలకు స్పిన్ ద్వయం అశ్విన్ (5/51), కుల్దీప్ (4/22) బ్రేకులు వేసింది. దీంతో ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 53.5 ఓవర్లలో 145 పరుగులకే పరిమితమైంది. క్రాలే (60), బెయిర్‌స్టో (30) మాత్రమే ఆకట్టుకున్నారు. ఆ తర్వాత 192 పరుగుల ఛేదన బరిలోకి దిగిన భారత్ మూడో రోజు ముగిసేసరికి 8 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 40 రన్స్ చేసింది. ఓపెనర్లు రోహిత్ (24), జైస్వాల్ (16) క్రీజులో ఉండగా.. జట్టు సిరీస్ విజయానికి 152 పరుగుల దూరంలో ఉంది. ఆటకు ఇంకా రెండు రోజుల సమయం ఉండగా, చేతిలో పది వికెట్లున్న భారత్‌వైపే గెలుపు కనిపిస్తోంది.

జురెల్ పోరాటం: ఓవర్‌నైట్ స్కోరు 219/7తో ఆట ప్రారంభించిన భారత్ తొలి ఇన్నింగ్స్‌కు మరో 88 పరుగులు జోడించడం విశేషం. కీపర్ జురెల్ తానాడుతున్న రెండో టెస్టులోనే పరిణతి చూపాడు. 96 బంతుల్లో 50 పరుగులు సాధించాక ఆటలో వేగం పెంచాడు. స్పిన్నర్లు బషీర్, హార్ట్‌లీ బంతులను సులువుగా ఆడేశాడు. 59 రన్స్ దగ్గర అతడిచ్చిన క్యాచ్‌ను రాబిన్సన్ వదిలేయగా, బషీర్ ఓవర్‌లో వరుసగా 4,6తో 90 రన్స్‌కు చేరువై సెంచరీ ఖాయమనిపించాడు. కానీ హార్ట్‌లీ అతడి ఆశలకు బ్రేక్ వేసి భారత్ ఇన్నింగ్స్‌ను కూడా ముగించాడు. అద్భుత సహకారమందించిన కుల్దీప్ (131 బంతుల్లో 28)తో కలిసి ఎనిమిదో వికెట్‌కు 76 రన్స్ జోడించిన జురెల్.. ఆకాశ్ (9)తో కలిసి తొమ్మిదో వికెట్‌కు 40 రన్స్ జత చేయడంతో స్కోరు 300 దాటింది.

స్పిన్‌కు దాసోహం: జురెల్ ఇన్నింగ్స్‌తో తమ ఆధిక్యం తగ్గినా ఇంగ్లండ్ బ్యాటర్లు రెండో ఇన్నింగ్స్‌ను వేగంగా ఆడాలని చూశారు. కానీ భారత స్పిన్నర్లు వారిని చెడుగుడు ఆడేశారు. అశ్విన్, కుల్దీప్‌ల ముప్పేట దాటికి 25 పరుగుల వ్యవధిలోనే చివరి 6 వికెట్లను జట్టు కోల్పోయింది. ఓపెనర్ క్రాలే మాత్రమే ఆకట్టుకున్నాడు. కొత్త బంతితో అశ్విన్ మాయ చేస్తూ ఇంగ్లండ్ నడ్డి విరిచాడు. డకెట్ (15), పోప్ (0)లను ఐదో ఓవర్‌లోనే వరుస బంతుల్లో అవుట్ చేసిన అశ్విన్..కాసేపటికే రూట్ (11) పనిబట్టాడు. అటు కుల్దీప్ దాడికి క్రాలే, స్టోక్స్ (4) పెవిలియన్ చేరడంతో రెండోసెషన్‌లోనే జట్టు 5 వికెట్లు కోల్పోయింది. బెయిర్‌స్టో దీటుగా ఆడినట్టు కనిపించినా అతడిని ఆఖరిసెషన్ ఆరంభంలోనే జడేజా అవుట్ చేశాడు. ఆ తర్వాత అశ్విన్, కుల్దీప్ మిగిలిన 4 వికెట్లను పంచుకోవడంతో ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ ముగిసింది.


కుల్దీప్ (4/22)


ధ్రువ్ జురెల్ (90)

స్కోరుబోర్డు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 353;
భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (బి) బషీర్ 73; రోహిత్ (సి) ఫోక్స్ (బి) అండర్సన్ 2; గిల్ (ఎల్బీ) బషీర్ 38; రజత్ (ఎల్బీ) బషీర్ 17; జడేజా (సి) పోప్ (బి) బషీర్ 12; సర్ఫరాజ్ (సి) రూట్ (బి) హార్ట్‌లీ 14; జురెల్ (బి) హార్ట్‌లీ 90; అశ్విన్ (ఎల్బీ) హార్ట్‌లీ 1; కుల్దీప్ (బి) అండర్సన్ 28; ఆకాశ్ (ఎల్బీ) బషీర్ 9; సిరాజ్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 23; మొత్తం: 103.2 ఓవర్లలో 307 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-4, 2-86, 3-112, 4-130, 5-161, 6-171, 7-177, 8-253, 9-293, 10-307. **బౌలింగ్:** అండర్సన్ 18-4-48-2; రాబిన్సన్ 13-0-54-0; బషీర్ 44-8-119-5; హార్ట్‌లీ 27.2-6-68-3; రూట్ 1-0-1-0.

ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలే (బి) కుల్దీప్ 60; డకెట్ (సి) సర్ఫరాజ్ (బి) అశ్విన్ 15; పోప్ (ఎల్బీ) అశ్విన్ 0; రూట్ (ఎల్బీ) అశ్విన్ 11; బెయిర్‌స్టో (సి) రజత్ (బి) జడేజా 30; స్టోక్స్ (బి) కుల్దీప్ 4; ఫోక్స్ (సి అండ్ బి) అశ్విన్ 17; హార్ట్‌లీ (సి) సర్ఫరాజ్ (బి) కుల్దీప్ 7; రాబిన్సన్ (ఎల్బీ) కుల్దీప్ 0; బషీర్ (నాటౌట్) 1; అండర్సన్ (సి) జురెల్ (బి) అశ్విన్ 0; **మొత్తం: 53.5 ఓవర్లలో 145 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-19, 2-19, 3-65, 4-110, 5-120, 6-120, 7-133, 8-133, 9-145, 10-145; **బౌలింగ్:** అశ్విన్ 15.5-0-51-5; జడేజా 20-5-56-1; సిరాజ్ 3-0-16-0; కుల్దీప్ 15-2-22-4.

భారత్ రెండో ఇన్నింగ్స్: రోహిత్ (బ్యాటింగ్) 24; జైస్వాల్ (బ్యాటింగ్) 16; **మొత్తం: 8 ఓవర్లలో 40/0. బౌలింగ్:** రూట్ 4-0-17-0; హార్ట్‌లీ 3-0-22-0; బషీర్ 1-0-1-0.

4 గంటలు.. 140 ఓవర్లు

టెస్టుల్లో సరైన కీపర్ కోసం చూస్తున్న టీమిండియాకు ధ్రువ్ జురెల్ రూపంలో సమాధానం లభించినట్టయ్యింది. ఆడుతోంది రెండో టెస్టులోనైనా తన బ్యాటింగ్‌లో సాధికారత చూసిన మాజీలు, విశ్లేషకులు కూడా అబ్బురపడుతున్నారు. ఏకంగా అతడిని ధోనీతోనే పోలుస్తున్నారు. జట్టు విపత్కర పరిస్థితిలో ఉన్నప్పటికీ ఒత్తిడిని దరి చేరనీయకుండా టెయిలెండర్ల అసరాతో సాగించిన పోరాటం అపూర్వం. తద్వారానే భారత్ ఒక్కసారిగా ఈ టెస్టును శాసించే స్థితికి చేరింది. తొలి శతకాన్ని మిస్ చేసుకున్నా అప్పటికే ఇంగ్లండ్ ఆధిక్యాన్ని నామమాత్రం చేయడంలో విజయం సాధించాడు. అయితే ఈ ట్రాక్‌పై స్పిన్నర్లు బషీర్, హార్ట్‌లీని సులువుగా ఆడడం వెనుక అతడి కఠోర శ్రమ కూడా దాగి ఉంది. టెస్టు అరంగేట్రానికి ముందు టాలెగావ్‌లోని రాజస్థాన్ రాయల్స్ హైపెర్‌ఫార్మెన్స్ అకాడమీలో శిక్షణ తీసుకున్నాడు. అక్కడ ఒకే రోజులో 140 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేశాడట. విభిన్న స్పిన్ ట్రాక్‌లపై 4 గంటలపాటు ఏకధాటిగా బౌలర్లను ఎదుర్కొన్నాడట. ఇక, కార్గిల్ వార్‌లో పాల్గొన్న అనుభవమున్న తండ్రి మాదిరే.. తనయుడు జురెల్ కూడా అలాంటి మొక్కవోని పోరాటం తోనే ఇప్పుడు జట్టును ఆదుకోవడం విశేషం.

నాన్నకు సెల్యూట్

ఎలాంటి అంచనాలు లేకుండా బరిలోకి దిగిన భారత వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ నాలుగో టెస్టులో విలువైన ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. అయితే మూడో రోజు ఆటలో కెరీర్‌లో తొలి అర్ధసెంచరీ చేశాక కూడా తను పెద్దగా సంబరాలు చేసుకోలేదు. కానీ తన తండ్రికి గౌరవంగా సెల్యూట్ చేయడం కనిపించింది. ఆ సమయంలో తను అలా ఎందుకు చేశాడో ఎవరికీ అర్థం కాలేదు. కానీ మ్యాచ్ ముగిశాక జురెల్ అసలు విషయం చెప్పాడు. ఈ యువ కీపర్ తండ్రి నేమ్‌చంద్ మాజీ సైనికుడు. 1999 కార్గిల్ వార్‌లోనూ పాల్గొన్నాడు. 2008లో వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్న ఆయన గౌరవార్థం సెల్యూట్ చేసినట్టు చెప్పాడు. తన అరంగేట్ర క్యాప్‌ను కూడా తండ్రికి అంకితమిస్తున్నట్టు రాంచీ టెస్టుకు ముందు ప్రకటించాడు.

వావ్.. ధీరజ్

ఆసియా ఆర్చరీలో మూడు స్వర్ణాలు కైవసం



బాగ్దాద్: తెలుగు కుర్రాడు బొమ్మదేవర ధీరజ్ ఆర్చరీ ఆసియా కప్ స్టేజ్ 1 పోటీల్లో అదరగొట్టాడు. ఈ టోర్నీలో ఏకంగా మూడు స్వర్ణాలు సాధించి వహ్వా అనిపించాడు. వ్యక్తిగత విభాగం, టీమ్ ఈవెంట్, మిక్స్‌డ్ ఈవెంట్లలో విజేతగా నిలిచాడు. రికర్వ్ పురుషుల వ్యక్తిగత విభాగం ఫైనల్లో ధీరజ్ 7-3తో సహచరుడు తరుణ్‌దీప్‌ను చిత్తుచేసి పసిడి అందుకున్నాడు. ఇక, రికర్వ్ మిక్స్‌డ్ ఫైనల్లో ధీరజ్/సిమ్రన్‌జీత్ ద్వయం 6-0తో బంగ్లాపై, పురుషుల రికర్వ్ టీమ్ ఈవెంట్ ఫైనల్లో ధీరజ్, తరుణ్‌దీప్, ప్రవీణ్‌లతో కూడిన భారత త్రయం 5-2తో బంగ్లాపై గెలిచి స్వర్ణాలు దక్కించుకున్నారు. ఇక, వెటరన్ స్టార్ దీపికా కుమారి రికర్వ్ మహిళల వ్యక్తిగత విభాగంతో పాటు టీమ్ ఈవెంట్లలో సత్తాచాటి రెండు స్వర్ణాలు ఖాతాలో వేసుకుంది. ఓవరాల్‌గా ఈ టోర్నీలో భారత ఆర్చర్లు 10 స్వర్ణాలు, 3 రజతాలు, ఓ కాంస్యంతో కలిపి 14 పతకాలు కొల్లగొట్టారు.

హాకీ లీగ్‌లో గెలుపు

రూర్కెలా: ఎఫ్ఐహెచ్ హాకీ ప్రో లీగ్‌లో సొంతగడ్డపై పోరాటాన్ని భారత పురుషుల జట్టు విజయంతో ముగించింది. ఆదివారం జరిగిన పోరులో భారత్ 4-0తో ఐర్లాండ్‌ను చిత్తుచేసింది. నీలకంఠ, ఆకాశ్‌దీప్, గుర్జాంత్, జుగ్‌రాజ్‌లు తలా గోల్ చేశారు.

ఆంధ్ర లక్ష్యం 170

ప్రస్తుతం 95/4 ● మధ్యప్రదేశ్‌తో రంజీ

ఇండోర్: బౌలర్ల ఆధిపత్యం సాగుతున్న నేపథ్యంలో.. ఆంధ్ర, మధ్యప్రదేశ్ మధ్య జరుగుతున్న రంజీ క్వార్టర్స్ మ్యాచ్ రసవత్తరంగా మారింది. ఎంపీ నిర్దేశించిన 170 పరుగుల లక్ష్య ఛేదనలో భాగంగా.. మూడో రోజు ఆదివారం ఆట ముగిసేసరికి ఆంధ్ర రెండో ఇన్నింగ్స్‌లో 95/4 స్కోరు చేసింది. విజయానికి ఇంకా 75 పరుగుల దూరంలో ఉండగా.. చేతిలో 6 వికెట్లున్నాయి. విహారి (43), కర్ణ్ షిండే (5) క్రీజులో ఉన్నారు. కాగా, ఆంధ్ర బౌలర్లు నితీష్ (4/28), శశికాంత్ (3/20), లలిత్ (3/20) విజృంభించడంతో.. ఓవర్‌నైట్ స్కోరు 21/0తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన మధ్యప్రదేశ్ 107 పరుగులకే కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్ 62 రన్స్‌తో కలిపి ఎంపీ ఆధిక్యం మొత్తం 169 పరుగులకు చేరింది. తొలి ఇన్నింగ్స్‌లో ఎంపీ 234, ఆంధ్ర 172 రన్స్ చేశాయి.

ముంబై సులువుగా..

- కెర్ ఆల్‌రౌండ్ షో
- రాణించిన హర్మన్
- గుజరాత్ ఓటమి


హర్మన్‌ప్రీత్ (46 నాటౌట్)


అమేలియా కెర్ (31, 4/17)

బెంగళూరు: అమేలియా కెర్ (31, 4/17) ఆల్‌రౌండ్ షోకు హర్మన్‌ప్రీత్ కౌర్ (41 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 46 నాటౌట్) నిలకడైన ప్రదర్శన తోడవడంతో.. డబ్ల్యూపీఎల్‌లో ముంబై ఇండియన్స్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ముంబై 5 వికెట్లతో గుజరాత్ జెయింట్స్‌ను చిత్తు చేసింది. తొలుత గుజరాత్ 20 ఓవర్లలో 126/9 స్కోరు చేసింది. టాపార్డర్ బ్యాటర్లు విఫలమైనా.. తనూజ (28), కేథరిన్ బ్రైస్ (25 నాటౌట్) 8వ వికెట్‌కు 48 పరుగుల భాగస్వామ్యంతో జట్టుకు గౌరవప్రద స్కోరు అందించారు. బెత్ మూనీ (24) రాణించింది. షబ్నిం ఇస్మాయిల్ 3 వికెట్లు పడగొట్టింది. ఛేదనలో ముంబై 18.1 ఓవర్లలో 5 వికెట్లకు 129 పరుగులు చేసి గెలిచింది. తనూజ 2 వికెట్లు తీసింది. ఓపెనర్లు యాస్తిక (7), మాథ్యూస్ (7) వెంటనే వెనుదిరిగినా, సివర్ బ్రంట్ (22)కు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సహకారం అందించడంతో పవర్‌ప్లే ముగిసేసరికి ముంబై 39/2తో నిలిచింది. అయితే, స్కోరు వేగం పుంజుకొంటున్న సమయంలో బ్రంట్ రనౌటవడంతో.. మూడో వికెట్‌కు 28 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఈ దశలో హర్మన్, కెర్ ధాటిగా ఆడుతూ నాలుగో వికెట్‌కు 66 పరుగుల భాగస్వామ్యంతో జట్టును గెలుపు ముంగిట నిలిపారు. అమేలియాను తహూహు ఎల్బీ చేసినా.. తుదికంటా నిలిచి హర్మన్ మరో 11 బంతులు మిగిలుండగానే మ్యాచ్‌ను ఫినిష్ చేసింది. కెర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

డబ్ల్యూపీఎల్‌లో నేడు
యూపీ X ఢిల్లీ
రాత్రి 7.30 గం. నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో

సంక్షిప్త స్కోర్లు

గుజరాత్: 20 ఓవర్లలో 126/9 (తనూజ 28, కేథరిన్ 25 నాటౌట్; కెర్ 4/17, షబ్నిం 3/18).
ముంబై: 18.1 ఓవర్లలో 129/5 (హర్మన్‌ప్రీత్ 46 నాటౌట్, కెర్ 31; తనూజ 2/21).

హసరంగపై 2 మ్యాచ్‌ల సస్పెన్షన్

దుబాయ్: అంపైర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన శ్రీలంక కెప్టెన్ హసరంగపై ఐసీసీ క్రమశిక్షణా చర్యలు తీసుకొంది. రెండు టీ20 మ్యాచ్‌లకు అతడిపై సస్పెన్షన్ విధించడమే కాకుండా.. మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత వేసింది. 3 డీమెరిట్ పాయింట్స్‌ను అతడి ఖాతాలోకి చేర్చింది. అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన మూడో టీ20లో కమిందు మెండిస్ బ్యాటింగ్ చేస్తున్నప్పుడు.. వఫాదార్ వేసిన ఫుల్‌టాస్‌ను నోబాల్‌గా ప్రకటించలేదు. దీంతో ఫీల్డ్‌లోకి వచ్చిన హసరంగ.. అంపైర్ లిండన్ హనీబాల్‌తో వాగ్వాదానికి దిగాడు. ఆ మ్యాచ్‌లో లంక 3 పరుగుల తేడాతో ఓడింది. కాగా, అంపైర్ హెచ్చరికలను పట్టించుకోకుండా పదేపదే బ్యాట్ గ్రిప్ మార్చిన అఫ్ఘాన్ బ్యాటర్ రహ్మనుల్లా గుర్బాజ్ మ్యాచ్ ఫీజులో 15 శాతం జరిమానా విధించారు.

ఆసీస్ క్లీన్‌స్వీప్

ఆక్లాండ్: ఇప్పటికే వరుస రెండు విజయాలతో సిరీస్ దక్కించుకున్న ఆస్ట్రేలియా ఆఖరిదైన మూడో టీ20లోనూ న్యూజిలాండ్‌ను ఓడించి క్లీన్‌స్వీప్ చేసింది. ఆదివారం జరిగిన వర్ష ప్రభావిత మ్యాచ్‌లో డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం ఆసీస్ 27 పరుగుల తేడాతో గెలిచింది. మొదట ఆసీస్.. 10.4 ఓవర్లలో 118/4 స్కోరు చేసింది. 10 ఓవర్లలో 126 రన్స్ లక్ష్యంతో బరిలోకి దిగిన కివీస్..10 ఓవర్లలో 98/3 స్కోరుకే పరిమితమైంది.

టెలీపతి... అంటే మనం మనసులో అనుకున్న విషయం, అదే సమయంలో మన ఆత్మీయులకు సైతం మానసికంగా స్ఫురించడం. అంటే వ్యక్తుల మధ్య ఉన్న దూరంతో సంబంధం లేకుండా వారి మనసుల మధ్య జరిగే కమ్యూనికేషన్‌గా దీనిని చెప్పుకోవచ్చు. ఇప్పటివరకూ ఇది, అరుదుగా సంభవిస్తున్నా, ఒక ప్రామాణికత లేని భావనే.

ప్రస్తుతం ఎలాన్ మస్క్‌కు చెందిన 'న్యూరా లింక్' సంస్థ ప్రయోగాత్మకంగా ఒక వ్యక్తి మెదడులో కంప్యూటర్ చిప్‌ను విజయవంతంగా అమర్చడం ద్వారా మనసుతోనే కంప్యూటర్‌ను ఆపరేట్ చేయగలిగే సౌలభ్యం అందుబాటులోకి వచ్చింది. ఈ ప్రాజెక్టు పేరు సైతం 'టెలీపతి' కావడం గమనార్హం. ఈ తాజా పరిశోధన ఎంద మౌస్‌ను నియంత్రిస్తూ, కంప్యూటర్‌ను ఆపరేట్ చేయించగలుగుతారు. ఈ విధానాన్ని 'బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్'గా వ్యవహరిస్తున్నారు.

మానవ మస్తిష్కంలో అమర్చే ఈ వైర్‌లెస్ చిప్‌లో మనిషి వెంట్రుకతో పోల్చిన 20వ వంతు మందం మాత్రమే కలిగిన సన్నని ఎలక్ట్రోడ్స్ దాదాపు మూడువేల వరకూ అమర్చి ఉంటాయి.

'న్యూరా లింక్ ప్రాజెక్ట్'

సృష్టికి ప్రతిసృష్టి!

రికో ఆశాదీపం కాగా, వ్యక్తిగత గోప్యతకు మాత్రం భవిష్యత్తులో గొడ్డలిపెట్టుగా మారనుందన్న ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి.

న్యూరాలింక్ టెలీపతి (చెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్)

న్యూరాలింక్ సంస్థ చేపట్టిన బ్రెయిన్, కంప్యూటర్ అనుసంధాన ప్రాజెక్టు (బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్)కు 'టెలీపతి' అని నామకరణ చేశారు. ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం, చిప్ అమర్చిన మానవ మెదడులోని ఆలోచనలకు అనుగుణంగా కంప్యూటర్‌ను పనిచేయించడం. మనిషి మెదడు ప్రధానంగా రెండు రకాల విధులను నిర్వర్తిస్తుంది.

1) జ్ఞానేంద్రియపరమైన విధులు (సెన్సరీ ఫంక్షన్స్)

2) కదలికలపరమైన విధులు (మోటార్ ఫంక్షన్)

జ్ఞానేంద్రియాలకు, మెదడుకు మధ్య ఉండే అనుసంధానత ద్వారా రుచి, వాసన, స్పర్శ వంటి అనుభూతులను పొందగలం. ఇవి జ్ఞానేంద్రియాలపరంగా మెదడు నిర్వర్తించే సెన్సరీ ఫంక్షన్స్. అదేవిధంగా కళ్లు తెరవడం, నడవడం, చేతులు కదపడం వంటి మానవ శరీర కదలికలు ఆయా అవయవాలకు, మెదడుకు మధ్య గల అనుసంధానత వల్ల సాధ్యపడతాయి. ఇవి మెదడు నిర్వర్తించే మోటార్ ఫంక్షన్స్.


ఈవిధంగా మనిషి కదలికలు, అనుభూతులు, శరీరంలో ఉత్పత్తయ్యే హార్మోన్ల వంటి వివిధ రసాయనిక చర్యలన్నింటికీ మెదడు ఆయా అవయవాలకు ఇచ్చే సంకేతాలే కారణం. ఒక అధునాతన వైర్‌లెస్ చిప్‌ను మెదడులో అమర్చడం ద్వారా ఆ చిప్‌లోని ఎలక్ట్రోడ్స్ మెదడు ఇచ్చే సంకేతాలను గ్రహించి, అనుసంధానిత వస్తువులతో కమ్యూనికేషన్ జరుపుతాయి. ఇంటర్నెట్ అనుసంధానత గల ఏ పరికరాన్ని అయినా ఈ కమ్యూనికేషన్ విధానంలో వైర్‌లెస్‌గా, కేవలం మెదడులో జరిగే ఆలోచనల ద్వారా నియంత్రించవచ్చు.

టెలీపతి ప్రాజెక్టులో భాగంగా చిప్ అమర్చిన వ్యక్తి మెదడులోని ఆలోచనల ద్వారా కంప్యూటర్

మస్తిష్క నాడీవ్యవస్థలో కీలకమైన వెన్నెముక దెబ్బతినడం, పక్షవాతం, ఆటిజం వంటి సమస్యల వల్ల కదలికల పరమైన సమస్యలు గల వ్యక్తులకు ఈ పరిశోధన ఒక వరమని చెప్పవచ్చు.

అంతేకాక భవిష్యత్తులో ఈ 'బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్' రంగంలో మరిన్ని ఆవిష్కరణలు సాధ్యపడి సరికొత్త పరికరాల సృష్టి ద్వారా నడవలేనివారు నడవవచ్చు, వినలేనివారు, మాట్లాడలేనివారు, చూడలేనివారు, ఆ పనులను సైతం చేయవచ్చు. అదేవిధంగా ఎంటర్‌టైన్‌మెంట్ రంగం కూడా కొత్త పుంతలు తొక్కే అవకాశముంది. ఇప్పటివరకూ త్రీడీ, వర్చువల్ అనుభూతులను పొందిన ప్రేక్షకులు ఇకపై ఈ కొత్త సాంకేతికతకు సెన్సరీ ఫంక్షన్స్ జత అయితే అనుభవపూర్వక ఆస్వాదనలూ పొందవచ్చు. రుచి, వాసన, బాధ, స్పర్శ వంటి భావోద్వేగ అనుభూతులు అందివస్తాయి. అయితే ప్రస్తుతం కేవలం కదలికలకు సంబంధించిన మోటార్ ఫంక్షన్స్‌లో వైద్యపరమైన ప్రయోగాలకు మాత్రమే అనుమతి ఉంది. ఈ పరిజ్ఞానం ద్వారా ఎదురయ్యే సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఇతరత్రా ప్రయోగాలకు ప్రస్తుతం అమెరికా ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. ప్రయోజనాల మాట అటుంచితే అనేక సమస్యలను ఈ సరికొత్త టెక్నాలజీ ఆహ్వానిస్తోంది. కేవలం మానవ మస్తిష్కంలో మాత్రమే ఇంతవరకూ గోప్యత సాధ్యమవుతూ వచ్చింది.

> ఇంటర్నెట్ అనుసంధానత గల ఏ పరికరాన్ని అయినా ఈ కమ్యూనికేషన్ విధానంలో వైర్‌లెస్‌గా, కేవలం మెదడులో జరిగే ఆలోచనల ద్వారా నియంత్రించవచ్చు.



> భవిష్యత్తులో ఈ 'బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్' రంగంలో మరిన్ని ఆవిష్కరణలు సాధ్యపడి సరికొత్త పరికరాల సృష్టి ద్వారా నడవలేనివారు నడవవచ్చు, వినలేనివారు, మాట్లాడలేనివారు, చూడలేనివారు, ఆ పనులను సైతం చేయవచ్చు. అదేవిధంగా ఎంటర్‌టైన్‌మెంట్ రంగం కూడా కొత్త పుంతలు తొక్కే అవకాశముంది. ప్రాకృతిక స్వాభావికతకు విభిన్నంగా 'త్రిశంకు స్వర్గాన్ని' పోలిన ప్రతిసృష్టిని మున్ముందు ఉంచవచ్చు. అయితే అనుకూలతలతో పాటు ప్రతికూలతలు కూడా మెండుగానే ఉంటాయి.



ఈ టెక్నాలజీ ద్వారా ఇకపై అంతరంగిక గోప్యత సాధ్యపడకపోవచ్చు. నేరపరిశోధన వంటి కొన్ని విషయాలకు, లైవ్ డిటెక్టర్ వలె ఇది ఉపయోగపడినప్పటికీ, వ్యక్తిగత స్వేచ్ఛకు భారీ ప్రమాదం పొంచి ఉంది. ఆధార్‌లోని బయోమెట్రిక్ సమాచారాల చౌర్యం ద్వారా అనేక నేరాలు జరుగుతున్న ఈ తరుణంలో మనసులోని గుట్టును సైతం వెలికితీయగల అవకాశం ఉన్న ఈ టెక్నాలజీతో జరగనున్న దారుణాలు ఊహాతీతంగా చెప్పుకోవచ్చు.

మనిషి చిప్ అమర్చుకున్న మస్తిష్కం ద్వారా వివిధ పరికరాలను వైర్‌లెస్‌గా, అంతర్జాల అనుసంధానతతో పనిచేయించడం అంటే అనేక నేరాలు చేతికి మట్టి అంటకుండా పూర్తి చేసేయడానికి సైతం అవకాశం చిక్కినట్లే.

ఇదేవిధంగా వ్యక్తుల మస్తిష్కాల మధ్య ఈ చిప్ అనుసంధానత ఏర్పరిస్తే సరికొత్త కమ్యూనికేషన్ సిస్టమ్ సైతం ఏర్పడుతుంది. దీని ప్రయోజనాలు, నష్టాలు కూడా ఊహాతీతంగానే ఉంటాయి. నయా బానిసత్వం, నయా ఉగ్రవాదం వంటి సరికొత్త ధోరణులు సైతం ఆవిర్భవించవచ్చు. ఒక వ్యక్తి ఆలోచనలు తెలుసుకోగలిగే అవకాశం ఉండటంతో మానవ సంబంధాలు దెబ్బతినవచ్చు.

జంతువుల మెదళ్లలో సైతం ఈ చిప్‌లను ప్రయోగాత్మకంగా అమర్చి న్యూరాలింక్స్ సంస్థ పరిశీలించింది. ఒక కోతి వీడియో గేమ్‌ను ఆడగలిగింది. ఈవిధంగా ఈ పరిశోధనలు మరింత ముందుకువెళితే జంతువులు సైతం కృత్రిమ మేధతో అనుసంధానించడం ద్వారా వాటి ప్రవర్తనలో మార్పులు వస్తాయి. ప్రాకృతిక స్వాభావికతకు విభిన్నంగా 'త్రిశంకు స్వర్గాన్ని' పోలిన ప్రతిసృష్టిని మున్ముందు ఉంచవచ్చు.

అనేక వ్యాధులు, వైకల్యాలపరంగా వరం అయిన ఈ సాంకేతికత, మానవ సంబంధాలు, అఘాయిత్యాలపరంగా మాత్రం మానవాళికి శాపంగా పరిణమించే అవకాశం ఉంది. క్లోనింగ్ వంటి జీవశాస్త్ర సాంకేతికతలను నియంత్రించినవిధంగానే ఈ బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్‌ను, వైద్యపరమైన ప్రయోజనాలకు మాత్రమే అనుమతించడం వల్ల మానవాళి ప్రమాదంలో పడకుండా ఉంటుంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

రాష్ట్ర ప్రభుత్వాల పరిపాలన ప్రణాళికలు, ఆచరణ ప్రక్రియలు నిర్వహించే అత్యున్నత ఉద్యోగి బృందం గ్రూప్-1 సర్వీసులకు సంబంధించిన నోటిఫికేషన్‌ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) జారీ చేసింది. అనేక లోపాలు, నిర్వహణ వైఫల్యాలతో కూడిన పాత నోటిఫికేషన్ రద్దయి, దాని స్థానంలో కొత్త ప్రకటన విడుదలైంది.

గ్రూప్-1 ప్రిపరేషన్ ఇలా



సుదీర్ఘకాలంగా ప్రిపరేషన్‌లో ఉన్న అభ్యర్థులతో పాటు కొత్తగా అవకాశం పొందిన వారికి కూడా ఈ నోటిఫికేషన్ అవకాశం కల్పించింది. ఈ నేపథ్యంలో... నోటిఫికేషన్‌లోని ప్రాథమిక సమాచారాన్ని పరిచయం చేయడం, ప్రిపరేషన్ విధానాన్ని తెలియజేయడం, అభ్యర్థులకు అవసరమైన భవిష్యత్ ప్రణాళికను అందజేయడం ఈ వ్యాసం ఉద్దేశం.

పోస్టుల వారీగా ఖాళీలు

పోస్టులు	ఖాళీలు	వయసు
డిప్యూటీ కలెక్టర్	45	18-46
డీఎస్‌పీ	115	21-35
కమర్షియల్ టాక్స్ ఆఫీసర్	48	18-46
రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్	04	21-46
జిల్లా పంచాయతీ ఆఫీసర్	07	18-46
జిల్లా రిజిస్ట్రార్	06	18-46
డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ జైల్స్	05	18-35
అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్	08	18-46
అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్	30	21-35
మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-2	41	18-46
డిస్ట్రిక్ట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్	03	18-46
డిస్ట్రిక్ట్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ వెల్ఫేర్ ఆఫీసర్	05	18-46
డిస్ట్రిక్ట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్	02	18-46
డిస్ట్రిక్ట్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్	05	18-46
అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ హెల్త్	20	18-46
అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్	38	18-46
అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్	41	18-46
ఎంపీడీవో	140	18-46

ప్రిపరేషన్ విధానం

రాష్ట్రస్థాయి పరీక్షలలో గ్రూప్-1 పతాక స్థాయి పరీక్ష. ఈ పరీక్షలో విజయం కోసం అభ్యర్థులు సంవత్సరాల తరబడి సంసిద్ధం అవుతుంటారు. నిరంతర అధ్యయనం, విశ్లేషణ సామర్థ్యం, రచన నైపుణ్యం విజయానికి అవసరమైన అంశాలు. ఈ నేపథ్యంలో...కింద పేర్కొన్న సోపానాలు గ్రూప్-1 విజయానికి శాస్త్రీయంగా దోహదపడతాయి.

● సోపానం-1: సిలబస్ అవగాహన - అవసరమైన పుస్తకాలు/మెటీరియల్ సేకరణ

అభ్యర్థులు సిలబస్‌పై పట్టు సాధించకుండా, అవసరమైన పుస్తకాలు సేకరించకుండా విజయాన్ని ఆస్వాదించలేరు. సిలబస్‌లోని ప్రతి టాపిక్‌పై కనీస అవగాహన ఉండేలా ప్రిపేర్ కావాలి. అదేవిధంగా సిలబస్ ప్రకారం పుస్తకాలు/మెటీరియల్ సేకరించుకోవాలి. సిలబస్‌లోని స్థిరమైన అంశాలకు, ప్రతి రోజూ వార్తా పత్రికల్లో వచ్చే డైనమిక్ అంశాలను జోడించగలగాలి. నిష్ణాతులైన అధ్యాపకులు లేదా గతంలో విజయాన్ని సాధించిన అభ్యర్థుల సలహాలు, సూచనల మేరకు మెటీరియల్‌ను సేకరించుకునే ప్రయత్నం చేయడం అవసరం. ప్రామాణిక పుస్తకాల ఎంపికలోనే సగం విజయం అంతర్భాగంగా ఉంటుంది.

● సోపానం-2: ప్రిలిమ్స్, మెయిన్స్ కలిపి ప్రిపేర్ కావాలి

చాలా మంది పరీక్షార్థులు ప్రిలిమ్స్‌కు, మెయిన్స్‌కు వేర్వేరుగా ప్రిపేర్ అవుతుంటారు. వాస్తవానికి టీఎస్‌పీఎస్సీ సిలబస్‌లోనే రెండు స్థాయుల పరీక్ష కోసం కామన్ అంశాలు ఉన్నాయి. కాబట్టి అభ్యర్థులు తమ ప్రిపరేషన్‌లో ప్రిలిమ్స్ సహా మెయిన్స్ కోసం కూడా సంసిద్ధం కావాలి.

● సోపానం-3: సొంత నోట్స్ రాసుకోవడం

గ్రూప్-1 కోసం ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు తప్పనిసరిగా స్వదస్తూరితో నోట్స్ ప్రిపేర్ చేసుకోవాలి. రాసుకున్న నోట్స్‌ను విశ్లేషణ చేసుకోగలిగే నైపుణ్యాలను సంతరించుకోవాలి. చక్కటి అక్షరాలతో కూడిన దస్తూరి అవసరమే గాని, కేవలం అది మాత్రమే విజయానికి ఏకైక సోపానం కాదు.

లైబ్రరీ, రీడింగ్ రూములలో షార్ట్‌గా రాసుకున్న నోట్స్‌ను ఒక వ్యాస రూపంలోకి మార్చే సాధన చేయగలగాలి. విశ్లేషణ, వివరణ, వర్ణన ప్రిపరేషన్‌లో భాగంగా చూడగలగాలి.

గ్రూప్-1 2024 ప్రత్యేకతలు

సాధారణంగా ఏ రాష్ట్ర లేదా గతంలోని గ్రూప్-1 నోటిఫికేషన్లతో పోల్చినా... 2024 నోటిఫికేషన్‌లో కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి.

- 563 పోస్టులతో కూడిన భారీ నోటిఫికేషన్. గతంతో పోల్చినా.. ఇతర రాష్ట్రాల నోటిఫికేషన్స్‌తో పోల్చినా... ఇది భారీ స్థాయిలో పోస్టులను కలిగి ఉంది. జాతీయ స్థాయిలో ఉండే సివిల్స్ నోటిఫికేషన్‌లో కూడా వేయికి కొంచెం అటూ, ఇటూ పోస్టులు ఉంటుంది. ప్రస్తుత గ్రూప్-1 నోటిఫికేషన్ ఒక్క తెలంగాణాకు సంబంధించే అందులో సగంపైగా ఉందంటే భారీ నోటిఫికేషన్ కింద పరిగణించాలి.
- వయోపరిమితి సడలింపు ఈ నోటిఫికేషన్ మరో ప్రత్యేకత. తెలంగాణ రాష్ట్రంలోని గ్రూప్-1 అభ్యర్థులు గత బోర్డు తప్పిదాల వల్ల రెండేళ్ల అమూల్యమైన కాలాన్ని కోల్పోయారు. ఆ తప్పిదాన్ని సవరిస్తూ... ఈసారి వయోపరిమితిని రెండేళ్లు పొడిగించారు. యూనిఫామ్ సర్వీసులకు కూడా మరో రెండు సంవత్సరాలు మినహాయింపు ఇవ్వడం సరైన నిర్ణయం.
- ఫ్రెష్ గ్రాడ్యుయేట్స్‌కి ఇది అమూల్యమైన అవకాశం. వాస్తవానికి గత నోటిఫికేషన్ విడుదల సమయంలో డిగ్రీ ఫైనల్ ఇయర్ పరీక్షల ఫలితాలు ఆలస్యంగా రావడం వల్ల చాలా మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కోల్పోయారు. అలా అవకాశాన్ని కోల్పోయిన వారు ఈసారి తిరిగి పొందగలిగారు.
- టీఎస్‌పీఎస్సీ గతంలో చేసిన తప్పిదాలను సరిచేసుకునే అవకాశం కొత్తగా ఏర్పాటైన బోర్డు సభ్యులకు లభిస్తుంది.

● సోపానం-4: వార్తా పత్రికల కథనాలు, ఎడిటోరియల్స్ పరిశీలించడం

సాధారణంగా నిష్ణాతులు, సబ్జెక్ట్ నిపుణులు వివిధ అంశాలపై సమగ్రమైన సమాచారంతో వివిధ పత్రికల్లో వ్యాసాలు రాసి జనబాహుళ్యంలోకి తీసుకువస్తారు. వాటిని పరిశీలించే ప్రయత్నాన్ని అభ్యర్థులు చేయగలగాలి.

యోజన, వీక్షణం, తెలంగాణ మాస పత్రిక, ఆంధ్రజ్యోతి ఎడిటోరియల్స్, వివిధ ప్రభుత్వ శాఖల సమాచార బులెటిన్స్‌ను చదవగలగాలి.

● సోపానం-5: సమకాలీన సమాచారంపై అప్‌డేట్‌గా ఉండటం

జ్ఞానం నిరంతర చైతన్యవంతమైన ప్రవాహం. సిలబస్‌లోని అంశాలకు మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా విస్తరిస్తున్న జ్ఞానాన్ని అనుసంధానం చేయగలగాలి.

న్యూస్‌పేపర్ రీడింగ్, టీవీ చర్చలు, ప్రభుత్వ బులెటిన్స్ నిరంతరం సమాచార సాధన కోసం ఉపయోగపడతాయి.

● సోపానం-6: మెంటార్ ఎంపిక లేదా మార్గదర్శి సూచిక

సాధారణంగా అభ్యర్థులు స్వీయ ప్రిపరేషన్‌కు ప్రాధాన్యం ఇస్తారు. ఇది ఉత్తమమైన విధానమే! అయినప్పటికీ సబ్జెక్టుపై అవగాహన ఉన్న అధ్యాపకులు, లేదా గతంలో సక్సెస్ సాధించిన సీనియర్ల సలహా తీసుకుని ప్రిపేర్ కావడం వల్ల సమయం ఆదా అవుతుంది. మార్గం సులభం అవుతుంది.

అభ్యర్థులు తమ ప్రిపరేషన్‌లో నూతన అంశాలను భాగంగా చేసుకోవాలి. విస్తరిస్తున్న సమాజ పరిణామక్రమాన్ని శాస్త్రీయంగా తెలుసుకోవాలి. గ్రూప్-1 అభ్యర్థులు సమాచార సేకరణ కన్నా...విషయ వివరణకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. గత సివిల్ సర్వీసెస్ ప్రశ్న పత్రాలను పరిశీలించాలి. వాటికనుగుణంగా సమాధానాలు రాసే ప్రయత్నం చేయాలి. ప్రతి ప్రశ్న ఏ రకమైన సమాధానాన్ని ఆశిస్తుందో ఆ విషయాన్ని గ్రహించ గలిగే సామర్థ్యాలను పెంచుకోవాలి.

ప్రాథమిక సమాచారం

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 563
- **దరఖాస్తుకు చివరి తేదీ:** 2024 మార్చి 14
- **ప్రిలిమ్స్ తేదీలు:** 2024 మే/జూన్
- **మెయిన్స్ తేదీలు:** 2024 సెప్టెంబరు/అక్టోబరు
- **ఫీజు వివరాలు:** గత దరఖాస్తుదారులకు మినహాయింపు ఉంటుంది. కొత్త వారికి రూ.200
- **ఎడిట్ ఆప్షన్:** మార్చి 23 నుంచి 27 వరకు
- **పరీక్ష విధానం:** ప్రిలిమ్స్ ఆబ్జెక్టివ్ విధానంలో, మెయిన్స్ వివరణాత్మక సమాధాన పద్ధతిలో
- **రిజర్వేషన్:** 95 శాతం స్థానికత
- **మెయిన్స్ ఎంపిక:** ప్రతి పోస్టుకు ప్రిలిమ్స్ నుంచి 50 మంది ఎంపిక
- **ప్రిలిమ్స్ పరీక్ష మార్కులు:** 150
- **మెయిన్స్ పరీక్ష మార్కులు:** 900
- **ఇంటర్వ్యూ:** లేదు
- **వయోపరిమితి:** సాధారణ సర్వీసులకు 18-46; యూనిఫామ్ సర్వీసులకు 21-35(వివిధ సామాజిక వర్గాలకు ప్రత్యేక మినహాయింపు).

ముగింపు

వాస్తవానికి తమ జీవితకాలంలో చాలా మంది అభ్యర్థులకు గ్రూప్-1 రాసే అవకాశంఒకటి లేదా రెండు సార్లు మాత్రమే లభిస్తుంది. గత దశాబ్దకాలంలో ఒక్క గ్రూప్-1 నోటిఫికేషన్ కూడా వెలువడలేదు. ప్రస్తుత బోర్డు కొన్ని పోస్టులను పెంచడం ఆహ్వానించాల్సిన పరిణామం. ఈ అవకాశాన్ని అభ్యర్థులు వినియోగించుకుని విజయాన్ని సాధించే ప్రయత్నం చేయాలి.




డాక్టర్ రియాజ్
సీనియర్ ఫ్యాకల్టీ, అకడమిక్ డైరెక్టర్,
5 మంత్ర కెరీర్ పాయింట్, హైదరాబాద్

మిస్సింగ్ నంబర్ టెస్ట్

టీఎస్‌పీఎస్సీ/ ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

పార్ట్-2

1. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 12 బి) 13 సి) 18 డి) 15


సమాధానం: (డి)

వివరణ: మొదటి డయాగ్రామ్‌లో 12 - 4 = 8, 9 - 3 = 6 (8 + 6 = 14)

రెండో డయాగ్రామ్‌లో 8 - 5 = 3, 23 - 15 = 8 (3 + 8 = 11)

కాబట్టి మూడో డయాగ్రామ్‌లో 16 - 13 = 3, 18 - 6 = 12 (3 + 12 = 15)

2. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 60 బి) 56 సి) 48 డి) 36

సమాధానం: (సి)

వివరణ: ప్రతి డయాగ్రామ్‌లో పైన కుడివైపు గల సంఖ్యను 4తో గుణిస్తే ఎడమ వైపు సంఖ్య, 6తో గుణిస్తే డయాగ్రామ్‌కు కింద గల సంఖ్యగా వస్తుంది.

14 x 4 = 56 8 x 4 = 32

14 x 6 = 84 8 x 6 = 48

కావున 12 x 4 = 48, 12 x 6 = 72



3. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?


6	12	9
8	7	6
14	19	?

ఎ) 12 బి) 15 సి) 54 డి) 22

సమాధానం: (బి)

వివరణ: నిలువుగా 6 + 8 = 14, 12 + 7 = 19 కాబట్టి 9 + 6 = 15 సమాధానం అవుతుంది.

4. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?




ఎ) 261 బి) 216 సి) 48 డి) 252

సమాధానం: (బి)

వివరణ: సరళ రేఖలు ఒకపక్క చిన్న సంఖ్య. మరొక పక్క ఆ చిన్న సంఖ్య ఘనం.

$3^3=27$, $5^3=125$, $4^3=64$. కావున $6^3=216$

5. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 10 బి) 15 సి) 18 డి) 16

సమాధానం: (ఎ)

వివరణ: పై డయాగ్రామ్‌లో రెండు అంకెల లబ్దం నుంచి కింద రెండు అంకెల మొత్తాన్ని తీసివేస్తే చిన్న వృత్తంలో గల సంఖ్య వస్తుంది.


8 x 6 = 48 10 + 12 =22 48 - 22 = 26

9 x 7 = 63 13 + 14 = 27 63 - 27 = 36

కాబట్టి 4 x 9 = 36 11 + 15 = 26

36 - 26 = 10 సమాధానము అవుతుంది.

6. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 25 బి) 24 సి) 18 డి) 27

సమాధానం: (ఎ)

వివరణ: వృత్తానికి నాలుగువైపుల గల సంఖ్యలు వివిధ అంకెల వర్గాలు. ఆయా అంకెలను కూడిన వృత్తంలో గల సంఖ్య వస్తుంది

64 అంటే 8^2, 25 అంటే 5^2, 36 అంటే 6^2, 81 అంటే 9^2.

8 + 5 + 6 + 9 = 28

49 అంటే 7^2, 36 అంటే 6^2, 25 అంటే 5^2, 16 అంటే 4^2.

7 + 6 + 5 + 4 = 22 అదే విధంగా

49 అంటే 7^2, 36 అంటే 6^2, 16 అంటే 4^2, 64 అంటే 8^2.

7 + 6 + 4 + 8 = 25 సమాధానం అవుతుంది.

7. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 196 బి) 162 సి) 289 డి) 361

సమాధానం: (ఎ)

వివరణ: 8 + 4 = 12 $12^2 = 144$

6 + 2 = 8 $8^2 = 64$

7 + 2 = 9 $9^2 = 81$ అదే విధముగా

9 + 5 = 14 14^2 = 196 సమాధానం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ


గజ్వేల్‌లో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతున్న కిషన్ రెడ్డి

చేసేదే చెప్తాం... చెప్పిందే చేస్తాం

» కాంగ్రెస్ మాదిరిగా గారడి మాటలు చెప్పం: కిషన్‌రెడ్డి

గజ్వేల్, ఫిబ్రవరి 25: కాంగ్రెస్ మాదిరిగా తాము గారడి మాటలు చెప్పమని.. చేసేదే చెబుతాం.. చెప్పిందే చేస్తామని కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఇప్పుడున్న 40 సీట్లు కూడా రావని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో ఓటమి తర్వాత మూడు నెలలు విహార యాత్రకు వెళ్లిన రాహుల్ గాంధీ ఈసారి ఏడాది వెళతారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో 17 ఎంపీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని, ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ ఈసారి పార్లమెంట్‌కు రాకుండా చెయ్యాలని కోరారు. ఈ మేరకు సిద్దిపేట జిల్లా గజ్వేల్, మెదక్ జిల్లా తూప్రాన్‌లో ఆదివారం నిర్వహించిన బీజేపీ విజయసంకల్ప యాత్ర బహిరంగ సభల్లో కిషన్ రెడ్డి మాట్లాడారు. గత ఎన్నికల అనంతరం రాహుల్ గాంధీ మూడు నెలలు విదేశాలకు విహారయాత్రకు వెళ్లాడని, ఈ ఎన్నికల తర్వాత ఏడాది పాటు వెళ్లి బీచ్‌ల్లో నిక్కర్లు వేసుకుని తిరుగుతాడని ఎద్దేవా చేశారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో రూ.12లక్షల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టిందని ఆరోపించారు. డీఎన్ఏలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనని అన్నారు. కేసీఆర్, కేటీఆర్ అహంకారం, అవినీతి, అరాచక పాలనపై విసుగుచెందిన ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేశారు కానీ ఆ పార్టీపై ప్రజలకు ప్రేమ లేదన్నారు. దేశాభివృద్ధి, భావితరాల ప్రగతి కోసం బీజేపీ ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

కిషన్‌రెడ్డి, సంజయ్, అర్వింద్‌కు టికెట్లు ఓకే!

» బాపురావుకు టికెట్ అంశంపై పెండింగ్

» 3 రోజుల్లో10 స్థానాలకు బీజేపీ అభ్యర్థుల ప్రకటన!

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీఆర్ఎస్‌తో పొత్తుపై ఊహాగానాలకు తెరదీస్తూ బీజేపీ జాతీయ నాయకత్వం మరింత స్పష్టత ఇచ్చే ప్రయత్నం చేసింది. ఈ మేరకు ఢిల్లీలో జరిగిన కీలక సమావేశంలో రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాల్లో అభ్యర్థిత్వాలపై శనివారం రాత్రి బీజేపీ పెద్దలు సమీక్షించారు. పార్టీ పార్లమెంటరీ బోర్డు సమావేశంలో చర్చించిన అనంతరం తొలి జాబితాను ఈనెల 29న లేదా వచ్చే నెల 1న ప్రకటించనున్నారు. ఇందులో పదికి పైగా స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించే అవకాశాలున్నాయి. సిటింగ్ ఎంపీల్లో సికింద్రాబాద్ నుంచి జి.కిషన్‌రెడ్డి, కరీంనగర్ నుంచి బండి సంజయ్, నిజామాబాద్ నుంచి ధర్మపురి అర్వింద్‌కు టికెట్లు ఖరారైనట్లు తెలిసింది. ఇక, ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావుకు టిక్కెట్ కేటాయించే అంశం పెండింగ్‌లో ఉంచారని, పార్టీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. నాగర్‌కర్నూలు నుంచి ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న బీఆర్ఎస్ సిటింగ్ ఎంపీ రాములు త్వరలో బీజేపీలో చేరుతారని ప్రచారం జరుగుతోంది. దీంతో, ఆయనకు లేదా ఆయన తనయుడు భరత్‌కు బీజేపీ టికెట్ కేటాయించనున్నారని పార్టీవర్గాలు పేర్కొంటున్నాయి. మహబూబ్‌నగర్ నుంచి డీకే అరుణ, ఏపీ జితేందర్‌రెడ్డి, చేవెళ్ల- కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, భువనగిరి- బూర నర్సయ్యగౌడ్, మనోహర్‌రెడ్డి, హైదరాబాద్- మాధవీలత లేదా ఉమామహేందర్, మల్కాజిగిరి-ఈటల, మల్కా కొండయ్య, మురళీధర్‌రావు, వీరేందర్‌గౌడ్, చాడ సురేశ్‌రెడ్డి, మెదక్ నుంచి అంజిరెడ్డి లేదా రఘునందన్‌రావు పేర్లపై చర్చించినట్లు పార్టీ వర్గాలు వివరించాయి. జహీరాబాద్, పెద్దపల్లి, మహబూబాబాద్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ నియోజకవర్గాలకు అభ్యర్థులను మలివిడత జాబితాలో ప్రకటించే అవకాశం ఉందని తెలిపాయి. కాగా, అభ్యర్థుల ఎంపికపై పార్టీ పార్లమెంటరీ బోర్డు, ఎన్నికల కమిటీ సమావేశం జరగలేదని, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జ్ ఎన్వీ సుభాష్ ఆదివారం తెలిపారు. బీజేపీ అభ్యర్థుల ఎంపిక జరిగినట్లు పలు టీవీ చానళ్లు, పత్రికలు, సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న ప్రచారం సత్యదూరమని ఆయన పేర్కొన్నారు.

మీడియా అకాడమీ చైర్మన్‌గా కె.శ్రీనివాస్‌రెడ్డి

» శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా జర్నలిస్టుల ఉద్యమ నాయకుడు, ఐజేయూ అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం ఆదివారం విడుదల చేసింది. శ్రీనివాస్‌రెడ్డి ఈ పదవిలో రెండేళ్లు ఉంటారు. అయిదు దశాబ్దాలకుపైగా జర్నలిజంలో ఉన్న శ్రీనివాస్‌రెడ్డి రాష్ట్ర, జాతీయ స్థాయిలో జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ ఉద్యమాల్లో క్రియాశీల పాత్ర పోషిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రెస్ అకాడమీ వ్యవస్థాపక చైర్మన్‌గా 1996 ఫిబ్రవరి 22 నుంచి 1998 ఫిబ్రవరి 21 వరకు పని చేశారు. నల్లగొండ జిల్లా నార్కెట్‌పల్లి మండలం పల్లెపహాడ్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డి విశాలాంధ్ర పత్రికలో రిపోర్టర్‌గా జర్నలిజం వృత్తిలో ప్రవేశించారు. ప్రస్తుతం ప్రజాపక్షం పత్రిక సంపాదకులుగా వ్యవహరిస్తున్నారు. కాగా, మీడియా అకాడమీ చైర్మన్‌గా నియమితులైన కె.శ్రీనివాసరెడ్డికి సీఎం రేవంత్ శుభాకాంక్షలు తెలిపారు. కొత్తచైర్మన్ జర్నలిస్టుల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాలని ఆకాంక్షించారు. అలాగే, శ్రీనివాస్‌రెడ్డి నియామకం పట్ల టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ హర్షం వ్యక్తం చేశారు.

నూతన విద్యుత్ పాలసీలు రూపొందిస్తాం

» రాష్ట్రానికి గుదిబండగా బీటీపీఎస్: భట్టి విక్రమార్క

» సోలార్ పవర్‌పై సింగరేణి దృష్టి పెట్టాలి: తుమ్మల

కొత్తగూడెం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మరిన్ని విద్యుత్ ప్రాజెక్టులు నెలకొల్పేందుకు నూతన పాలసీలు రూపొందిస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో రూ.56 కోట్లతో నిర్మించిన 10.5 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి భట్టి విక్రమార్క ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో భట్టి మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి, సరఫరాలో సమస్యలు లేకుండా చూసేందుకు నూతన పాలసీలు తీసుకువస్తామని తెలిపారు. సింగరేణి పరిధిలో ఉన్న ఖాళీ భూముల్లో సోలార్ పవర్ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని.. అందుకోసం యాజమాన్యం ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భద్రాద్రి, యాదాద్రి పవర్ ప్రాజెక్టులు చేపట్టినా వాటి నుంచి పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించలేకపోయారని అన్నారు. భద్రాద్రి థర్మల్ పవర్‌స్టేషన్ రాష్ట్రానికి గుదిబండగా మారిందన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి పై సింగరేణి మరింత ఫోకస్ పెట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. సాగుకు పనికిరాని, సింగరేణి భూముల్లో సోలార్ విద్యుత్ ప్రాజెక్టులను నెలకొల్పాలని కోరారు.


సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో తుమ్మల

మళ్లీ డిప్యుటేషన్ల దందా!

వైద్యశాఖలో అక్రమార్కులకు వరంగా మారిన సర్కారు ఆదేశాలు

» గతంలో హెచ్‌వోడీలకే అధికారం

» తాజాగా డీఎంహెచ్‌వోలకు దఖలు

» అత్యవసరం పేరిట పాతోళ్లకే ఆర్డర్లు

» ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షల వసూలు



హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో మళ్లీ డిప్యుటేషన్ల దందా మొదలైంది.! వర్క్ఆర్డర్లను రద్దుచేస్తూ ఈ నెల 7న వైద్య ఆరోగ్య శాఖ ఇచ్చిన ఉత్తర్వులు జిల్లా వైద్యాధికారుల(డీఎంహెచ్‌వో)కు వరంగా మారింది. ఆ ఉత్తర్వుల్లోని ఒక చిన్న అంశాన్ని అడ్డుపెట్టుకుంటున్న కొందరు డీఎంహెచ్‌వోలు.. డిప్యుటేషన్ల దందాకు తెరతీసి, లక్షల రూపాయలను వెనకేసుకునేందుకు సిద్ధమయ్యారు. సర్కారు జీవోలో "వైద్య సేవలకు అంతరాయం కలిగే పరిస్థితుల్లో జిల్లా స్థాయిలోనే డిప్యుటేషన్లు, వర్క్ ఆర్డర్లను ఇచ్చుకోవచ్చు. అయితే.. దానికి సంబంధిత జిల్లా కలెక్టర్ అనుమతి తప్పనిసరి" అని పేర్కొన్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని, డిప్యుటేషన్లు రద్దయినా.. 60% మంది అదే స్థానంలో తిష్టవేసేలా కొందరు డీఎంహెచ్‌వోలు దందా మొదలుపెట్టారని వైద్యఆరోగ్య శాఖ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

'అత్యవసరం' పేరుతో..

జిల్లా స్థాయిలో ప్రభుత్వాస్పత్రుల్లో అత్యవసర పరిస్థితుల్లో డిప్యుటేషన్స్ అధికారాన్ని తాజా జీవో డీఎంహెచ్‌వోలకు కట్టబెట్టింది. బీఆర్ఎస్ హయాంలోనూ ఇదే పద్ధతి ఉండేది. కొందరు డీఎంహెచ్‌వోలు ఇష్టారాజ్యంగా డిప్యుటేషన్స్ ఇచ్చేశారు. దాంతో గత సర్కారు వారి అధికారాలకు కత్తెర వేస్తూ.. ఆ బాధ్యతలను రాష్ట్రస్థాయి విభాగాధిపతుల(హెచ్‌వోడీల)కే కట్టబెట్టింది. జీవో నంబరు 317లో నష్టపోయిన వారి విషయంలో గత సర్కారు డిప్యుటేషన్లకు అవకాశమిచ్చింది. కొత్త సర్కారు వాటిని రద్దుచేసింది. ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుని నెలరోజులు కూడా గడవక ముందే.. ఈ నెల 7న జారీ అయిన జీవోను కొందరు డీఎంహెచ్‌వోలు వరంగా మార్చుకున్నారు. 'అత్యవసరం' పేరిట ఇప్పటికే పాతుకుపోయిన వారితో పాటు.. అస్మదీయులను కీలక పోస్టుల్లోకి తీసుకువచ్చేందుకు డిప్యుటేషన్స్‌ను ఆయుధంగా వాడుతున్నారు. డాక్టర్లు, స్టాఫ్‌నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, ఏఎన్ఎమ్‌లు, సెకండ్ ఏఎన్ఎమ్‌లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, అటెండర్లు ఇలా హోదాను బట్టి.. డిప్యుటేషన్లు ఓకే చేయించేందుకు కొందరు డీఎంహెచ్‌వోలు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వైద్య ఆరోగ్యశాఖలో వెల్లువెత్తుతున్నాయి.

మచ్చుకు కొన్ని ఉదాహరణలు..

సర్కారు గత నెలలో తీసుకున్న నిర్ణయంతో.. ఉత్తర తెలంగాణలోని ఓ ఏజెన్సీ జిల్లా కేంద్రంలో పని చేస్తున్న 26 మంది డిప్యుటేషన్లు రద్దయ్యాయి. అయినా.. వారు పాత స్థానంలోనే పనిచేస్తున్నారు.ఇప్పుడు వారందరి డిప్యుటేషన్లను 'అత్యవసరం' పేరిట జిల్లా కేంద్రంలోనే కొనసాగించేందుకు స్థానిక డీఎంహెచ్‌వో సిద్ధమయ్యారు. ఒక్కొక్కరి నుంచి ముడుపులు అందాక.. వారి జాబితాను జిల్లా కలెక్టర్‌కు పంపారు. దక్షిణ తెలంగాణలోని ఓ జిల్లా డీఎంహెచ్‌వో ఏకంగా సెకండ్ ఏఎన్ఎమ్‌లను తన కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా నియమించుకునేందుకు ఓ జాబితాను జిల్లా కలెక్టర్‌కు పంపారు. సింహభాగం జిల్లాల్లో ఇదే దందా నడుస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటి వరకు ఆయా జిల్లాల కలెక్టర్లకు సంబంధిత డీఎంహెచ్‌వోల నుంచి 50 దాకా పేర్లు చేరినట్లు వైద్యఆరోగ్య శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఇంకా పలు జాబితాలు కలెక్టర్లకు చేరాల్సి ఉన్నట్లు సమాచారం.

జోనల్ పోస్టులకూ డిప్యుటేషన్లు?

నిబంధనల ప్రకారం జోనల్ స్థాయి పోస్టులకు డిప్యుటేషన్ ఇచ్చే అధికారం జిల్లా అధికారులకు ఉండదు. అయితే.. సర్కారు తాజా జీవో మాత్రం ఆ అధికారాన్ని కూడా డీఎంహెచ్‌వోలకు దఖలుపరుస్తోంది. కలెక్టర్ అనుమతితో జోనల్ స్థాయి పోస్టులకు కూడా డిప్యుటేషన్ ఇచ్చేందుకు కొందరు డీఎంహెచ్‌వోలు సిద్ధమయ్యారు. నిజానికి కొత్త ప్రభుత్వం డిప్యుటేషన్లు, వర్క్ఆర్డర్లను రద్దు చేయడానికి కూడా ఈ డీఎంహెచ్‌వోల ఒత్తిడే ఉన్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత ప్రభుత్వాన్ని, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించి, కాసుల దందాకు తెరతీసేలా కొత్త జీవోను తెప్పించారనే చర్చ వైద్య ఆరోగ్యశాఖలో కొనసాగుతోంది.



టీఎస్ 'బైపాస్'!

(మొదటిపేజీ తరువాయి)

తెలుసుకునే అవకాశం కల్పించామని ప్రకటించింది. 21 రోజుల్లో అనుమతులు వస్తాయని, ఏ అధికారి వద్దనైనా నిర్ణీత సమయాన్ని దాటి దరఖాస్తు ఆగితే.. ఆ అధికారికి జరిమానా విధించేలా చట్టాన్ని రూపొందించామనీ వెల్లడించింది. అప్పట్లో కొందరు అధికారులకు జరిమానా కూడా విధించారు. 100 నుంచి 500 చదరపు గజాలలోపు స్థలంలో ఇంటి నిర్మాణానికి సంబంధించి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించని అధికారులపై ఈ జరిమానాలు విధించారు. అయితే ఏడు అంతస్తుల నుంచి 58 అంతస్తుల వరకు భవన నిర్మాణ అనుమతులు పొందిన ఫైళ్లను మాత్రం అత్యధికం ఆఫ్‌లైన్‌లోకి మార్చేశారు. టీఎస్‌బీపాస్‌లో దరఖాస్తు చేసిన తర్వాత రెవెన్యూపరమైన అంశాలను పరిశీలించే తహసీల్దార్ స్థాయిలోనే ఫైళ్లను ఆఫ్‌లైన్‌లోకి చేసేశారు. టీఎస్‌బీపాస్ రాకముందు మాదిరిగానే దరఖాస్తులను క్లియర్ చేశారు. ఆఫ్‌లైన్ కావడంతో సరైన పత్రాలు లేకపోయినా నిబంధనల్ని ఉల్లంఘిస్తూ ఉన్నతాధికారులు దస్త్రాలను తెప్పించుకున్నారు. కిందిస్థాయి అధికారులు సరైన పత్రాల్లేవని ఫైలును నిలిపివేసినా.. అప్పటి హెచ్ఎండీఏ డైరెక్టర్ శివబాలకృష్ణ తమకు పంపించాలంటూ ఆదేశాలిచ్చారని, మంత్రిగారు చెప్పారంటూ ఆగమేఘాల మీద అనుమతులిచ్చినట్లు సమాచారం. శివబాలకృష్ణ ఇటీవల ఏసీబీ దాడుల్లో అక్రమాస్తుల కేసులో చిక్కుకొని రిమాండ్‌లో ఉన్న విషయం తెలిసిందే.

అక్రమ అనుమతుల దస్త్రాలు మాయం..

ఏదైనా దరఖాస్తులకు ఆఫ్‌లైన్‌లో అనుమతులిచ్చినా.. ఆ ఫైళ్లను తిరిగి ఆన్‌లైన్‌లోకి మారిస్తే వాటిని భద్రపరిచేందుకు వీలుంటుంది. కానీ ఆఫ్‌లైన్‌లో అనుమతులిచ్చిన ఏ ఒక్క దరఖాస్తునూ ఆన్‌లైన్‌లోకి మార్చలేదని తెలిసింది. ఇటీవల వరుసగా హెచ్ఎండీఏలో ఏసీబీ సోదాలు, వివిధ భవన నిర్మాణ అనుమతులు, లేఅవుట్లు, చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్ అనుమతులపై పూర్తిస్థాయి విచారణ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వమే వివిధ రకాల అనుమతులపై ఏ రోజుకారోజు నివేదికలు అడుగుతోంది. కానీ, చాలావరకు ఫైళ్లు హెచ్ఎండీఏలో మాయమైనట్లు తెలిసింది. అయితే ఇటీవల ఏసీబీ సోదాల్లో శివబాలకృష్ణ పనిచేసిన మాసబ్‌ట్యాంక్‌లోని రెరా ఆఫీసులో పలు హెచ్ఎండీఏ ఫైళ్లు బయటపడినట్లు సమాచారం. కొన్ని ఫైళ్లను మాత్రం అధికారులే మాయం చేశారన్న ఆరోపణలున్నాయి. శివబాలకృష్ణ చేసిన తప్పిదాల మకిలి తమకు కూడా అంటుకుంటుందన్న ఉద్దేశంతో.. కొందరు అధికారులు ఇటీవల ప్రభుత్వం అడిగిన నివేదికల్లో సమాచారం లేదని చెప్పినట్లు తెలిసింది. సంబంధిత ఫైళ్లను తాము అప్పట్లోనే డైరెక్టర్ శివబాలకృష్ణకు పంపామని, ఆ తర్వాత సంబంధిత ఫైళ్లు తిరిగి వెనక్కి రాలేదని చెప్పినట్లు సమాచారం. ఐటీ కారిడార్‌లో భారీ ప్రాజెక్టులు చేపడుతున్న పలు సంస్థలు అనుమతులన్నీ ఆఫ్‌లైన్‌లోనే పొందాయి. కానీ, ఆయా సంస్థల ఫైళ్లు పునఃపరిశీలనకు మాత్రం హెచ్ఎండీఏలో దొరకడం లేదు. 111 జీవో పరిధిలోని పట్టినాగులపల్లికి సంబంధించిన ఫైళ్లు కూడా ఇలాగే మాయమైనట్లు తెలుస్తోంది. పట్టినాగులపల్లిలోని 100 నుంచి 200 ఎకరాల భూములను బయో కన్జర్వేషన్ జోన్ నుంచి మల్టీపర్పస్ జోన్‌లోకి మార్చేందుకు ఎన్నికల ముందు ప్రభుత్వం ఆగమేఘాల మీద చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్ అనుమతులు ఇచ్చింది. ఈపీటీఆర్ఐ నివేదిక ఆధారంగా ఆ మార్పు చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. కానీ, ఈపీటీఆర్ఐ నివేదికను హెచ్ఎండీఏలోని ఏ ప్లానింగ్ అధికారి కూడా చూడలేదని సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంబంధిత ఫైళ్లు రావడంతో జీ హుజూర్.. అంటూ కిందిస్థాయి అధికారులు ఉన్నత స్థాయికి పంపారు. సంబంధిత శాఖ మంత్రి ఆమోదంతో చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్ చేశారు. కానీ, సంబంధిత ఫైళ్లు, ఈపీటీఆర్ఐ నివేదికలన్నీ మాయమైనట్లు తెలుస్తోంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది.

బీజేపీ, బీఆర్ఎస్.. సిద్ధాంతాలు చెప్పే డూప్లికేట్ పార్టీలు

సెక్యులర్ మాటకు కట్టుబడిన నేత రాహుల్.. కిషన్‌రెడ్డి, సంజయ్‌ల మాటకు విలువ లేదు



» కవితకు సీబీఐ నోటీసులు ఓ కొత్త నాటకం

» ఆమె అరెస్టు ఓట్లతో ముడిపడిన అంశం: జగ్గారెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): బీజేపీ, బీఆర్ఎస్‌లు.. సిద్ధాంతాలు చెప్పే డూప్లికేట్ పార్టీలని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి ధ్వజమెత్తారు. ఆ పార్టీలు అవకాశవాద రాజకీయాలు చేస్తుంటాయని, వాటికి సిద్ధాంతాలు ఏమీ లేవని విమర్శించారు. సెక్యులర్ అనే మాటకు కట్టుబడి ఉన్నది రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని తెలిపారు. గాంధీ భవన్‌లో ఆదివారం జగ్గారెడ్డి మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒక కొత్త నాటకానికి తెర లేపాయని అన్నారు. ఆ పార్టీల మధ్య కుదిరిన లోపాయికారీ ఒప్పందంలో భాగంగానే.. కేసీఆర్ కూతురు కవితకు సీబీఐ నోటీసులు జారీ అయ్యాయని చెప్పారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు లాభం చేకూరుతుందని అనుకుంటేనే కవితను అరెస్టు చేస్తారని పేర్కొన్నారు. ఆమెను జైలుకు పంపితే.. సానుభూతి వచ్చి ఓట్లు పడతాయన్నది వాళ్ల లెక్క అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి పడే ఓట్లను చీల్చాలన్నదే ఆ రెండు పార్టీల ఆలోచన అని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య పొత్తు ఉంటే చెప్పుతో కొట్టాలంటూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు డ్రామా అని జగ్గారెడ్డి కొట్టి పారేశారు. వారి డైలాగులకు విలువ లేదన్నారు. లిక్కర్ కేసు.. కవిత అరెస్టు దాకా వెళ్లి ఆగిందంటేనే బండి సంజయ్ మాటకు విలువ లేదని తేలిపోయిందని పేర్కొన్నారు. ఇక చెప్పుతో కొట్టాలన్న మాట కూడా అలాంటిదేనని అన్నారు. కవిత అరెస్టు ఎపిసోడ్.. రాహుల్ గాంధీ ప్రధాని కాకుండా చేయాలన్న కుట్రలో భాగమేనన్నారు. ఈ కుట్రలో బీఆర్ఎస్ ఒక పావుగా తయారైందని విమర్శించారు.



వేడుకగా మాజీ ఎంపీ కొండా జన్మదినం..

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నేత, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి 64వ పడిలోకి అడుగుపెట్టారు. ఆదివారం హైదరాబాద్ అప్పా జంక్షన్‌లోని సంధ్య గార్డెన్స్‌లో ఆయన జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. పెద్ద ఎత్తున ఆయన అభిమానులు, బీజేపీ కార్యకర్తలు కార్యక్రమానికి హాజరయ్యారు. 2014లో చేవెళ్ల నుంచి ఎంపీగా గెలిచిన కొండా, ప్రస్తుతం కూడా అక్కడ్నుంచే బీజేపీ తరఫున టికెట్ రేసులో ఉన్నారు.

చేవెళ్ల సభకు అన్ని పార్టీల ఎమ్మెల్యేలు రావాలి

» రెండు గ్యారెంటీ పథకాలను సీఎం, ప్రియాంక ప్రారంభిస్తారు

» సన్నాహక సమావేశంలో శ్రీధర్‌బాబు

చేవెళ్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని పార్టీల ఎమ్మెల్యేలంతా చేవెళ్లలో ఈనెల 27న ప్రభుత్వం నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు హాజరుకావాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు కోరారు. ఆదివారం చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్‌లో బహిరంగ సభ సన్నాహక సమావేశాన్ని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. దీనికి మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి తదితరులు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేవెళ్ల సెంటిమెంట్‌ను కొనసాగిస్తోందన్నారు. మంగళవారం సభలో రెండు గ్యారెంటీ పథకాలు రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ ప్రారంభిస్తారని తెలిపారు. వంద రోజుల్లో ప్రజలకిచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. మార్చి నుంచి పేదలు 200 యూనిట్ల వరకు విద్యుత్ బిల్లులు చెల్లించాల్సిన అవసరం ఉండదన్నారు. రానున్న రోజుల్లో ప్రతీ నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ప్రకటించారు.

విద్య కాషాయీకరణకు కేంద్రం యత్నం

» నిరసన తెలిపినా దేశద్రోహం కేసులు

» భారత్ బచావో సదస్సులో వక్తలు

హైదరాబాద్ సిటీ/రాంనగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): "నూతన విద్యావిధానం-2020 అమలు చేయడం ద్వారా విద్యను కాషాయికరణ, ప్రైవేటీకరణ చేయ కేంద్రప్రభుత్వం ప్రయత్నిస్తోంది. దీనిని తిప్పికొట్టాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉంది. నిర్బంధాలను నిరసిస్తూ ఉద్యమిస్తున్నవారిపై దేశ ద్రోహం కేసులు నమోదు చేస్తున్నారని" అని పలువురు ఆరోపించారు. దేశంలోని వివిధ యూనివర్సిటీల విద్యార్థులతో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన రెండు రోజుల "భారత్ బచావో" జాతీయ సదస్సు నిర్వహించారు. ప్రొఫెసర్ అనితా రాంపాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించిన వారిపై నిర్బంధం ప్రయోగించిన విధంగానే విశ్వవిద్యాలయాల్లో కాషాయికరణకు వ్యతిరేకంగా గళమెత్తిన వారిపై కేంద్ర ప్రభుత్వం దాడులు చేయించి అణిచివేసే ప్రయత్నం చేస్తోందన్నారు. రైతుల 'చలో ఢిల్లీ' ఉద్యమ స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. అనితా హరగోపాల్ మాట్లాడుతూ భారత విద్యా వ్యవస్థ ప్రమాదంలో ఉందన్నారు. నూతన విద్యావిధానం ద్వారా విద్యలో మత, మూఢ విశ్వాసాలను చొప్పించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఢిల్లీ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ మధు ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, నిరసన తెలిపే హక్కులు కోల్పోయే ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్ మాట్లాడుతూ యూనివర్సిటీలో భావప్రకటన స్వేచ్ఛ కోసం విద్యార్థి సంఘాలు కలిసి పనిచేయాలని సూచించారు. సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులు తలచుకుంటే ఏదైనా సాధించగలరని, విద్యార్థుల న్యాయపోరాటానికి తాము మద్దతుగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్‌లో చేరికల జోరు

హస్తం గూటికి జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్... దీపాదాస్ మున్షీ పొన్నం సమక్షంలో చేరిక

» బీఆర్ఎస్‌కు తీగల కృష్ణారెడ్డి, అనిత రాజీనామా

» జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో బీఆర్ఎస్‌కు షాక్

» కాంగ్రెస్‌లో చేరిన 17మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లు

హైదరాబాద్/తార్నాక/సరూర్‌నగర్/మహేశ్వరం/జవహర్‌నగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. అధికార కాంగ్రెస్‌లోకి నేతల చేరికలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. పెద్దసంఖ్యలో నేతలు బీఆర్ఎస్‌ను వీడి హస్తం గూటికి చేరుతున్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డితోపాటు ఆయన కోడలు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి బీఆర్ఎస్‌కు రాజీనామాచేశారు. ఆదివారం మీర్‌పేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు తమ రాజీనామా నిర్ణయాన్ని ప్రకటించారు. రాజీనామా లేఖలను కేసీఆర్‌కు పంపించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గంలో తమకు ఏమాత్రం గుర్తింపు లేకుండా పోయిందని, అంతా మాజీ మంత్రి సబితారెడ్డి చెప్పుచేతల్లోనే నడుస్తుండడంతో తాము నిమిత్తమాత్రులుగా మిగ్యాలిపోయామని అన్నారు. తాను జడ్పీ చైర్‌పర్సన్‌గా క్యాబినెట్ హోదాలో ఉన్నప్పటికీ ఎమ్మెల్యే ఆదుపాజ్ఞల్లోనే మెలగాల్సిన దుస్థితి ఏర్పడిందని అనితా హరినాథ్‌రెడ్డి తెలిపారు. కేసీఆర్, కేటీఆర్ అంటే తమకు ఎంతో గౌరవం ఉండేదని, కానీ వారి పాలనలోని పెత్తందారీ పోకడలు తమను ఎంతగానో బాధించాయని తీగల కృష్ణారెడ్డి అన్నారు. రాష్ట్రంలో నిజమైన ప్రజా పాలన దిశగా అడుగులు వేస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పనితీరు నచ్చి కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. సోమవారం గాంధీభవన్‌లో దీపాదాస్ మున్షీ సమక్షంలో ఆ పార్టీలో చేరుతామన్నారు. మరోవైపు జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతారెడ్డి ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. తన భర్త శోభన్‌రెడ్డితో కలిసి గాంధీభవన్‌లో దీపాదాస్ మున్షీ, మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్‌లో జరుగుతున్న అవమానాలను భరించలేక అనేక మంది నేతలు కాంగ్రెస్‌లోకి వస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్‌లో ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందన్నారు.


శ్రీలతారెడ్డికి కాంగ్రెస్ కండువా కప్పుతున్న దీపాదాస్ మున్షీ

ఇదిలా ఉండగా.. శ్రీలతారెడ్డి కాంగ్రెస్‌లో చేరినా డిప్యూటీ మేయర్‌గా ఆమే కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. కార్పొరేటర్ల సంఖ్యాపరంగా కాంగ్రెస్‌కు బలం లేకపోయినా.. డిప్యూటీ మేయర్‌పై బీఆర్ఎస్ అవిశ్వాసం పెట్టకపోవచ్చన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

17 మంది జవహర్‌నగర్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లోకి..

జవహర్‌నగర్ మునిసిపల్ కార్పొరేషన్‌లోనూ బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. జవహర్‌నగర్ డిప్యూటీ మేయర్‌తోపాటు ఏకంగా 16 మంది కార్పొరేటర్లు గులాబీ పార్టీని వీడి ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి సమక్షంలో డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లు కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. 28 డివిజన్లు కలిగిన జవహర్‌నగర్ కార్పొరేషన్‌కు నాలుగేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో ముగ్గురు కార్పొరేటర్లు మాత్రమే కాంగ్రెస్ తరఫున గెలుపొందగా.. ఆ తరువాతి కాలంలో వారు కూడా బీఆర్ఎస్‌లో చేరారు. అయితే మేయర్ కావ్యపై అసంతృప్తితో 19 మంది కార్పొరేటర్లు 19న అవిశ్వాసం పెట్టి నెగ్గించుకున్నారు. దీంతో మాజీ మంత్రి మల్లారెడ్డి రంగంలోకి దిగి వారిని బీఆర్ఎస్‌లోనే ఉంచేందుకు ప్రయత్నాలు చేశారు. అయినా.. 17 మంది కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరేందుకు మొగ్గు చూపారు. ఇద్దరు మాత్రం బీఆర్ఎస్‌లోనే కొనసాగాలని నిర్ణయించుకున్నారు.

కడుపు నింపేవి కలుపు మొక్కలే..!

(మొదటి పేజీ తరువాయి)

ఆహార సమస్య తీవ్రమైంది. దాంతో 'మాలో' అనే కలుపు మొక్కలను సేకరిస్తున్న వ్యాపారులు.. ఒక కట్ట మొక్కలకు 80 ఇజ్రాయెలీ షెకెల్స్(భారత కరెన్సీలో సుమారు రూ.1,800) వసూలు చేస్తున్నారు. సాధారణంగా ఈ మొక్కను నోటి ఎలర్జీ, గొంతునొప్పి వంటి రుగ్మతలకు ఔషధంగా వాడుతారు. ఆహారంగా ఈ మొక్కను తీసుకోవడం ప్రమాదమని తెలిసినా.. ఆకలిని తట్టుకోవడానికి మరో మార్గం లేదని గాజా వాసులు వాపోతున్నారు. ఉత్తర గాజాలో మాత్రం నీరు, ఆహారం, ఔషధాల కొరత లేదని తెలుస్తోంది. అయితే.. గాజాకు ఉత్తరాన, వెస్ట్ బ్యాంక్‌లోని జబాలియా శిబిరంలోనూ ఆకలి కేకలు తీవ్రమయ్యాయి. దీంతో.. చనిపోయిన గుర్రాలను వండి పిల్లల కడుపు నింపాల్సి వస్తోందని శరణార్థులు వాపోతున్నారు. కాగా.. రంజాన్‌లోపు కాల్పుల విరమణ జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఈజిప్ట్ వర్గాలు వెల్లడించాయి.

ఢిల్లీలో రూ.2 వేల కోట్ల డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: దేశ రాజధాని ఢిల్లీలో భారీ డ్రగ్స్ రాకెట్ గుట్టు రట్టయింది. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్సీబీ), ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో అంతర్జాతీయ డ్రగ్ నెట్‌వర్క్‌ను ఛేదించారు. ఈ కేసులో తమిళనాడుకు చెందిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. మాదక ద్రవ్యాలను తయారు చేసేందుకు ఉపయోగించే 50 కిలోల రసాయనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో తమిళనాడుకు చెందిన ఓ సినీ నిర్మాత మాస్టర్ మైండ్‌గా ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఈ గ్యాంగ్ మూడేళ్లలోనే దాదాపు రూ.2వేల కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను విదేశాలకు సరఫరా చేసింది. ఢిల్లీలో మేథాంఫేటమిన్ అనే మాదక ద్రవ్యాన్ని తయారు చేసి విదేశాలకు పెద్ద ఎత్తున సరఫరా చేస్తున్నట్టు న్యూజిలాండ్ కస్టమ్స్ అధికారులు, ఆస్ట్రేలియా పోలీసుల నుంచి సమాచారం వచ్చినట్టు ఎన్సీబీ అధికారులు తెలిపారు.

క్యాన్సర్ చికిత్సలో భారతీయ మసాలాలు

▸▸ పేటెంట్ పొందిన ఐఐటీ మద్రాస్ పరిశోధకులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: క్యాన్సర్ చికిత్సలో భారతీయ మసాలాల వాడకానికి గానూ ఐఐటీ మద్రాస్ పరిశోధకులు పేటెంట్ హక్కులు పొందారు. 2028 నాటికి ఈ మందులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని సంబంధిత అధికారులు వెల్లడించారు. భారతీయ మసాలా దినుసుల్లోని నానోమెడిసిన్లు ఊపిరితిత్తులు, రొమ్ము, పెద్దపేగు, గర్భాశయ, నోటి, థైరాయిడ్ కణాలకు వ్యతిరేకంగా కేన్సర్ నిరోధక చర్యను చూపించాయని, సాధారణ కణాలపై మాత్రం ఎలాంటి ప్రభావం చూపించకుండా వాటిని సురక్షితంగా ఉంచాయని పేర్కొన్నారు. జంతువులపై చేసిన అధ్యయనాలు ఇటీవల విజయవంతంగా ముగిశాయని, 2027-28 నాటికి ఈ మందులను మార్కెట్‌లోకి అందుబాటులోకి తీసుకొచ్చే లక్ష్యంతో క్లినికల్ ట్రయల్స్ ప్లాన్ చేస్తున్నామని చెప్పారు.

డ్రైవర్ లేకుండానే 80 కిలోమీటర్లు వెళ్లిన గూడ్స్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: లోకో పైలట్, అసిస్టెంట్ లోకో పైలట్ లేకుండానే ఓ గూడ్స్ రైలు ఏకంగా 80 కిలో మీటర్లు దూసుకెళ్లింది. జమ్మూకశ్మీర్‌లోని కథువా నుంచి పంజాబ్‌లోని హోశియార్‌పూర్ జిల్లాలోని ఓ గ్రామం వరకు ప్రయాణించింది. ఆదివారం ఉదయం ఈ ఘటన జరిగింది. రైల్వే అధికారులు తెలిపిన మేరకు వివరాల ప్రకారం.. చిప్ స్టోన్లను లోడ్ చేసిన ఈ గూడ్స్ జమ్మూ నుంచి పంజాబ్‌కు బయల్దేరింది. డ్రైవర్ మార్పు కోసం కథువా రైల్వేస్టేషన్‌లో దీన్ని ఆపారు. లోకోపైలట్, అసిస్టెంట్ లోకోపైలట్ దిగిపోయాక వాలుగా ఉన్న ట్రాక్‌పై గూడ్స్ నెమ్మదిగా కదులుతూ వేగం పుంజుకుంది. ఈ విషయం తెలిసిన వెంటనే అధికారులు ఆ మార్గంలో రాకపోకలు, రైలు-రోడ్డు క్రాసింగ్‌ల వద్ద భద్రతపై సిబ్బందిని అప్రమత్తం చేశారు. చివరకు పంజాబ్‌లోని ఉంచి బస్సీ రైల్వే స్టేషన్ సమీపంలో అధికారులు ఇసుక బస్తాల సాయంతో ఆ గూడ్స్ రైలును ఆపేశారు.

గత దశాబ్దకాలంలో తలసరి వ్యయం డబుల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: దేశంలో నెలవారీ కుటుంబ తలసరి వ్యయం గత దశాబ్దకాలంలో రెండింతలకుపైగా పెరిగిందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ (ఎన్ఎస్ఎస్ఓ) 2022 ఆగస్టు నుంచి 2023 జూలై వరకు కుటుంబ వినియోగ వ్యయ సర్వే (హెచ్‌సీఈఎస్)ను నిర్వహించింది. ఈ సర్వే వివరాలను శనివారం విడుదల చేశారు. సర్వే ప్రకారం.. ప్రస్తుత ధరల వద్ద నెలవారీ సగటు కుటుంబ తలసరి వ్యయం (ఎంపీసీఈ) పట్టణప్రాంతాల్లో 2011-12లో రూ.2,630 ఉండగా.. 2022-23లో రూ.6,459కి పెరిగింది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఇది ప్రస్తుత ధరల వద్ద రూ.1,430 నుంచి రూ.3,773కు దూసుకుపోయింది. ఇక దేశ ప్రజలు బియ్యం, గోధుమలు వంటి ఆహార పదార్థాలపై తక్కువగా.. ప్రాసెస్ చేసిన ఆహారం, టీవీలు, ఫ్రిడ్జ్‌లు వంటి ఉత్పత్తులపై ఎక్కువగా ఖర్చు చేస్తున్నట్టు సర్వేలో వెల్లడైంది. ఆహారంపై గ్రామీణ వినియోగదారుల నెలవారీ ఖర్చు 2011-12లో 53% ఉండగా.. అది 46 శాతానికి తగ్గింది. అలాగే పట్టణ ప్రాంతాల్లో 43% నుంచి 39 శాతానికి తగ్గిపోయింది.

హరియాణా లోక్‌దళ్ అధ్యక్షుడు రాఠీ హత్య

చండీగఢ్, ఫిబ్రవరి 25: ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ హరియాణా శాఖ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే నఫే సింగ్ రాఠీని ఆదివారం సాయంత్రం కొందరు గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. కారులో ఉంటూ మాటువేసిన ఆ వ్యక్తులు ఆయన ప్రయాణిస్తున్న ఎస్‌యూవీ వాహనంపై ఆకస్మికంగా తుపాకీతో కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఆయనతో పాటుగా ఆ వాహనంలో ఉన్న మరో ఇద్దరు వ్యక్తులు మరణించగా, ఇంకో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. తన స్వస్థలమైన ఝజ్జర్ జిల్లా బహదూర్‌గఢ్‌లో ఈ సంఘటన చోటుచేసుకుంది. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయి, అతని సహచరుడు కాలా ఇందుకు బాధ్యులని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆస్తి వివాదంలోనే ఈ హత్య జరిగి ఉంటుందని భావిస్తున్నారు.

మోదీ స్కూబా డైవింగ్

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించారు. కొన్నింటికి శంకుస్థాపన చేశారు. ఓఖా-బెట్ ద్వారక మధ్య నిర్మించిన దేశంలోనే అతి పెద్ద కేబుల్ బ్రిడ్జ్ (తీగల వంతెన)ను ప్రారంభించారు. అనంతరం, సముద్రంలో ఉన్న ద్వారక నగర అవశేషాలను సందర్శించటానికి పంచ్‌కుయి బీచ్ నుంచి స్కూబా డైవింగ్ చేశారు. ఆయనకు సాయంగా నౌకాదళ డైవర్లు కూడా సముద్రంలోకి వెళ్లారు. సముద్ర గర్భంలో మోదీ పద్మాసనం వేసి, ముఖులిత హస్తాలతో శ్రీకృష్ణుడిని ప్రార్థించారు. నెమలి ఈకలను సమర్పించారు. బయటకు వచ్చిన అనంతరం తన అనుభవాలను పంచుకుంటూ.. అత్యంత దివ్యమైన అనుభూతి కలిగిందని, ద్వారక సందర్శనకు ధైర్యంకన్నా విశ్వాసమే కీలకమని చెప్పారు. ప్రాచీన నగరాన్ని స్పృశించినప్పుడు 21వ శతాబ్దంలో వైభవోపేత భారతదేశం తనముందు కదలాడిందని, చాలాసేపు నీళ్లలోనే గడిపానని తెలిపారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మలచాలన్న తన నిశ్చయం మరింత బలపడిందన్నారు. ద్వారకను సందర్శించాలన్న తన కోరిక దశాబ్దాల నాటిదని, నేడు అది పూర్తి కావటంతో అపరిమితమైన సంతోషం కలిగిందని మోదీ తెలిపారు.

కాంగ్రెస్‌పై విమర్శల వర్షం

అంతకుముందు ప్రధాని మోదీ.. దేశంలోనే అతి పెద్ద కేబుల్ బ్రిడ్జి 'సుదర్శన్ సేతు'ను ద్వారకలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ విపక్ష కాంగ్రెస్‌పై ధ్వజమెత్తారు. దేశాన్ని సుదీర్ఘకాలం పరిపాలించిన ఆ పార్టీకి ప్రజల కనీసావసరాలు తీర్చాలనే చిత్తశుద్ధి, అంకితభావం లేనేలేదన్నారు. ఆ పార్టీ శక్తియుక్తులను ఒక్క కుటుంబం అభివృద్ధి కోసం, ఐదేళ్లపాటు ప్రభుత్వాన్ని నడపటం కోసం, కుంభకోణాలను దాచిపెట్టడం కోసం వినియోగిస్తారని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో అనేక కుంభకోణాలు చోటుచేసుకున్నాయని, తాను ప్రధాని అయిన తర్వాత వాటిని అడ్డుకున్నానని.. దానివల్లే దేశంలో సుదర్శన్ సేతు వంటి భారీ మౌలిక సదుపాయాల నిర్మాణం సాధ్యమైందని తెలిపారు. ప్రజల ఆకాంక్షలను తీర్చే సామర్థ్యం కాంగ్రెస్‌కు లేనందువల్లే వారి హయాంలో భారత్ 11వ ఆర్థిక వ్యవస్థగా ఉండేదని, ప్రజల ఆశీర్వాదంతో తాను ప్రధాని అయిన తర్వాత ఈ పదేళ్లలో భారత్ 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని మోదీ పేర్కొన్నారు. ఆరేళ్ల కిందట శంకుస్థాపన చేసిన సుదర్శన్ సేతును ప్రారంభించటం తన అదృష్టమని, మోదీ గ్యారెంటీకి ఇది నిదర్శమని చెప్పారు. తాను గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు ఈ బ్రిడ్జి నిర్మాణం గురించి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏడుసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఆమోదం లభించలేదని మోదీ తెలిపారు.



సుదర్శన్ సేతును ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ

కేరళకు మరోసారి మోదీ

ప్రధాని మోదీ మరోసారి కేరళలో పర్యటించనున్నారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో మోదీ పదేపదే కేరళలో పర్యటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. రెండు నెలల కాలంలో కేరళకు మోదీ రావడం ఇది మూడోసారి. దక్షిణాది రాష్ట్రాలలో బలపడాలన్న బీజేపీ వ్యూహం మేరకు ఈ ప్రాంతంపై ఆ పార్టీ అగ్ర నాయకత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ క్రమంలో పోయిన జనవరిలో కేరళలో పర్యటించిన ప్రధాని మోదీ ఈ నెల27వ తేదీన మళ్లీ కేరళకు రానున్నారు. ఆ రాష్ట్ర బీజేపీ నేతలు చేపట్టిన పాదయాత్ర ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు.

వంతెనతో ద్వారకానాథ్ సందర్శన ఇక సులువు

పాత, కొత్త ద్వారకలను అనుసంధానించే 2.32 కి.మీ.ల పొడవైన సుదర్శన్ సేతును రూ.980 కోట్ల వ్యయంతో నిర్మించారు. దీనిద్వారా ద్వారకానాథ్ ఆలయాన్ని సందర్శించే భక్తులకు సులువుగా వెళ్లిరావటానికి వీలవుతుంది. ద్వారకానాథ్ ఆలయం ద్వారక నగరానికి 30 కి.మీ.ల దూరంలో బెట్ ద్వారక అనే దీవిలో ఉంది. ఈ ఆలయానికి భక్తులు ఓఖా నౌకాశ్రయం నుంచి పడవల మీద వెళ్లివస్తుంటారు. కేబుల్ బ్రిడ్జి వల్ల ఇప్పుడు ఆ అవసరం లేదు. కేబుల్ బ్రిడ్జి ఫుట్‌పాత్ పైభాగం మీద సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. బ్రిడ్జి మీద మార్గాన్ని నాలుగు లేన్లుగా మలిచారు. వంతెనకు ఇరువైపులా భగవద్గీతలోని శ్లోకాలు, శ్రీకృష్ణుడి చిత్రాలను చిత్రించారు. దీంతో ఈ తీగల వంతెన ఓ పర్యాటక ప్రాంతంగా మారే అవకాశం ఉంది.

తొలి ఓటు దేశానికే!

▸▸ నవ యువ ఓటర్లకు ప్రధాని పిలుపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: యువ ఓటర్లు తమ మొదటి ఓటును దేశం కోసం వేయాలని ప్రధాని మోదీ కోరారు. రికార్డు స్థాయిలో భారీగా తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపిచ్చారు. వచ్చే (18వ లోక్‌సభ) వారి ఆశలు, ఆకాంక్షలను ప్రతిబింబిస్తున్న ఆశాభావం వ్యక్తంచేశారు. ఆదివారం ఆకాశవాణిలో 'మన్ కీ బాత్' 110వ సంచికలో ఆయన ప్రసంగించారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తున్నందున వచ్చే 3 నెలల పాటు 'మన్ కీ బాత్'కు విరామం ఇస్తున్నట్లు ప్రకటించారు. 111వ సంచికతో ప్రజల ముందుకు వస్తానని వెల్లడించారు. ఈ ఎపిసోడ్‌లో యువత, నారీశక్తి గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. 'అన్ని రంగాల్లో నారీశక్తి ముందుంది' అన్నారు. మహిళల కోసం తాము అమలు చేస్తున్న పథకాలను ప్రస్తావించారు. 'కోటి మంది లక్షాధికారిణులను తయారుచేసే 'లఖ్‌పతీ దీదీ' పథకం అమలు చేస్తున్నాం. 'నమో డ్రోన్ దీదీ' స్కీం మన గ్రామాల్లో మహిళలను జీవితాలను మార్చేస్తోంది. ప్రకృతి సాగులో,జలసంరక్షణ, పారిశుద్ధ్యంలో మహిళలు తమ నాయకత్వ సామర్థ్యాన్ని చాటుకుంటున్నారు' అని కొనియాడారు. మార్చి 3న ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం జరుపకోనున్న విషయాన్ని మోదీ ప్రస్తావించారు. ప్రభుత్వ కృషి కారణగా గడచిన కొన్నేళ్లలో పెద్ద పులుల సంఖ్య పెరిగిందన్నారు. మాదకద్రవ్యాలకు యువత బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేసిన మోదీ.. ఈ మహమ్మారిపై పోరాటానికి పటిష్ఠ కుటుంబాలు అవసరమన్నారు. యువతను మాదక ద్రవ్యాలకు దూరం చేసేందుకు 'గాయత్రీ పరివార్' నిర్వహించిన 'అశ్వమేథ యాగం' కార్యక్రమాన్ని ఉద్దేశించి వర్చువల్‌గా ఆయన ప్రసంగించారు. కుటుంబసభ్యులంతా తరచూ మాట్లాడుకోవాలని, అప్పుడే బంధాలు బలపడతాయని, కుటుంబ విలువలు పెరుగుతాయని చెప్పారు. కాగా, పశుసంవర్ధకం గురించి మాట్లాడితే జనం గోవులు, గేదెల పెంపకం గురించి మాత్రమే అనుకుంటున్నారని.. కానీ మేకలు కూడా ముఖ్యమైనవని ప్రధాని పేర్కొన్నారు. ఒడిసాలోని కలహండి జిల్లా సాలెభటా గ్రామానికి చెందిన దంపతుల గురించి ప్రస్తావిస్తూ.. వారు సృష్టించిన 'గోట్ బ్యాంక్ (మణికస్తు మేకల బ్యాంకు)'ను కొనియాడారు.

పొత్తు పొడిచింది!

(మొదటి పేజీ తరువాయి)

త్వరలో స్పష్టత వస్తుందని, ఏ పార్టీకి ఎన్ని సీట్లు అన్నదానిపై చర్చలు నడుస్తున్నాయని వెల్లడించాయి. పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్‌కు తొలుత 2 సీట్లే కేటాయిస్తానని చెప్పిన తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ఇప్పుడు 5 సీట్ల వరకు ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారని, అయితే తమకు అస్సాంలో 2 సీట్లు, మేఘాలయలో ఒక సీటు కావాలని ఆమె కోరారని పేర్కొన్నాయి. చర్చలు చివరి దశలో ఉన్నాయని, పశ్చిమ బెంగాల్‌లో ఇండియా కూటమి దెబ్బతినకుండా చూడటం చారిత్రక అవసరమని మిత్రపక్షాలు భావిస్తున్నాయని వెల్లడించాయి. మహారాష్ట్రలో కాంగ్రెస్ 14, ఉద్ధవ్ ఠాక్రే శివసేన 15, శరద్ పవార్ ఎన్సీపీ 9 సీట్లలో పోటీ చేసేందుకు సూత్రప్రాయంగా అంగీకారం కుదిరిందని, మిగిలిన 8 సీట్లపై ఇంకా చర్చలు జరుగుతున్నాయని కాంగ్రెస్ వర్గాలు తెలియజేశాయి.

యూపీలో పొత్తు కీలకం

దేశంలో అతి పెద్ద రాష్ట్రమైన యూపీలో సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), కాంగ్రెస్‌ల మధ్య సీట్ల ఒప్పందం కుదరడం కీలక రాజకీయ పరిణామంగా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఎస్పీ 63 సీట్లు, కాంగ్రెస్ 17 సీట్లలో పోటీ చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇండియా కూటమి నుంచి ఆర్ఎల్డీ తప్పుకొని బీజేపీతో చేతులు కలపడంతో.. కాంగ్రెస్‌కు యూపీలో గణనీయమైన సంఖ్యలో సీట్లు లభించాయి. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే పంట ఉత్పత్తుల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చేసిన ప్రకటనతో.. రైతుల సంఖ్య గణనీయంగా ఉన్న పశ్చిమ యూపీలో కాంగ్రెస్‌కు ప్రయోజనం లభించవచ్చునని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ప్రాంతంలో ఆర్ఎల్డీ ప్రభావం అధికం. ఇక్కడ కాంగ్రెస్ ఐదు స్థానాల్లో పోటీ చేస్తోంది. ఎస్పీ, కాంగ్రెస్ పొత్తు వల్ల యూపీలోని 80 లోక్‌సభ స్థానాల్లో కనీసం 24 స్థానాలు ప్రభావితం అయ్యే అవకాశం ఉంది. రాష్ట్ర జనాభాలో 19 శాతం పైగా ఉన్న ముస్లింలు ఈ 24 స్థానాల్లో గణనీయంగా ఉన్నారు. వారి ఓట్లు చీలకుండా ఉండాలన్న లక్ష్యంతోనే ఎస్పీ, కాంగ్రెస్ పొత్తు పెట్టుకున్నాయి. ఈ పార్టీల పొత్తుతో.. యూపీలో బీజేపీ గత ఎన్నికల్లో గెలిచిన 64 సీట్లను కూడా నిలబెట్టుకోలేకపోవచ్చునని రాజకీయవిశ్లేషకుల అంచనా.

ఆశ్చర్యంలో బీజేపీ నేతలు

ఢిల్లీ, హరియాణా, గుజరాత్, చండీగఢ్, గోవాల్లో కాంగ్రెస్‌కు, ఆమ్ ఆద్మీ పార్టీకి మధ్య సీట్ల పంపిణీ సజావుగా జరగడంపై బీజేపీ నేతలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. జేడీయూ, ఆర్ఎల్డీ నిష్క్రమణతో ఇండియా కూటమి బీటలు వారిందని అనుకుంటే.. మళ్లీ పుంజుకోవటంతో వారు పునరాలోచనలో పడుతున్నారు. గత ఎన్నికల్లో గుజరాత్‌లో మొత్తం 26 సీట్లు, హర్యానాలో మొత్తం 10 సీట్లు, ఢిల్లీలో మొత్తం 7 సీట్లు దక్కించుకున్న బీజేపీకి.. కాంగ్రెస్, ఆప్ కలయిక వల్ల.. ఈ 43 సీట్లలో ఎదురు గాలి తప్పదని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. పంజాబ్‌లో విడివిడిగా పోటీ చేయాలని కాంగ్రెస్, ఆప్ నిర్ణయించడం వ్యూహాత్మకంగా జరిగిందని, దీని వల్ల తమకు నష్టం కలగదని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఇక బీహార్‌లో నితీశ్ నిష్క్రమణతో ఇండియా కూటమి పక్షాలకు సీట్ల పంపిణీ మరింత సులువైంది. మొత్తం 40 సీట్లలో ఆర్జేడీ 28, కాంగ్రెస్, వామపక్షాలు చెరో 6 సీట్ల చొప్పున పోటీ చేస్తాయని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. గత ఎన్నికల్లో బిహార్‌లో 39 సీట్లు గెలుచుకున్న ఎన్డీఏకు ఈసారి 10-15 సీట్ల వరకు నష్టం జరగవచ్చని, వాటిని తమ కూటమి కైవసం చేసుకుంటుందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. కేరళలో వామపక్ష ఎల్డీఎఫ్, కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ మధ్యే పోరు కేంద్రీకృతం కానుంది. అక్కడ బీజేపీ నామమాత్రంగానే ఉంది. మొత్తం 20 సీట్లలో కాంగ్రెస్ 16 సీట్లకు పోటీ చేస్తుందని, మిగతా నాలుగు సీట్లు కేరళ కాంగ్రెస్, ఐయూఎంఎల్, ఆర్ఎస్పీలకు కేటాయిస్తుందని సమాచారం. తమిళనాడులోని 38 సీట్లలో ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య ఇప్పటికే చర్చలు ప్రారంభమయ్యాయి. వీసీకే, మనితనీయ మక్కలి కచ్చి, కమల్‌హాసన్ నేతృత్వంలోని మక్కల్‌నీది మయ్యం పార్టీలకు కూడా సీట్లు కేటాయించాల్సి ఉన్నందున గతంలో 9 సీట్లలో పోటీ చేసిన కాంగ్రెస్ ఈసారి ఒకటి రెండు సీట్లు త్యాగం చేయాల్సి ఉంటుందని డీఎంకే వర్గాలు కోరాయి. ఈ విధంగా ఉత్తరప్రదేశ్‌లోని 80 సీట్లు, మహారాష్ట్ర-48, బిహార్-40, పశ్చిమబెంగాల్-42, తమిళనాడు-39, గుజరాత్-26, కేరళ-20, జార్ఖండ్-14, అస్సాం-14, పంజాబ్-13, హరియాణా-10, ఢిల్లీ-7, గోవా-2, మేఘాలయ-2, చండీగఢ్-1.. మొత్తం 358 సీట్లలో ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల మధ్య పొత్తులపై క్రమంగా స్పష్టత వస్తుందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. కాగా ఇండియా కూటమి పక్షాలు సీట్ల పంపకాల దిశగా అడుగులు వేస్తుండగా.. ఎన్డీఏ పార్టీల మధ్య పొత్తులు ఒక కొలిక్కి రావల్సి ఉంది.

చైనా వస్తువులతో చిన్న పరిశ్రమలు కుదేలు

▸▸ భారత్ జోడో న్యాయ్ యాత్రలో రాహుల్

▸▸ అలీగఢ్‌లో యాత్రకు హాజరైన అఖిలేశ్

అలీగఢ్, ఫిబ్రవరి 25: చైనా వస్తువులు వరదలా వచ్చి పడుతుండడంతో స్వదేశీ, చిన్న, కుటీర పరిశ్రమలు కుదేలు అవుతున్నాయని, వృత్తిదారులు ఉపాధి కోల్పోయి నానా కష్టాలు పడుతున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. భారత్ జోడో న్యాయ యాత్ర చేస్తున్న ఆయన ఆదివారం మొరాదాబాద్ నుంచి సంభల్ మీదుగా అలీగఢ్‌కు చేరుకున్నారు. రాహుల్ యాత్రలో సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ కూడా పాల్గొన్నారు. రాహుల్‌కు కాంగ్రెస్, ఎస్పీ కార్యకర్తలు, మద్దతుదారులు, స్థానికులు పెద్ద సంఖ్యలో స్వాగతం పలికారు. వారిని ఉద్దేశించి రాహుల్ మాట్లాడారు. తాళాల పరిశ్రమకు అలీగఢ్ ప్రసిద్ధి చెందిన విషయాన్ని ప్రస్తావించారు. కానీ చైనా నుంచి చౌక ఉత్పత్తులు భారత మార్కెట్‌ను ముంచెత్తుతూ ఇలాంటి పరిశ్రమలను దెబ్బ తీస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక మాట్లాడుతూ సైన్యంలో చేరాలని కలలు కన్న యువత కలలను మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్నివీర్ పథకం భగ్నం చేసిందని విమర్శించారు. ఈ 'అన్యాయ కాలం'లో నిరుద్యోగ సమస్య అతిపెద్ద సంక్షోభంగా ఉందన్నారు. అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతులు ఉద్యమిస్తున్నారని, వారి శక్తిని చూసి కేంద్రం భయపడుతోందన్నారు. ఇండియా కూటమి బీజేపీని గద్దె దింపుతుందని వ్యాఖ్యానించారు.



జోడో న్యాయ్ యాత్రలో రాహుల్, ప్రియాంక

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.